ఆంధ్రసచిత్రవార

పత్రిక


25-11-66



35 పైసలు

M & TP Licence No. 76/64-5.

ఆరోగ్యమే మహాభాగ్యం



గాలిలో ఉండే వ్యాధి కారక క్రిములు మన దేహంలో ప్రవేశించడమే మన శరీరఉష్ణం పెరగటానికిగాని, తగ్గటానికిగాని కారణం. ఇందువల్లను, ఇంకా ఇతర అంటువ్యాధులవల్లను మన ఆరోగ్యం చెడిపోయి మన శరీరావయవాలు, లోపలిభాగాలు మామూలుగా పనిచెయ్యటం మానివేస్తాయి. అలాంటి సందర్భాలలో మనం మన ఆరోగ్యాన్ని సరిచేసుకొనక శరీరావయవాలను బలవంతంగా పనిచేయింపిస్తే అల్పజాడ్యాలే ప్రమాదకరమైనవిగ పరిణమిస్తాయి. మీ ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు, తిరిగి పొందేందుకు దేహానికి టిష్యూలకు బలమిచ్చేందుకు, బరువు పెంచేందుకు, బలం పెంపొందించేందుకు ప్రకృతిసిద్ధంగా సన్నగా ఉండేవారు, బరువు తక్కువగా ఉండేవారు కూడ "మదన్-మిత్ర" వాడతారు.

మీ మనశ్శక్తిని, శరీరదార్ఢ్యతను కాపాడుకునేందుకు, తిరిగి పొందేందుకు అనేక కారణాలవల్ల పరిస్థితులవల్ల పోగొట్టుకొన్న యువ్వనశక్తిని తిరిగి పొందేందుకు **మదన్-మిత్ర**ను వాడండి.

మదన్-మిత్ర

ఇది అలసట, అరుచి, అజీర్ణం, అవయవములు మొద్దుబారటం, నిద్రలేమి, నాడీదౌర్బల్యం, మలబద్ధం, కడుపునొప్పి, బలహీనత, ప్రమేహం, రొమ్మునొప్పి, ఆకలిమందగింపు, అధికదప్పిక ఇత్యాది అన్ని రొమ్మునొప్పి రుగ్మతలను నివారించి అవయవదార్ఢ్యతను సమకూర్చి శరీరానికి ఎక్కువబలం, రంగు, బరువు లిస్తుంది. **మదన్-మిత్ర** ఛాతీ పెంచి, శరీరబలాన్ని తిరిగి నిర్మించి అందమైన ఆకర్షణీయమైన వర్చస్సు నిస్తుంది.

ఆరోగ్యాన్ని కాపాడే, తిరిగి చేకూర్చే, వ్యాధులను నిర్జించే పటుమైన అనేక విటమిన్లుగల శక్తివంతమైన 60 కి పైబడిన ఆయుర్వేద మూలికలతో కూడినది **మదన్-మిత్ర**

మదన్-మిత్ర అలసట పనిభారముచేత, క్రమమైన అలవాట్లు లేకపోవటంచేత అకాలంగా పెద్ద వయస్సు లక్షణాలు పొందటం మొదలైన అన్ని దౌర్బల్యాలకు మేలైనది. పటుమైన ఔషధగుణాలతో నిండిన **మదన్-మిత్ర** సేవించటానికి రుచికరమైనది. పత్యనియమాలు లేవు. వెల: 450 గ్రాములు 40 దినముల మందు రు. 10/-లు. వి. పి. పి. ఛార్జి అదనం. మీకు కావలసినదానికి వెంటనే వ్రాయండి.

ఈ మందుగుణం బహు కొద్దికాలంలో కనిపిస్తుంది. ఏమంటే అనేక విటమిన్లు, అనేక ఫలాలు ఇందులో చేరివున్నాయి. మదన్-మిత్రలోగాని **వనితామృతం** లోగాని జంతుకొవ్వులు, మత్తు పదార్థాలు చేరలేదు. కాబట్టి దీన్ని వాడేప్పుడు శరీర వ్యాయామం చెయ్యవలసిన అవసరంలేదు.

వనితామృతం

ఇది బలహీనమైన స్త్రీల శరీరదార్ఢ్యతను, చక్కదనం, లావణ్యాన్ని, వర్చస్సును పెంపొందిస్తుంది. ఇది అలసట, రక్తహీనత, అగ్నిమాంద్యం, అజీర్ణం, బలహీనత, మలబద్ధం, దిమ్ము, స్రావం, కడుపునొప్పి, నరాల దౌర్బల్యం, ప్రహాతవ్వటం, యుదాలోఫం, వికారం, పనిమీద అయిష్టత, దాహం, పాలిపోయిఉండటం, మొదలైన గర్భిణీసమయంలోను, ప్రసవానంతరం, ఋతు సమయాలలోను కలిగే రుగ్మతలను పోగొట్టి శరీరానికి బలాన్ని వర్చస్సును ఇస్తుంది. ఇది ఋతుస్రావాన్ని చక్కబరచి బహిష్టు బాధలను తొలగిస్తుంది. గర్భిణీస్త్రీలువాడితే సుఖప్రసవానికి తోడ్పడుతుంది. స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడేందుకు యువ్వన పాటవాన్ని తిరిగి చేకూర్చేందుకు **వనితామృతం** చాల మంచి ఔషధం. పత్యం లేదు. 450 గ్రాములు 40 రోజుల మందు వెల : రు. 10/— వి. పి. పి. చార్జి అదనం. ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయండి.

—: హెడ్డాఫీసు :—

MADAN—MITHRA AUSHADALAYA, P. B. No. 44, PALGHAT (KERALA)

మద్రాసు సేల్సు డిపో :

346, పూనమల్లి హైరోడ్డు, మద్రాసు-3.

బెంగుళూరు ఏజెంటు :

మెసర్సు శోభా మెడికల్ స్టోర్సు, డి-49, కాటన్ పేట, మెయిన్ రోడ్, బెంగుళూరు-2.

పోస్టు ద్వారా పంపవలసిన ఆర్డర్లు హెడ్డాఫీసు (పాలఘాట్) కు పంపవలెను.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 25—11—'66

పరాభవనామ సం॥ కార్తీకమాస॥ శు॥ త్రయోదశి

సంపుటము : 59 సంచిక : 11

*

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
1, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

చందా వివరాలు :
భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధ సంవత్సర చందా	16.00

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనలోనూ దానిరచయితగాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేననీ, దేనికీ అనుకరణ కాదని హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించలేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

మనలోమాట

ఆమ్రపాలి సీరియల్ ఈవారంతో అయిపోతున్నది. పైవారం ప్రారంభం అయే కొత్త సీరియల్ నవలకు సంబంధించిన ప్రకటనను ఈ సంచికలోని 7 వ పేజీలో వేశాము...

* * *

బ్రిటిష్ పత్రికారచయిత్రి గ్లోరియా స్టువార్ట్ రాసిన 'కమ్యూనిస్టు చైనాలో నా అనుభవాలు' ఈవారంతో ముగుస్తున్నది...

* * *

ప్రతిభగల విద్యార్థుల, ఉపాధ్యాయుల పై చదువులకు చేయూతనిచ్చి, వారి ఉజ్వల భవిష్యత్తుకు దోహదం కల్పించే సంస్థకు సంబంధించిన వివరాల్ని గురించి శ్రీ బి. ఎస్. ఆర్. కృష్ణ రాసిన వ్యాసాన్ని ఈ సంచికలోని 10 వ పేజీలో పాఠకులు చూడవచ్చు.

* * *

ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన 'గోసంరక్షణ సంఘం' ఆందోళనదారుల దురాగతాలని ఈవారం న్యూఢిల్లీలేఖలో శ్రీ శ్రీకృష్ణ చర్చించారు.

* *

స్థలాభావంచేత ఈవారం వైజ్ఞానికగాథ శతి, ఉత్తరాలు, పుస్తకాల శీర్షికల ప్రచురణ సాధ్యం కాలేదు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం : 'అర్ధరాత్రి'లో రాధిక.

కథలు :

సిజా..జాలు — 14
అంతర్ముఖుడు — 28
మనసులోని తుంపె — 42

సీరియల్ కథలు:

ఆమ్రపాలి — 36
సుప్రభాతం — 48

శీర్షికలు, వ్యాసాలు, సినిమా.

ఉమెన్ కార్నర్ — 6, న్యూఢిల్లీలేఖ — 7, ప్రతిభగల విద్యార్థుల పై చదువులకు చేయూత నిచ్చే సంస్థ — 10, కమ్యూనిస్టు చైనాలో నా అనుభవాలు — 12, వారఫలం — 20, బాల సాహితి — 22, వనితాలోకం — 24, కామంజ్ — 46, చిత్రలహరి — 54.


దేశీయాంగమంత్రిగా
చవన్ ప్రవేశం
జయప్రకాశ్
తిరిగి రాజకీయాలలో
ప్రవేశించదల్చుకో
లేదు
ఇంద
తీసుకో!
భద్రతా సంఘం
ఎన్నికలలో అరబ్ లీగ్
భారత్‌కు వ్యతిరేకంగా
ఓటు చేసింది.
తీర్చుకున్న ఋణం.

గో సంరక్షణ - జనసంఘర్షణ

'జాతిమత సంయుక్తమైన హిందూ దేశంలో మేముండడానికి తగము, అంచేత మహమ్మదీయులకు పాకిస్తానును వేరు చేసేయండి' అని, పూర్వం మహమదాలీ జిన్నాగారు వాదించి వున్నారు. నవంబరు ఏడవ తేదీ సోమవారం నాడు ఢిల్లీలో జరిగిన దుస్సంఘటన, అప్పటి జిన్నాగారి వాదనకు నిదర్శనమా అన్నట్టుగా తోస్తోంది! హిందూమత సంస్కృతినే కాకుండా 'జన సంఘ సాంప్రదాయాన్ని' నిరూపించిన ఈ సంఘర్షణ, హైందవుల్నీ, హైందవేతరుల్నీ—కలచి వేసింది.

జనసంఘం లేవదీసిన ఈ రభసలోని ఆంతర్యం అందరికీ తెలిసిందే. తెలియంది ఏమిటీ అంటే ప్రభుత్వం ఆస్తిని పాడు జేయడం, ప్రజల ఆస్తిని నాశనం చేయడం, ముఖ్యంగా ఉదరపోషణం కోసం ఉద్యోగులుగా వున్న సచివాలయ గుమాస్తాలకు నష్టాన్ని కలిగించడం లాంటి దుశ్చర్యల్లోని పరమార్థం! సామూహికమైన ఈ ఆందోళనలో ఎంత ఆస్తికి నష్టం వాటిల్లిందో చెప్పడానికి శక్యంకాదు.

మొదటి నుంచి ప్రారంభించనివ్వండి. 'గో సంరక్షణ సంఘం' అనే పేరుతో గోవధను నిరోధించడానికి ఒక కార్యాచరణ సంఘం ఏర్పరచబడింది. తన ఘనతను చాటుకొంటూ, ఈ మహత్కార్యానికి ఒక కోటి రూపాయిల నిధిని జన సంఘం సేకరించింది. నగరంలో ఈ కార్యాచరణ సంఘం విడిది చేసిన చోట గుడారాలు లేసబడ్డాయి. పరిసర గ్రామాల నుంచి వంటల వాళ్ళు రావింపబడ్డారు. ఆ ప్రదేశమంతా పెద్ద ఉట్సాహంగా తయారైంది. జాలిగుండెలు గల దిగంబర సాధువులు లగాయితు అనేక మంది సాధువులు అప్పటికు విచ్చేసి వున్నారు. జాలిగుండెలు గల సాధువులని వారి నెందుకు పిలవాలీ అంటే, అవసరమైనప్పుడు తమ 'త్రిశూలా'లతో పోలీసుల్ని చంపేందుకయినా వెనకాడరు గనక! కొందరు సాధువులు మందు గుండు సామానుతో ప్రసన్నులైనారు. కొందరు పెట్రోలు తడిసిన గుడ్డలతో ప్రత్యక్షమైనారు. మరికొందరు తమ కాషాయరంగు సంచుల్లో బాంబులను కూడా భద్రపరచుకున్నారు!

పార్లమెంటు వీధి మధ్యగా ఒక పెద్ద వేదికను నెలకొల్పారు. ఆ వీధి చివరిదాకా లౌడ్‌స్పీకర్లు అమర్చారు. పార్లమెంటు భవనానికి కొంత పోలీసు రక్షణ వుంది. రిజర్వు బ్యాంకు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సహా పార్లమెంటు వీధిలోని మరి ఏ యితర భవనానికి రక్షణ ఏర్పాట్లు చేయబడలేదు. ప్రభుత్వం పాలించడానికి పన్నులు రూపంగా ధనాన్ని సమకూర్చిపెట్టే న్యాయవర్తనులైన ప్రజల రక్షణగురించి వేరే చెప్పనే అక్కర్లేదు! కామరాజ్ గారి యింటిని ధ్వంసం చేసిన ఈ ముఠా ఆయన్ని హతంచేసి ఆ గృహాన్ని కసాయి దుకాణంగా ఎందుకు మార్చలేకపోయామా అని విచారించినట్టువాళ్ళ ఘోరకృత్యంద్వారా అర్థమవుతూనే వుంది. పార్లమెంటు భవనానికి ఏర్పరచబడినంత రక్షణ, అదే వీధిలో ఉన్న ఇతర భవనాలకు ప్రభుత్వం ఎందుకు కల్పించలేక పోయిందా అనేది ఆలోచించవలసి వుంటుంది.

విపక్షణ:

మంత్రి రఘురామయ్యగారి యింటిని ఈ ముఠా చిన్నాభిన్నం చేస్తున్నప్పుడు 'అది కామరాజ్ గారి ఇల్లుకాదని' ఎవరో సూచించారట! అదే ప్రాంతంలో నివసిస్తున్న ఉత్తరాది మంత్రులు కడుపులో నీళ్ళు కదలకుండా కూర్చున్నారు. దక్షిణాది నాయకులు ఉద్రిక్తతకు 'ఎర' కాబడ్డారు. ధ్వంసం చేస్తున్న యిల్లు, రఘురామయ్యగారిదని తెలుసుకున్న 'మూక' కామరాజ్ గారి ఇంటిమీద దాడి చేసింది. ఇదీ కథ.

ప్రభుత్వ రంగంలో అస్తవ్యస్తమైన పరిస్థితి కల్పించేందుకుగాను, ప్రజల్లో అలజడి లేపేందుకు గాను ముందుగా చక్కని పథకం వేసుకుని ఈ ఆందోళన అమలు జరపబడింది అనడానికి నిదర్శనముంది. ఇటువంటి దుర్గాగతం జరుగుతుందని ప్రభుత్వానికి ముందుగా తెలిసి వున్నట్టయితే, ఇంత ప్రజానష్టం, ఆస్తి నష్టం జరక్కముందే తగిన జాగ్రత్త ఎందుకు తీసుకోలేక పోయింది? బ్రిటిష్ వారి గూఢచారులు కాంగ్రెసు కార్య వర్గంలోనే వున్నట్టు కొన్ని రిపోర్టుల వల్ల తెలుస్తున్నది. దేశీయాంగశాఖకు స్తోమతుగల గూఢచారి సంస్థ ఒకటి వుంది. ఇంత సమర్థనీయమైన సంస్థ వుండికూడా ఈ ఆందోళనా రహస్యాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకు రాలేకపోయిందా? దౌర్జన్యయుతమైన ఈ కుట్ర ప్రభుత్వానికి అనారోగ్యకరమైందని ఈ సంస్థ వూహించ లేదా? ఆకాశవాణి కేంద్రాన్ని ఈ మూక నాశనం చేసేసేదే. ఉన్న ఒక్కగానొక్క రక్షణోద్యోగి ఏం అడ్డుకోగలడు గనక? కాని, ఎందు

న్యూఢిల్లీ లేఖ

చేతనో కావలాదారు నివాసాన్ని మాత్రం తగలబెట్టి పూరుకున్నారు. ఆ వీధిలోని బ్యాంకులు మూతా దాక్షిణ్యం మీద బ్రతికి బయట పడ్డాయి! ఈ మూక కార్లను స్కూటర్లను తగల బెట్టిన తర్వాత, కార్ల గాజద్దాలు, ఇళ్ల కిటికీల గాజద్దాలు పగలగొట్టడం తర్వాత అరగంటదాకా పోలీసులు రాలేదని ప్రత్యక్ష సాక్ష్యంగా చెబుతాను. నగరపాలక సంఘం ఉద్యోగులే ధైర్యం చేయకపోతే భవనాలు మట్టికలిసిపోయి వుండేవి.

ఒక ప్రశ్న అర్థరహితంగా వుండిపోతుంది. ఈ ఆందోళన కోసమై మంటు కలిపిన కోటి రూపాయిలు, పవిత్ర గోమాత జీవన విధానాన్ని కొంతకాకపోతే కొంతయినా మెరుగు పరచలేక పోయేవా? ఈ గోసంరక్షకులు పాలు పితికిన తర్వాత గోవులను మేతకోసం వాటి మానాన వాటిని రోడ్ల మీద విడచి పెట్టేస్తూ వుంటారే! భారత దేశంలోనే గోవు పవిత్రంగా పూజింపబడుతూ వుంది. మరి ఏ యితర దేశాల్లోను ఈ గోవు ఇంతగా హింసింపబడడం లేదు అనే విషయమూ సత్యమే.

కసాయిశాల కంట్రాక్టర్లు:

లార్డ్ లినింత్‌గో ప్రభుత్వంలో ఒకప్పుడు ఏం జరిగిందంటే, లాహోర్‌లో ఒక కసాయిశాలను నిర్మించేందుకు ఒక సంఘం ఏర్పరచారు. ఆ సంఘంలో హిందూ మహాసభ అధ్యక్షుడు రాయ్ బహద్దూర్ రామ్ శరణ్ దాస్‌తోపాటు కరాచీ లోని ఒక మార్వారీ సంస్థ 'మహతా' వున్నాయి. కొంతకాలానికి ఈ కసాయిశాల నిర్మాణానికి ఆందోళన లేచింది. అందులో గోసంరక్షక శాఖ పితామహ సంస్థ 'హిందూమహాసభ', లాహోరులోని కొందరు ముసల్మాను కసాయి వాళ్ళు కూడా పాల్గొన్నారు! క్రియాకు పథకం మూలబడి పోయింది. గోసంరక్షకులకు విజయం సిద్ధించింది. ఈ కసాయి శాల నిర్మాణ విరమణ ద్వారా కంట్రాక్టు దారులు రాయ్‌బహద్దూర్ గారికి, మహతాలకు కొన్ని లక్షలు నష్ట పరిహారం చెల్లించ బడింది.

ఇందులో విమర్శించ తగ్గ విషయం లేనేలేదు. రాయ్‌బహద్దూర్, మహతా సంస్థలు కసాయిశాల నిర్మాణానికి 'వ్యాపార

కీత్యా తోడ్పడ్డారు. మనోరథాన్ని నెరవేర్చు కున్నారు. మతం పరంగా అందోళనతో చేతులుకలిపి, వ్యాపార దృష్ట్యా సఫలీకృతు లైనారు!

అలానే, హిందువులు గోమాతను పాలు, పెరుగు, వెన్న నేతుల కోసం పూజిస్తున్నారు. వ్యాపార దృష్ట్యా పేతకోసం వాటిని రోడ్ల మీద విడచి పెట్టేస్తున్నారు! వ్యాపారి వ్యాపారం చేసేప్పుడు అతనికి కొన్ని ఖర్చు లుంటాయి, లావా దేవీలుంటాయి. కాని యిక్కడ అలాకాదు. పెట్టుబడి లేకుండ అవునుంచి ఆదాయాన్ని పొందవచ్చు. చక్కని వ్యాపారం! బెంగాల్ లోని 'ఫుక్కా' విధానం మాదిరిగా లభించిన ఈ అందోళన పెట్టు బడి ధనం కూడా అలాంటిదేనని వేరే చెప్పక్కర్లేదు.

గోసంరక్షణ:

గోసంరక్షకులు ఆవు కడుపులో గాలి ఊది చివరి బొట్టు వరకూ పాలు పితుక్కు నేందుకు చూస్తుంటారు. బెంగాల్ లోని హిందువులు గోమాతను హింసించే విధానం చూసి లార్డ్ లినింత్‌గో కాలంలో ఒక చట్టం చేయబడింది. అనాడు గోసంరక్షణ అలావుండేది.

భారతదేశం ద్వితీయ వర్షం క్షామంతో కొట్టుమిట్టాడుతూవుంది. ఉత్తరప్రదేశ్ లోను, బీహార్‌లోను తిండిగింజలకోసం తమ తమ పిల్లల్ని అమ్ముకుంటున్న మాటను కొట్టి పారేయడానికి వీలులేదు. ప్రభుత్వం అసమర్థతకు ప్రతినిత్యం జనసంఘం సభ్యులు పార్లమెంటులో వాగ్యుద్ధం చేస్తూనే వున్నారు. పైగా అందోళన కోసమై జనానికి లక్షలకొద్దీ ధనాన్ని వెచ్చిస్తున్నారు! ఈ రెండూ చర్చించ తగ్గవే. మానవతావాదంతో జనసంఘం భూతదయ లక్ష్యంగా కలిగి వున్నదయితే అందోళనకోసమై ఖర్చుపెట్టిన ధనం ఉత్తరప్రదేశ్, బీహార్‌లలోని ప్రజల కాట కానికి మరలించివుండేది. పోనీ మనుష్యుల కన్నా పశుసంరక్షణ గొప్పదని ఎంచు కున్నట్టయితే ఆ యా ప్రాంతాల్లో పశు వులకు గ్రాసాన్ని సమకూర్చిపెట్టివుండేది. మానవకోటి క్షేమమూ, పశుజాలి సంక్షే మమూ రెండూ జనసంఘం ఆశయాలై నట్టయితే, అందోళనకోసమై పోసినడబ్బు కరువు కాటకాలతో దురపిల్లే ప్రదేశాలకు సహాయం చేయడంద్వారా సద్వినియోగం చేసుకానివుండేది. 1965—66 లోకన్నా 66—67 లో ఎక్కువ గోవధ జరుగ

కుండా వుండడానికి ఈ ఉద్యమ నిర్వాహకు ముఖ్యమైందంటారు. క్షామంలో ఎంతమంది మగవాళ్ళు, ఆడవాళ్ళు, పిల్లలు, పశుపక్ష్యా దులు చావకు గురి? రాబోయే ఎన్నికలకు ఇదొక వ్యూహం కాదనుకుంటే ఈ ఆందో ళన అర్థరహితమైనది. రాబోయే ఎన్ని కల్లో విజయంకోసం జనసంఘం ఇటువంటి ఏర్పాట్లు చేసుకుని ఉన్నట్టయితే అది కొరివిపెట్టి నెత్తి గోక్కున్నట్టే! జన సంఘం ఎన్నికల్లోనెగ్గి, కార్యాలయాల్ని అధివసించినట్టయితే ఎటువంటి పరిణా మాలు రాబోతాయో ఈ ఆందోళనద్వారా జనానికి బాగా తెలిసిపోయింది.

జనసంఘంద్వారా రాబోయే కీడును దాక్షి ణాత్యులు ఇప్పటికే గ్రహించివున్నారు. గోవ ధకు సంబంధించిన ఎటువంటి కార్యకలా పాల్లోను కలగజేసుకోని కామరాజ్ గారి యింటిని ముట్టడిపెట్టడానికి ప్రయత్నించిన ఈ సంఘం, దక్షిణ దేశస్థులకు యివ్వ బోయేగౌరవాన్ని ముందుగానేసూచించివున్నది.

ప్రభుత్వంపై ఖతి:


ప్రభుత్వం ఎల్లప్పుడూ నిశిత విమ ర్శకు గురవుతూనే వుంది. ప్రభుత్వ యంత్రాంగంలో అసమర్థతకు నిదర్శ నాలు కనిపిస్తూనే వున్నాయి. ఇది ఇప్పటిది కాదు. ఈ అసమర్థతారోగం సోకి, మొట్టమొదటుగా జబ్బుపడ్డవాడు గుల్జారీ లాల్ నందాగారు. ఆయన చాలామంచివాడు. యోగ్యమైనవాడూను. దేశీయాంగమంత్రి పదవికి అనర్హుడుగా వేలెత్తి చూపించ బడ్డాడు.

ఆయన వెలివేతతో రోగం నయమవు తుందనడానికిలేదు. ఒక కృత నిశ్చయంతో

మూరబొ కొరక, ప్రభుత్వాన్ని క్రమ వి ద్ధంగా నడిపించే వాళ్ళనందర్నీ వెలివేయా నందాగారు శాంతి భద్రతలకి న్యాయ చేయలేదనుకుంటే, చాగ్లాగారు విద్యార్థు ఆల్లర్లను అణచడానికి తప్పు దార తొక్కారు. అనవసరంగా గంటల తరబ గాలిలో మాట్లాడిందానికన్నా, క్ర శిక్షణా రహితులైన కొందరు విద్యార్థు అరెస్టు చేసి, వారి తల్లిదండ్రుల ద ర్నుంచి తమ పిల్లల్ని క్రమ శిక్షణలో వుం తామని ధృవ పత్రాలను తీసుకున్నట్టయి ఈ సమస్య కొంత చల్లారి వుండేది. వి ర్థుల అఘాయిత్యాల వల్ల వాటిల్లి నష్టానికి తల్లిదండ్రులి నుంచి పరిహారా తీసుకున్నట్టయితే ఈ గొడవ మా మణిగి వుండేది. ప్రధాన మంత్రి ఉపవ్యాస చాగ్లా గారి గాలి మాటలు విద్యార్థు రెచ్చగొట్టాయి

రాజీనామా

ఉపాధ్యాయుల అందోళనలో కూ ఆయన అలానే వ్యవహరించారు. ఉ ధ్యాయులు ప్రభుత్వం లోని చప్రాసీలకన తక్కువ జీతాలు తీసుకుంటున్నారన్న నిజం. ప్రాథమిక విద్యకు ఆయా ప్రాంతి పాలక సంఘాలు పాటు పడాలి. ఎనబ శాతం ఉపాధ్యాయుల జీతాలు కేంద్ర నుంచి రాబట్టు కోవడ మనేది క్రమవిరు మైన నిబంధన. నందాగారు అపజయ పొందారంటే, చాగ్లాగారు అంతకు మరింతగా అపజయం పొందారన్నది వాస్తవ న్యాయంగా, చాగ్లాగారి రాజీనామాను కూ ప్రధాని కోరివుండాల్సింది!



ప్రతిభగల విద్యార్థుల పై చదువులకు చేయూతనిచ్చే సంస్థ

విద్యార్థులలో నివురు గప్పిన నిప్పు లాంటి వారెందరో ఉంటారు. అవకాశం కల్పిస్తే అసాధారణ ప్రతిభతో జీవితాలను రాణింప చేసుకోగలవారు వీరిలో చాల మంది ఉంటారు. అట్లాగే అధ్యాపకులలో కూడా ఎంతో రాణించగల శక్తి, సామర్థ్యాలు ఉండికూడా చేయూత దొరకక, అవకాశాలు లభించక పెంపు మందగించి జీవితంలో నిరాశను ప్రవేశింప నిచ్చి దానితో రాజీ పడే వారు చాలమంది ఉంటారు.

ఇటువంటి ప్రతిభా సామర్థ్యాలు గల ఉపాధ్యాయులకు తమ తమ రంగాలలో వీలైనంత హెచ్చు విజ్ఞానం ఆర్జించుకొనటానికీ, విద్యార్థులు పై చదువులకు వెళ్ళి జీవితాలను తమకూ, తమ మాతృ దేశానికీ కూడా ఉపయోగపడేలాగా చేసుకొనటానికి అవకాశ మిచ్చే సంస్థ ఒకటి ఢిల్లీలో ఉన్నది. దాని దక్షిణ భారత ప్రాంతీయ కార్యాలయం మద్రాసులో ఉన్నది. ఈ మద్రాసు ప్రాంతీయ కార్యాలయం ముఖ్యాధికారి ఒక ప్రముఖ ఆర్థిక శాస్త్ర పండితుడు. ఢిల్లీలో ప్రభుత్వ ఉన్నత ఉద్యోగంలో పని చేసిన వారు.

"యు సె ఫి"

ఈ సంస్థ యు ఎస్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇన్ ఇండియా (ఇండియాలో అమెరికా విద్యాసంస్థ) దీనిని 'యుసెఫి' అంటుంటారు. దీని దక్షిణ ప్రాంతీయ కార్యాలయం త్యాగరాయ నగర్‌లో ఉన్నది.

ఈ సంస్థ నాలుగు రకాల గ్రాంటుల ద్వారా ఉన్నత విద్యాధ్యయనానికి తోడ్పడుతుంది. అమెరికా వెళ్ళి ఏదో ఒక విశ్వ విద్యాలయంలో చదువుకొనటానికి సరి పోయినంత గ్రాంటు ఇచ్చే దొకటి. [illegible] అమెరికన్ విశ్వవిద్యాలయంలో చదువు కొనటానికి అవకాశం లభించిన విద్యార్థులకు దారి పోను ప్రయాణ ఖర్చులు ఇచ్చేది మరొకటి. హైస్కూలు ఉపాధ్యాయులకు, హైస్కూలు విద్యాశాఖలకు అమెరికా వెళ్ళి విద్యా సంస్థలు పనిచేసే తీరు పరిశీలించి రావటానికి [illegible] ఇంకొకటి. అమెరికన్ విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యాభ్యాసానికి లేదా విద్యా బోధనకు సీనియర్ ప్రొఫెసర్లను పంపేది మరొకటి.

భారతదేశం అంతటి నుంచి ఏటా 200 మందికి ఈ గ్రాంట్లు ఇస్తారు. వీటిలో దాదాపు అయిదోవంతు— అంటే 40 దాకా వాళ్ళు దక్షిణాది రాష్ట్రం వారికి ఇస్తారు.

ఇవిగాక, అమెరికన్లు మన దేశం వచ్చి ఇక్కడొక సంవత్సరంపాటు ఉండి వివిధ విషయాల అధ్యయనం చేసుకొనటానికీ, లేదా పరిశోధనకు తోడ్పడే గ్రాంట్లు 150 దాకా ఉన్నాయి.

ఏటా ఈ కార్యాలయం వారు పత్రికలలో అడ్వర్టయిజ్‌మెంట్ల ద్వారా ముందుగా తెలిపి ఈ గ్రాంట్లు కావలసిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తారు. ఆ వచ్చిన అభ్యర్థులను పరీక్షించి ఎన్నిక చేసి ఈ గ్రాంట్లు ఇస్తారు.

ఈ ఎన్నిక చేయటానికి ఏటా విద్యావేత్తలను, ప్రముఖ పౌరులను ఎనిమిది, పది మందిని చేర్చి ఒక ఎన్నిక సంఘాన్ని నియమిస్తారు. వీరిలో ఒకరిద్దరు అమెరికన్లు కూడా ఉంటారు. ఆయా విద్యా రంగాలలో నిష్ణాతులైన వారిని కొందరిని కూడా అవసరాన్నిబట్టి ఈ నిర్ణేతల సంఘంలో చేరుస్తారు.

ఈ కార్యక్రమానికి మూలం ఫుల్ బ్రయిట్ [illegible] శాసనం. దీని మూల పురుషుడు ప్రముఖ అమెరికన్ సెనేటర్ విలియం ఫుల్ బ్రయిట్. 1950 లో భారత— అమెరికా ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం ఈ కార్యక్రమం మనదేశంలో ప్రారంభమైంది. "భారత, అమెరికా దేశాల మధ్య స్నేహసంబంధాలను వృద్ధి పరచటం, ముఖ్యంగా ఒక దేశం వారు మరో దేశం వెళ్ళి, వారిని గురించి వీరూ, వీరిని గురించి వారూ బాగా తెలుసు కొనటం ద్వారా ఈ సత్సంబంధాలను వృద్ధి పరచుకొనటమూ, రెండు దేశాల విశ్వ విద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు పరస్పరం [illegible] తెలుసుకొనే అవకాశం [illegible] దీని [illegible] ఆ ఒప్పందంలో [illegible]

యుసెఫి ఆధ్వర్యంలో నడుస్తున్నది ఈ ఫుల్‌బ్రయిట్ గ్రాంట్ల కార్యక్రమం మాత్రమే కాదు. దేశంలోని సంఘ సేవకుల కోసం పనిచేసే కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్, హవాయి ప్రాక్పశ్చిమ కేంద్రంలో అధ్యయనానికి అవకాశం కల్పించే హవాయి కార్యక్రమం, కొన్ని అమెరికన్ భారతీయ స్త్రీల కళాశాలల మధ్య ఇచ్చి పుచ్చుకొనే ఏర్పాటు ఫలంగా జరిగే వినిమయ కార్యక్రమాన్ని కూడా ఈ యుసెఫి కార్యాలయమే నిర్వహిస్తున్నది.

ఇవిగాక, ఏటా 20 మంది అమెరికన్ కాలేజీ లెక్చరర్ల బృందం ఒకటి, 20 మంది హైస్కూలు టీచర్ల బృందం ఒకటి వేసవిలో మనదేశానికి వచ్చి వెళ్తుంటాయి. వీరి పర్యటనలు యు సె ఫి ఆధ్వర్యానవే జరుగుతాయి.

విద్యార్థుల [illegible] గురించిన సెమినార్లు, దీని సహాయంతో అమెరికా వెళ్ళి వచ్చిన వారి సమావేశాలు, అమెరికా వెళ్ళబోయే విద్యార్థులకు అక్కడి పరిస్థితులను ఎరుక పరచటానికి పరిచయ సమావేశాలు కూడా జరుపుతుంటుంది యు సె ఫి.

డాక్టర్ డి. ఎన్. రావు

దక్షిణ భారతానికి సంబంధించినంత వరకు ఈ కార్యక్రమాలను అతి సమర్థంగా నిర్వహిస్తున్న ముఖ్యాధికారి డాక్టర్ డి. ఎన్. రావు (ద్వివేదుల నరసింగరావు) స్వస్థలం విశాఖపట్నం జిల్లాలో సింహాచలం. ఆర్థిక శాస్త్రంలో డాక్టరయిన. విజయనగరం కళాశాలలోనూ, ఆంధ్ర విశ్వ విద్యాలయంలోనూ, అమెరికాలో విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలోను చదివి ఆర్థిక శాస్త్రంలో పి. హెచ్‌డి. డిగ్రీ తీసుకొన్నారు. ఆ అమెరికన్ విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా కూడా పనిచేశారు. ముస్సోరీలో ఉన్న నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో కొంతకాలం ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఐ.ఏ.ఎస్. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ముస్సోరీలో ఈ అకాడమీలో శిక్షణ జరుపుతారు. అభ్యుదయ [illegible] 41 సంవత్సరాల [illegible]

డాక్టర్ రావు అక్కడ ప్రొఫెసర్‌గా ఉండే వారు. ఈ అకాడమి అంతకు ముందు ఐ. ఏ. ఎస్ సిబ్బంది కళాశాల అనే పేరుతో సిమ్లాలో ఉండేది. ప్రస్తుత యువ ఐ.ఏ.ఎస్ ఆఫీసర్లలో డాక్టర్ రావుగారి వద్ద శిక్షణ పొందినవారు ఎందరో ఉన్నారు.

ప్రఖ్యాత తెలుగు నవలా, కథా రచయిత్రి శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి వీరి సతీమణి.

డాక్టర్ రావు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తమ కార్యాలయం పని చేసే పద్ధతిని గురించి, ఈ కార్యక్రమాలు ఎట్లా ఉపయోగపడుతున్నదీ వివరంగా చెప్పారు. ఈ రాక పోకల కార్యక్రమం వల్ల ఇక్కడ మనదేశంలోనూ, అక్కడ అమెరికాలోనూ విద్యారంగానికి చాల సత్ఫలితాలు కలుగుతున్నాయని చెప్పారు.

ఈ రోజున మన విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న యువ ప్రొఫెసర్లలోనూ లెక్చరర్లలోనూ చాల మంది ఈ కార్యక్రమం పరంగా అమెరికా వెళ్ళి పై చదువులు చదివి వచ్చినవారు కనుపిస్తారు. అట్లానే అమెరికాలో చాల మంది భారత విజ్ఞానాన్ని గురించి ఇదివరకటి కంటే ఇప్పుడు చాల హెచ్చుగా, స్పష్టంగా తెలుసుకొని అక్కడ తమ విద్యార్థులకు ఈ విజ్ఞానాన్ని పంచి పెట్ట గలుగుతున్నారు. భారత చరిత్ర, రాజకీయ వ్యవస్థ, ఆర్థిక స్థితిగతులు, భాషలు, సంస్కృతి వంటివి అమెరికన్లు ఆకళింపు చేసుకొనటానికి ఈ వినిమయ కార్యక్రమం చాల బాగ తోడ్పడుతున్నట్లు ప్రత్యక్ష దృష్టాంతాలు కనపడుతున్నాయి, అని చెప్పారు డాక్టర్ రావు

ఇందుకు ఉదాహరణగా, ఈ కార్యక్రమం పరంగా ఇండియా వచ్చి వెళ్ళిన అమెరికన్ దంపతులొకరు తనకు వ్రాసిన ఉత్తరం ఒకటి చూపారు డాక్టర్ రావు.

''ఇది వరకు నేను గాని, మా ఆవిడ గాని ఇండియాను గురించి ఎప్పుడు అట్టే ఆలోచించిన వాళ్ళము కాము..... కాని ఈ రెండు సంవత్సరాలలో వచ్చిన ఒక పెద్ద మార్పు ఏమిటో చెప్పమంటారా? మా కుటుంబంలోనూ, మా అత్త వారి కుటుంబంలోనూ ఇండియా అంటే ఇప్పుడిక మా కదొక పరాయి దేశంగా కనుపించదు భారత దేశానికి సంబంధించిన ఏ వస్తువు కనుపించినా మా కుటుంబాలలో వారు అట్టే గుర్తు పట్టి ఇది ఇండియాది అనేస్తారు. ఏదో అప్యాయత, అనుబంధం భారతదేశంతో మాకు ఏర్పడ్డాయి...'' అని ఆ ఉత్తరంలో ఆ అమెరికన్ దంపతులు వ్రాశారు.

ఈ యుసెఫీ కార్యక్రమాలు ముఖ్యంగా మూడు విధాల భారత విద్యారంగానికి ఉపయోగమని డాక్టర్ రావు చెప్పారు. యువ భారతీయ అధ్యాపకులకు గొప్ప అమెరికన్ ఆచార్యుల వద్ద శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. ఇది మొదటిది. భారత విశ్వవిద్యాలయాలలో కొత్తగా నెలకొల్పే బోధన శాఖలను వృద్ధిపరచు కొనటంలో అమెరికన్ అనుభవజ్ఞుల సహాయం లభిస్తుంది. ఇది రెండవది.

ఇండియాకు సంబంధించినంతవర ఈ కార్యక్రమం క్రింద ఈ 16 సంవ రాలలో 2000 మంది భారతీయ ప ట్రదులు అమెరికాలో పై చదువుల వెళ్ళి పదార్థ, సాంఘిక శాస్త్రాలు, సా స్వతాలు చదువుకొని వచ్చారు. దాదా 1000 మంది అమెరికన్లు భారతదే వచ్చి వెళ్లారు

డాక్టర్ రవు కార్యాలయం ఆంధ్ర ప్రదేశ్, మద్రాసు, మైసూరు, కేర రాష్ట్రాల అధ్యాపకులకూ, విద్యార్థులక ఈ గ్రాంట్లు ఇచ్చే బాధ్యత నిర్వహిస్తుం

ఇంటర్వ్యూల తరుణంలో చూడా ఈ కార్యాలయానికి దరఖాస్తులు కట్ట



డా|| డి. ఎన. రావు వారి సతిమణి శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి

కాగా, కొన్ని విశ్వ విద్యాలయ పరిశోధన పథకాలకు ప్రత్యక్ష సహాయం కూడా లభిస్తున్నది. ఇది మూడవ ఉపయోగం.

భారతీయ అమెరికన్ ప్రముఖులతో కూడిన నిర్వాహక మండలి యుసెఫీ నిర్వహణ బాధ్యతను వహిస్తుంది. అమెరికా ప్రభుత్వానికి మనదేశంలో ఉన్న తన పి.ఎల్. 480నిధుల నుంచి దీని వ్యయాన్ని భరిస్తున్నది. , 20 సంవత్సరాలనాడు సెనెటర్ ఫుల్‌బ్రయిట్ ప్రతిపాదనపై ఆయన పేరుతో ఏర్పాటయిన ఈ కార్యక్రమం భారత దేశం సహా మొత్తం 49 దేశాలకు లాభిస్తున్నది. ఇంతవరకు ఈ అన్నిదేశాల వారు 80,000 మంది ఈ కార్యక్రమం వల్ల ప్రయోజనం పొందారు.

కట్టలు వస్తుంటాయి. ఆ తరువా అభ్యర్థుల ఇంటర్వ్యూల సందడి. వీరందరి ఫుల్‌బ్రయిట్ అనే పదం ఒక గొప్ప ఆకర్ష తెలుగు విద్యార్థులు పరీక్షలలో ఉన్న శ్రేణిలో ఉత్తీర్ణులై ఈ గ్రాంట్లు పం దించేవారిలో తమ సంఖ్యను ఇప్పటికం పెంచుకొనే కృషికి ఇది వారిని ఉత్తే తులను గావించాలి.

యుసెఫీ గ్రాంట్లతో అమెరికా వె వచ్చిన వారు అమెరికాలో ఉన్నప్పటి త అనుభవాలను జ్ఞాపకం చేసుకోగానే అందు అవకాశం కల్పించిన యుసెఫీ దా మూల పురుషుడు సెనెటర్ ఫుల్‌బ్రయి వారికళ్లముందు మెదలటంలో ఆశ్చర్యంలేద

-బి. యస్. ఆర్. కృష్ణ

గ్లోరియా స్టువార్ట్

కమ్యూనిస్టు చైనాలో నా అనుభవాలు-3

చైనా దేశంవారికి ఆత్మవిశ్వాసం అధికం, ఇతర దేశాలవారంటే లోకువ.

'కాందిశీకుల సమస్య' తీసుకోండి. ఈ విషయంలో వారి ఎత్తులు బాగా పారుతున్నాయి. మన అమాయకత్వానికి నవ్వుకుంటున్నారు.'

ఏటా సుమారు 20 లక్షల చైనా వారు హాంకాంగ్, మాకావ్‌లకి 'పారిపోతారు.' ఈపారిపోయేవారి సంగతి అధికారులకి బాగా తెలుసు.

దేశం వదలి పోయేవారు తమ దేశానికి ఏవిధంగానూ ఉపయోగ పడరు. గుడ్డివారు, వికలాంగులు, బలహీనులు—వీరు ఉంటేనేమి, పోతేనేమి అనే ధోరణి చూపిస్తారు ప్రభుత్వం వారు. ఇతర దేశాలు అందులో పాశ్చాత్య వర్గాలు వీరిని తీసుకుంటామంటే వారికేం పోయినట్లు?

ఇక నిరుపయోగంగా ఉండనివారివిషయంలోనూ చైనా అధికార వర్గాలు కొంత గడసరితనం చూపిస్తారు.



వీధి పేర్లు మార్చుతున్న ఎర్రరక్షకులు

ఇటువంటి వ్యక్తిని ఒకరిని నేను కలిశాను. ఆమె పేరు షియాయుంగ్‌లాన్. వయస్సు 22. మూడు వారాలుగా హాంకాంగ్‌లో ఒక అమెరికన్ కంపెనీలో టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఒకసారి ఆమెతో ఒక హోటల్‌కి వెళ్ళాను. టీ తాగుతూ ఉండగా తన కథ చెప్పింది.

అదివిన్న తర్వాత చైనా నుంచి తప్పించుకోవటం ఎంత తేలికో తెలుసుకున్నాను. రష్యా, తూర్పు జర్మనీల విషయంవేరు, అని గ్రహించాను.

''దేశంవదలి వెళ్ళటానికి అనుమతి తేలిగ్గా దొరికింది. షాంగాయ్‌లో 'పర్మిట్' ఆఫీసుకి వెళ్ళి దరఖాస్తు పెట్టాను. ఇంచుమించు వెంటనే హాంకాంగ్ ప్రవేశానికి అనుమతి ఇచ్చారు.

''కాని బ్రిటిష్ ఫ్రాంటియర్ చేరుకోగానే షాంగాయి నుంచి వచ్చినందుకు వెనక్కి తిప్పి పంపేశారు. కాంటన్‌నుంచి వచ్చేవారినే లోనికి రానిస్తారుట,'' అన్నది షియాయుంగ్‌లాన్.

''మళ్ళీ కాంటన్‌కి వెళ్ళేందుకు అనుమతి తీసుకుని మాకావ్ ద్వారా పారిపోయేందుకు పథకం వేసుకున్నాను. మాకావ్ రాగానే, 'నీకుడబ్బూ, ఆహారం కావలిస్తే ఇక్కడ రోమన్ కాథలిక్ కాందిశీక కేంద్రానికి వెళ్ళు,' అని సలహా ఇచ్చారు కొందరు. ఈ రెండూ నాకు అనవసరమే అయినా ఏమిటో చూద్దామని అక్కడికి వెళ్ళాను.

''ఒక ఫాదరీ నాచేత ఒక కాగితంమీద సంతకం పెట్టించి కొంత బియ్యం, ఒక పాతిక రూపాయలు (స్థానికనాణేలలో 20 పెటాకెలు) ఇప్పించాడు. నన్నుదీవించి 'రక్షించ బడ్డావు' అన్నాడు. దేని నుంచి అని పించింది కాని సభ్యత కాదని ఆ ప్రశ్న వెయ్యలేదు.''

యుంగ్‌లాన్ కష్టాలు ఇక ప్రారంభం అయ్యాయి. హాంకాంగ్‌లో ప్రవేశానికి కావలసిన పర్మిట్లు ఒక్కొక్కటి 4200 రూ. లచొప్పున అమ్ముతున్నారు. ఇంత ఖర్చు భరించటం వీలులేదు కాబట్టి రూ. 840కి ఒక పాత పడవలో 'చోటు' కొనుక్కుని రహస్యంగా హాంకాంగ్ చేరుకుంది. అక్కడ 'వివాహ పత్రం' బ్లాక్ మార్కెట్‌లో కొనుక్కుంది. ఇది అంత కష్టమైన పనికాదు.'

ఇలా వెళ్ళిపోయే వారిని 'పెకింగ్' అడ్డు పెట్టదు. ఎందుకంటే వారు విదేశాలలో ఆర్జించి స్వదేశాలలో తమ వారికి పంపుతారు. ఈ విధంగా విదేశ ద్రవ్యం చైనాకి అందుతుంది. ఇంతేకాక, విదేశాలలో స్థిరపడిపోయినవారు వ్యాపార కేంద్రాలుగా మారుతారు. వారివల్ల చైనాకి లాభమే.

నేడు హాంకాంగ్‌లో ధనవంతులయిన చైనా వారి చేతుల్లో 39 డిపార్ట్‌మెంటల్ స్టోర్లు ఉన్నాయి.

వీటిల్లో మంచి జత చెప్పులు పది పదకొండు రూపాయలకి, షర్ట్లు ఎనిమిది రూపాయలకి దొరుకుతాయి.

వీటికి తోడు హాంకాంగ్‌లోని 40 చైనావారి తాలూకు బాంకులూ తమ దేశానికి చాలా విదేశద్రవ్యం సంపాదించి పెడుతూ ఉంటాయి, చైనా ఎగుమతుల అభివృద్ధికి తోడ్పడుతాయి.

అంటే, హాంకాంగ్ చైనా పక్కలో బల్లెం అనడానికి వీలులేదు!

కాని, ఎందుకయినా మంచిదని చైనా బెత్తంతో దడిపిస్తూ ఉంటుంది. ఉదాహరణకి, 1962లో అమాంతంగా 80,000 వేల మంది చైనా యువతీ యువకులని హాంకాంగ్‌లోకి పంపించింది—రహస్యంగానూ బాహాటం గానూ కూడా. వీరందరినీ వెళ్ళగొట్టడం హాంకాంగ్ ప్రభుత్వం శక్తి మీరిన పని అయిపోయింది.

'దండు' ఎత్తకుండానే హాంకాంగ్‌ని వశపరచుకొనటం ఎంత తేలికో చైనా నిరూపించిందన్న మాట.

ఇక చైనా గూఢచారుల సంగతి? ఇలా రహస్యంగా వచ్చే 'కాందిశీకు'లలో ఎందరో గూఢచారులు ఉంటారు. కాని దానికి తోడు మరొక పద్ధతి ఉంది—

మాకావ్ ప్రాంతంలో ఒక చైనాజాలరి పడవని పోలీస్ నావ ఒకటి తరుముతుంది. తరిమి, తరిమి దాన్ని ముంచేస్తుంది. దానిలో నుంచి తప్పించుకున్న జాలరిని మాకావ్


(పరిష పేజీ చూడండి)

"అమ్మ నాకోసం సింథాల్ పౌడర్ కొన్నది...అయితే



దీనిని చాలామట్టుకు ఆవిడే వాడుతోంది."

హాయిని గొలిపే ఆ సువాసన అంటే, ఆమెకు ఎంతో ఇష్టము. నాన్న కూడా దానిని వాడతాడు...అద్భుతమైన జి-11 (హెక్సాక్లోరాఫీన్) శరీరము యొక్క దుర్గంధము తనకు లేకుండా చేస్తుందని నాన్న అన్నాడు. అహా! నా ఒళ్లు ప్రేలకుండా కాపాడడానికి వాళ్లు దానిని కొన్నారు...అది నాకు ఎంతో అవశ్యకము!



సింథాల్ టాయిలెట్ పౌడర్ ఇప్పుడు ఆకర్షణీయమైన 3 డబ్బాలలో దొరుకుతుంది.

సింథాల్ టాయిలెట్ పౌడర్

మీకు హాయిగా నుండు నట్లు రూఢిచేసుకోండి-జి-11 (హెక్సాక్లోరాఫీన్) గల సింథాల్ సబ్బు వాడిన తరువాత, సింథాల్ టాయిలెట్ పౌడర్ రాసుకోండి

జి-11.
ఎల్ జివాడా ఎట్ సీ.
ఎస్.ఎ. వారి ట్రేడ్ మార్కు.

నిజా నిజాలు



పి. రాజ్యలక్ష్మి

అసలే ఊరు కొత్త. దానికి తోడు విసిరేసినట్లుగా ఇక్కడో ఇల్లూ అక్కడో ఇల్లూ, మధ్య మధ్య పెద్ద పెద్ద ఖాళీ స్థలాలూను. ఆ స్థలాల్లో రాత్రిళ్లు చూస్తే పశం వేసుకుని కూచున్న మహా రాక్షసులులాగ కనిపించే రక్కసపొదలూ, శివం ఎక్కి తలలు ఆడిస్తున్న భూతాల్లా అనిపించే తుమ్మచెట్లూ, ఇలా ఎదిగీ ఎదగని ఆ పేటకి నోపక్క రైల్వేలైనూ, మరో పక్క నల్లని తారు రోడ్డూ, సాధారణంగా సందడి ఏం చెయ్యకుండా పెద్ద తాచులలా పరుచుకొని ఉండి, కాపలా కాస్తున్నాయూ అన్నట్లు— తక్కిన రెండు పక్కలా పేటని బాగా ఆనుకొని చాలా దూరందాకా పరుచుకొని, ఖాళీగా కనిపిస్తున్న పెద్ద మైదానం నిద్దరోతూంటే, దాని వీపు మీద కూచుని రాత్రి రాజ్యాన్ని పాలిస్తున్న బ్రహ్మ రాక్షసుడా అనిపించేటంతటి పెద్ద జువ్వి చెట్టూ— విరబోసికొన్నదాని జడల సందుల్లోంచి పడిన మసక వెలుతుర్లో నవ్వుతూ కాచుకున్న భయంకర సత్వంలా పెద్ద దిగుడు బావీ, చూసేసరికి ఒళ్లు జలదరించి ఒణుకు పుట్టింది.

వాకా భయంతో మొదటి రోజు రాత్రి నిద్దర పట్టలేదు. చూసి చూసి ఇలాంటి చోట రూమ్ తీసుకున్నానేమిటా అనుకున్నా. నాకు ముందిక్కడ పని చేసినావిడ ఈ రూమ్‌లోనే ఉందిట. మరి ఎలా ఉందో! అయినా నాకు నచ్చిన రూమ్ నేను చూసుకోవాలి కాని నౌఖరుని చూడమనడ మేమిటి? ఇదిగో ఇలాంటిది చూశాడు— ప్చ్— ఈ రోజుల్లో నౌఖరుగాళ్లు భోత్తిగా బాధ్యతెం మొయ్యడం లేదు. వాళ్లు పెద్ద పెద్ద ఠెవిన్యూ ఆఫీసర్లనే లెక్క చెయ్యడం లేదు. అటువంటప్పుడు హా "వుమన్ వెల్ఫేర్ ఆఫీస"రంటే లెఖ్ఖా? ఏవేవా అంటే "ఏం చెయ్య మంటారు? ఇంతకంటే మంచి రూమ్‌లు లేవు. నచ్చకపోతే మీరే ఇంకోటి చూసుకోం. నన్ను చూడమంటే నావల్ల కాదు. అయినా రూమ్ చూడడం నా డ్యూటీ కాదు" అని చటుక్కున మొహం మీద వేశే లాగ ఉన్నాడు— సరే— సంక్రాంతి వెళ్లేదాకా ఇందులో ఎలాగో అలాగ కాలక్షేపం చేద్దాం. ఈ లోగా ఇంకో మంచి రూమ్ కోసం వెతికి అందులోకి మారవచ్చు— సంక్రాంతి అంటే ఎంత? ఇవాళ నెల పట్టారు కదా! ఇంక ఒక్క నెల...అంటే సరిగ్గా ముప్పై రోజులు.

ఇలా ఆలోచించుకుంటూ, బయట గట్టిగా గాలివేసి చెట్ల ఆకులు చప్పుడు చేసినప్పుడల్లా, గబ్బిలమో, గుడ్లగూబో అరిచి నప్పుడల్లా, ఉలిక్కిపడుతూ, అపరిమితమైన భయంతో అవ్యక్తమైన అస్థిమితంతో నిద్ర లేకుండా ఆ రాత్రి తెల్లవార్లూ మంచం మీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాను.

దూరం నుంచి కోడి కూత వినిపించి లేచి లైటు వేశాను, వాచీ చూసుకుంటే నాలుగయింది. ఇంకా గంట, గంటన్నరికి కాని తెల్లారదు. పడుకుందాం అంటే నిద్ర పట్టడం లేదు. ఏమీ తోచక గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగాను. ఇంతలో తెల్లారగట్ల వెళ్లే ఎక్స్‌ప్రెస్ కాబోలు ఉలిక్కి పడేలాగ పెద్ద కూత కూసింది. మహా వేగంతో పోయే ఆ రైలుని

చూడాలని పించింది. భయం వల్ల పడుకో బోయేటప్పుడు వేసిన కిటికీ తలుపులు తెరిచాను. గట్టిగా కూస్తూ చీకటిని చీల్చుకుంటూ విపరీతమైన వేగంతో పోతోంది రైలు. మధ్యమధ్య ఇళ్ళూ చెట్లూ అడ్డువచ్చి ఇట్టే అదృశ్యం అయి మళ్ళీ ఇట్టే కనిపిస్తూ వేగంగా కదిలి పోతున్నాయి రైలు పెట్టెలు. ఆ పెట్టె ల్లోంచి కనిపిస్తూన్న దీపాలు, కాంతి తోరణంలా కదిలి పోతూంటే, రెప్ప వాల్చ కుండా వాటికేసే చూస్తూ ఉండిపోయాను. కాస్సేపటికి దూర దూరాలకి పోయిన దీపాలు ఇంక కనిపించడం మానేశాయి. ముఖం ఇటు తిప్పానో లేదో కళ్ళు తిరుగు తున్నట్లనిపించింది, కదులుతూన్న రైలుని చూడడం వల్ల కాబోలు— గట్టిగా కళ్ళోసారి మూసుకొని ఒక్క క్షణం ఆగి మరీ తెరిచాను.

తెరిస్తే ఎదురుగా కాళీ స్థలం అవతల ఉన్న ఇంటి ముందు ఎవరో ఒంగుని ఉన్నట్లు ఆ మసక చీకట్లో అనిపించింది. కళ్ళో మారు నులుపుకొని మళ్ళీచూశాను. గాలికి వూగుతూన్న తుమ్మ చెట్టుకొమ్మలు మధ్య మధ్య అడ్డు వస్తూన్నా సరిగానే కనిపిస్తోంది. పదహారు, పదిహేడేళ్ల అమ్మాయి. పరికిణీ కండువా వేసుకొని, వాలు జడ బుజం మీంచి వాలి ముందుకు పడుతూంటే ఒంగుని చక్కగా ముగ్గులు పెడుతోంది. ఆ చుట్టు పక్కల ఇంకా ఎవరూ నిద్దర లేవలేదు. ఇంచక్కా ఆ అమ్మాయికి ఎంత శ్రద్ధో! తెల్లవారకుండ లేచి సంక్రాంతి ముగ్గు పెడుతూంది. ఆ అమ్మాయినీ, ఆ అమ్మాయి పెడుతున్న ముగ్గునీ ఎంత సేపు చూసినా చూడాలని పించింది. సన్నని మెత్తని ఆ చేతుల్లోంచి జారి ముచ్చటైన రూపాలుగా ఆ ముగ్గు మారుతుంటే వింతగాచూస్తూ ఎంతసేపో అలా వుండిపోయాను.

ఇంతలో ఆ ఇంటి ప్రక్క ఇంటివారె వరో బయటికి వచ్చిన అలికిడి అయింది. చటుక్కున ముగ్గు పెడుతూన్న ఈ అమ్మాయి తుమ్మ చెట్టు నీడలోకి తప్పుకొంది. సిగ్గు కాబోలు— అవును ఆ వయస్సులో అలాగే ఉంటుంది. ఎవరిని చూడడాని కయినా సిగ్గే! నాలో నేను నవ్వుకొని కిటికీ తలు పులు నెమ్మదిగా దగ్గరికి వేసి, టేబిల్ దగ్గరికి వచ్చాను ఆ రోజు ఆఫీసు కాగితాలు చూడడం కోసం. బాగా తెల్లారేక యధా లాపంగా చూస్తే కిటికీ సందు లోంచి ఆ ఇంటివారి పనిమనిషి కాబోలు కని పించింది. ఒత్తుగా కళ్ళాపు జల్లుతూ. అరే! తెల్లారగట్ల ఆ అమ్మాయి పెట్టిన ముగ్గు అంతా ఈ తెలివితక్కువ దాసిది పాడు చేస్తోందే! కిటికీ తెరిచి చూద్దును గదా ఆ అందమైన ముగ్గు ఆనవాలే లేదు ఆ ముంగిటిలో!

ఆ తర్వాత నాలుగైదు రోజులదాకా, కొత్తగా ఛార్జి తీసుకున్న ఆఫీసు తాలూకు కాగితాలు చూసుకోవడం అటు ఆఫీసులో తెమలక, ఇంటికి కూడా తీసుకు వచ్చి అర్ధరాత్రిదాకా వాటితో కుస్తీపడుతూ ఉండడం వల్ల, ఆ ధ్యాసలో పడి ఆ వాతా వరణాన్నీ, తెల్లవారగట్ల చూసిన ఆ అమ్మాయి సంగతినీ మరిచి పోయాను.

ఓ రోజు రాత్రి పన్నెండు గంటలదాకా ఆఫీసు కాగితాలు చూసుకొని, లైటు ఆర్పి కిటికీ రెక్క ఒక్కటి తెరిచి పడు కుందాం అనుకుంటూ కిటికీ దగ్గరికి వెళ్ళేటప్పటికి ఎదురుగా ఆ ఇంటి అరుగు చివరని కూచుని ఆ అమ్మాయి కనిపించింది. జరీ అంచు పట్టు పరికిణీ, తెల్లని సిల్కు పైట వేసుకుని ఏకాంతంగా కూర్చున్న ఆ అమ్మాయి మీద పల్చని వెన్నెల పడీ పడనట్లు పడుతోంది. పచ్చని అంద మైన చేతి మీద ఎర్రని గాజులు మిల మిలా మెరుస్తున్నాయి. తల ఒంచుకుని కూర్చోవడం వల్ల ముఖం కనిపించడం లేదు కాని, తీర్చిదిద్దినట్లున్న ఆ అవయ వాల్నీ, శరీరంలో తొణికిసలాడుతూన్న ఆ సౌందర్య లావణ్యాల్నీ చూస్తే ఆ అమ్మాయి చాలా అందమైన వ్యక్తిలాగే నాకు అనిపించింది.

కదలకుండా నిశ్చలంగా కూర్చున్న ఆ అమ్మాయిలో ఏదో దిగులూ మరేదో వేదనా గోచరించాయి. ఏ బాధా లేక పోతే అందరూ హాయిగా నిద్దర్లు పోతున్న ఈ సమయంలో ఒక్కతే వచ్చి అక్కడ ఎందుకు కూచుంటుంది? పాపం ఆ అమ్మాయి బాధ ఏమిటో! ఉన్నట్టుండి నాకు ఆ అమ్మాయి మీద ఎంతో జాలి జనించింది, "పాపం!" అని నా మనస్సులో ఇలా అనుకున్నానో లేదో, నా మనసులో భావాన్ని కనిపెట్టి ఉలిక్కి పడినట్లు అలా కళ్లెత్తి నా కిటికీ వైపు చూసింది. వెన్నెట్లో ఆమె కళ్ళూ, కళ్ళల్లోంచి బుగ్గల మీంచి కారుతూన్న కన్నీళ్ళు మెరిశాయి. ఆ స్థితిలో తానుండగా, రహస్యంగా ఇక్కడ కిటికీలోంచి నేను తనని చూస్తున్నానని గమనిస్తే ఎంత బాధపడుతుందో! అః! ఆ భయం ఏం లేదు. నేను చీకట్లో ఉన్నానుగా? ఆమె కెలా కనిపిస్తాను? అనుకున్నా—

కాని కనిపించే ఉంటాను. లేక పోతే తడబడే అడుగులతో అలా, గోడ నీడలోకి తప్పుకోదు. మళ్ళీ కనిపిస్తుందేమోనని చాలా సేపటి వరకు చూశాను—ఉహూఁ!

మర్నాడు ఆదివారం.

అయితే ఆఫీసు— తప్పితే రూమ్‌లో కూచుని ఏ పుస్తకమో చదువుకోవడం ఇది తప్ప ఇంకోరకంగా కాలక్షేపం చేసు కోవడం అలవాటు లేని నాకు, ఆ రోజున ఎందుకో పుస్తకం మీదకి దృష్టిపోలేదు. ఇంటివారైన ఆ పిన్నిగారితో కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడదాం అంటే, వాళ్ళ ఆయన ఇంట్లో ఉండిపోయారు. ఆవిణ్ణి పిలిస్తే బాగుండదు. పోనీ ఆ అమ్మాయి కనిపిస్తుందేమో, పిలిచి కాస్సేపు కబుర్లు చెబుదాం అని కిటికీ తలుపు తెరిచిచూశాను. ఎంతసేపు చూసినా ఆ అమ్మాయి బైటికి వచ్చేజాడే కనిపించలేదు. ఏంతోచక అచ్చా డుతూ సాయంత్రందాకా ఆకిటికీదగ్గరే కాలక్షేపం చేశాను. ఆ అమ్మాయి తప్ప అంతా కనిపించారు. లోకంలోవున్న బాధ లన్నీ తానే అనుభవిస్తున్నట్లు సన్నగా వయస్సుని మించిన వృద్ధాప్యంతో పీక్కుపోయి ముడతలు పడిన ముఖంతో ఏభై ఏళ్లయినా నిండని ఓ ముసలాయన— పుష్టిగా, లావుగా ఉండి, చూపులోనూ నడకలోనూ కూడా ఓ రకమైన ఠీవి కనబరుస్తూ, కట్టుకున్న పల్చని గ్లాస్కో చీరతో పోటీ పడుతున్న బర్మానిగలోని తెల్ల గులాబీ పువ్వు, మళ్ళిన వయస్సుతో మళ్ల లేక మధన పడుతూన్న మనస్సుని చెబుతూంటే ఇటూ అటూ తృప్తిగా మసులుతూన్న ఓ ముప్ఫై ఏళ్లస్త్రీ, అలంకరణతో సహా అన్నివిధాలా అమ్మ గారిని అనుకరిస్తూ ఆ ఇల్లంతా తనదే అన్నట్లు వీర విహారం చేస్తూన్న ఓ పాతి కేళ్ళ పనిమనిషి.

ఆ పనిమనిషిని కేకేసి "ఆ అమ్మాయి ఇంట్లో లేదా" అని అడుగుదాం అనిపించి కూడా మళ్ళీ ఎందుకో వూరుకున్నాను.

ఆ రోజు పౌర్ణమి! తెల్లగా పిండి ఆరబోసినట్లున్న వెన్నెలని చూసేసరికి వెన్నెట్లో అలా వెళ్ళి వద్దాం అనిపించింది. కాని భోజనం చేసి చీరా స్వెట్టర్ వేసు కొని మఫ్లర్ మెడకి చుట్టుకుంటుంటే

ఆ చుట్టూ ఉన్న రెక్కల పొదలూ, తుమ్మ చెట్లూ, ఆ పెద్ద మైదానం జ్ఞాపకం వచ్చి భయంతో గదిలోనే ఉండిపోయా. కాని ఆ వెన్నెలని చూడాలనే కోరికని మాత్రం చంపుకోలేక కన్నానినంత మేర ఖాళీగా ఉన్న ఆ విశాలమైన మైదానాన్నీ, ఆ మైదానానికి కాపలా కాస్తున్న ఆ పెద్ద జువ్వి చెట్లన్నీ, బావి చుట్టూ వెన్నెట్లో మెరుస్తూన్న గచ్చు చప్టానీ చూస్తూ, భయాన్ని కల్గించే దృశ్యాలు కూడా ప్రకృతిలోని వెన్నెట్లో ఎంత అందంగా కనిపిస్తాయా అని ఆలోచిస్తూ కూర్చున్నా—

ఇంతలో ఉన్నట్టుండి ఆ దిగుడు బావి లోంచి ఏదో ఆకారం పైకి లేస్తున్నట్లు కనిపించింది. ఒక్క మారు ఒళ్లంతా జల్లు మని గుండె ఆగినట్లయింది. భయంతో బిగిసి పోయాను, నోరు తడి ఆరిపోయింది. వెంటనే రెండు చేతుల్తోటే కళ్లు మూసేసుకున్నాను.

కాస్సేపటికి కాళీస్థలం అవతల వారి ఇంటి దగ్గర ఏదో అలికిడి అయితే, కళ్లమీంచి బెదురు బెదురుగా వేళ్లు తీసి అటు చూశాను.

ఆ అమ్మాయి!

తుమ్మచెట్టు నీడలో నిలబడి నాకేసే చూస్తోంది. అమ్మయ్య! నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. ఆ నిశిథి సమయంలో ఇంకో మనిషి తోడుగా ఉంది అనే ఆలోచనే నాకు బలాన్నిచ్చింది. ధైర్యంగా ఈ మాటు ఆ దిగుడు బావికేసి చూశాను. ఇందాకా అనవసరంగా పిచ్చి భయానికి నాలో నేనే నవ్వుకున్నాను. నా అనవసరపు భయం అర్థం అయి హాస్యంగా నవ్విన నా నవ్వు కూడా వినిపించినట్టుంది, ఆ అమ్మాయి కూడా నా నవ్వులో శ్రుతి కలిపింది. ఆ నవ్వు నాకు ఎంత వింతగానో వినిపించింది. ఆ అమ్మాయితో మాట్లాడాలనే కోరిక నాలో బలీయం అయింది. కిటికీ లోంచి చెయ్యి వూపి పిలిచాను. ఎంత సేపు పిలిచినా నవ్వుతూ నిలబడిందే కాని రాలేదు. గదిలో లైటు వేద్దామని ఇటు తిరిగాను. అంతే— ఆ అమ్మాయి వెళ్లి పోయింది— మరి కన్పించ లేదు ఎంత సేపు చూసినా..

రోజు రోజుకీ మా స్నేహం బలీయం కాసాగింది. తెల్లవారితే నల్లపూస అయి పోయే ఆ అమ్మాయి, ఏ రాత్రి పూటో వాళ్ల వాకిట్లో కనిపించడం— నేను ఇంత దూరంలో నా గదిలో కిటికీ దగ్గర నిల బడి చెయ్యి వూపడం, ఆ అమ్మాయి నవ్వడం— ఆ అమ్మాయి తోటి మాట్లాడ డానికి అవకాశం ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురు చూడసాగాను.

సూర్యాస్తమయం అయింది. ఇంకా వెలుగు పూర్తిగా పోలేదు. చీకటి కొంచెం కొంచెం అలుముకుంటోంది. అలా ఖాళీ స్థలం వేపు వెళ్లాను. ఆ అమ్మాయి దిగా లుగా తాళం వేసి ఉన్న వాళ్ల గుమ్మం దగ్గర నిలబడి ఉంది. పచ్చని బట్టలు, కాళ్లకి పసుపూపారాణీ, ముఖాన్ని కళ్యాణం బొట్టూను. నేను నాలుగడుగులు అటు వేసి "భోగి వళ్ల పేరంటానికి నువు వెళ్ల లేదా?" అని పలకరించాను. ఆ అమ్మాయి తల ఎత్తి నాకేసి చూసింది. దిగులుగా ఉన్న ముఖంలోకి బలవంతంగా నవ్వు తెచ్చుకుంది.

"నేనూ వెళ్లలేదూ.... ఏం తోచక ఇలా బయలు దేరాను" అన్నాను, "అహ!" అన్నట్లు నవ్వింది.

"అలా ఎక్కడికేనా వెళదాం వస్తా వేమిటీ?" అన్నా— ఆశ్చర్యంగా నాకేసి చూసింది.

నేను ఆమె కేసి చూశాను. తన అంద మైన కళ్లని అటూ ఇటూ తిప్పుతూ సరే అన్నట్లుగా తల వూపింది.

"ఎక్కడికి వెళదాం?... నాకీ వూరు కొత్త— నువ్వే చెప్పు"— అన్నా.

కొంచెం సేపు ఆలోచించి, ఆ జువ్వి చెట్టు వేపు చూపించింది చేత్తో—

"అమ్మో, ఈ మసక చీకట్లో అక్క డికా?"

ఆ అమ్మాయి నవ్వింది. నా కది హేళనగా వినిపించింది. "సరే నడు" అన్నా మొండిగా ధైర్యం తెచ్చుకొని.

ముందు ఆ అమ్మాయి నడుస్తోంది. వెనకాల నేను. దారిలో ఎవ్వరం మాట్లాడ లేదు. నేల అంటకుండా గెంతు తూన్నట్లు నడుస్తూన్న ఆ అమ్మాయి— ఆ అమ్మాయి నడకని ఆశ్చర్యంగా చూస్తూ నేను, జువ్వి చెట్టు దగ్గర ఉన్న బావి దగ్గరకు వచ్చి ఆగింది. నేను చప్టా దగ్గిరే ఉన్న వో బండ రాయి మీద కూచున్నా. ఆ అమ్మాయి నూతి అంచు మీద అనీ అననట్లు కూచుంది. కాస్సేపు ఎవళ్ళం మాట్లాడ లేదు.

కొంతసేపయ్యాక నేను అన్నాను "నాకో విందుకో నీతోటి మాట్లాడాలని చాలా రోజుల నుంచి ఉంది."

బరువైన తన కనురెప్పల్ని ఎత్తి నాకేసి వో మారు చూసి గట్టిగా శ్వాస వదులుతూ నిర్లిప్తంగా నవ్వింది.

"నిన్ను చూస్తే ఏదో దిగులుగా ఉన్నట్లు కనిపిస్తావు — ఎందుకలా ఉంటావు? ఏమి లోటని? మీ అమ్మకీ నాన్నకీ నువ్వు ఒక్కత్తెవే కూతురు కాబోలు. అవునా?" అన్నా— ఆ అమ్మాయి సమాధానం చెప్పలేదు.

"వో రోజున మీ నాన్ననీ అమ్మనీ చూశాను— నీలాగే మీ అమ్మగారు కూడా బాగుంటారు."

ఆ అమ్మాయి ఉలిక్కిపడి "అమ్మా?" అంది. నూతిలోంచి వచ్చినట్లుంది ఆ ప్రశ్న.

"ఆవిడ మీ అమ్మగారు కాదూ?... మరెవరు?... నేను మీ అమ్మగారు అను కున్నాను" అన్నా—

"అందరూ అలాగే అనుకుంటారు. ఇంకో విధంగా అనుకునేలాగ ఆమె ఎప్పుడూ ప్రవర్తించదుగా?... ఆవిడ నా సవితి తల్లి. మా అమ్మ నా పదో ఏట పోయింది."

"అలాగా పాపం. అయితే ఈవిడ నిన్ను అసలు తల్లిలాగే చూస్తుందన్న మాట!"

"అంతకంటే ఎక్కువగానే చూసేది..."

"చూసేది అంటున్నావు. ఇప్పుడలా చూడడం లేదూ?"

"ఇప్పుడా?... ఇప్పు డావిడ చూడడం ఎవరికి కావాలి?" అని పకపకా నవ్వింది ఆ అమ్మాయి.

"బాగా చూసేది అని వో పక్క నుంచి అంటూనే ఇంకో పక్క నుంచి హేళనగా మాట్లాడుతున్నావు. నాకేం అర్థం కావడం లేదు" అన్నా—

"అవును— మీరు కొత్తగా వచ్చారు కదూ? ఈ సంగతులేం మీకు తెలియవు. చెప్తా వినండి" అంటూ నెమ్మదిగా ఏ లోకంలోంచో చెబుతున్నట్లు చెప్పడం ప్రారంభించింది గాంభీర్యంతో కూడిన సౌమ్యమైన కంఠంతో.

"మా అమ్మ పోయేటప్పటికి పదేళ్ల దాన్ని. అమ్మ లేని లోకం నాకు చీకటిగా మారిపోయింది. అమ్మ పడుకునే మంచం, వాడుకొనే సామానులూ, పెంచుకొనే

పొక్కిలూ ఏం చూసినా నాకు బెంగతో ఏడుపు వచ్చేది. బావురు మని ఏడుద్దాం అంటే ఎవరో ఒకరు వచ్చి "ఏడవకూడదు తప్పు" అని కేక వేసేవారు. మూల గది లోకి పోయి ఒక్కత్తెనీ మూగగా ఎక్కెక్కి తలగడా తడిసి పోయేలాగ ఏడుస్తూ, "అమ్మా రావూ— నాకు కనిపించవూ— ఒక్క సారి రా అమ్మా" అంటూ గంటల కొలదీ తల బాదుకున్నా అమ్మ కనిపించేది కాదు. 'ఇంక అస్సలు అమ్మ కనిపించదు' అనే ఆలోచన వచ్చేసరికి కడుపులో పెద్ద బెంగ— ఇలా ఏ గదిలోనో ఒక్కత్తెనీ కూచుని ఏడ్చి ఏడ్చి నిద్రపోతే, నాన్నగారు నన్ను వెతుక్కుంటూ వచ్చి నన్ను చూసి "నా తల్లి ఇక్కడ పడుకున్నావా?" అంటూ బావురు మనేవారు. ఆయన బాధ చూడ లేక నేనూ, నా ఆవేదన చూడలేక ఆయనా ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం కౌగలించుకొని ఏడుస్తూంటే ఇది పనికాదని అత్తయ్య నన్ను వాళ్ళ వూరు తీసుకు పోయింది. అక్కడ మావయ్య కబుర్లతోనూ అత్తయ్య ఆదరణతోనూ నాలుగైదు నెలలు గడిచే సరికి కొంచెం కోలుకొన్నాను. నాన్న అప్పుడప్పుడు వచ్చి చూసేవారు". నేను ఆసక్తితో వింటూండడం చూసి కాస్సేపు ఆగి మళ్ళీ మొదలెట్టింది. "కొన్నాళ్ళు అయ్యాక నాన్న నన్ను ఇక్కడికి తీసుకు వచ్చారు. అప్పటికే మా సవితి తల్లి ఇంట్లో ఉంది. ఆవిణ్ణి 'అమ్మ' అని పిలవమన్నారు మా నాన్న. ఏమైనా సరే నేను అలా పిలవ దలుచుకోలేదు. పైగా నాకు ఆవిణ్ణి చూస్తూంటే ఎందుకో చెప్పలేనంత కోపంగా ఉండేది. ఆవిడ ఏం చెప్పినా చేసే దానిని కాదు. అసలు ఆవిడ పొడే కిట్టేదికాదు నాకు."


"నా ప్రవర్తన చూసి ఆవిడ కూడా అలాగే ఉండేది. అకారణంగా నన్ను సాధిస్తూ ఉండేది. ఎప్పుడూ ఏదో ఒకటి తిడుతూ ఉండేది. ఏ కాస్త తేడా వచ్చినా మొట్టి కాయలు మొట్టేది. నేనిబాధ పడలేక నాన్నతో చెప్పేదాన్ని— దాంతో నాన్నకి ఆవిడకీ పెద్ద జగడం అయేది. "దాన్ని ఏమేనా చేస్తే మర్యాద దక్కదని" ఆవిడని కేక లేసేవారు— నన్ను దగ్గరగా తీసుకొని ఎంతో ప్రేమగా లాలించేవారు. మా నాన్న గారి కౌగిలితో మా అమ్మ పోయిన బాధని కూడా మరిచిపోయేదాన్ని. మా నాన్న ఎంత మంచివారు! అని ఆనందంతో కన్నీళ్ళు నింపుకునేదాన్ని. ఓ రోజున మామూలంగా మా నాన్నకీ ఆవిడకీ పెద్ద తగాదా అయింది— చివరికి "అది ముఖ్యమా నేను ముఖ్యమా?" అంది ఆవిడ. "అదే ముఖ్యం" అని నిస్సంకోచంగా చెప్పారు నాన్న. "అయితే నేను పోతున్నా" నంది ఆవిడ. "పో" అన్నారు."

"ఆవిడ పోలేదు, కాని మర్నాటి నుంచీ నన్ను హింసించే పద్ధతి మాత్రం ఆవిడ లోంచి పోయింది. నన్ను లాలనగా ప్రేమగా చూడడం మొదలు పెట్టింది. నేను అడిగి నవీ అడగనవీ అన్నీ కొనిపెట్టేది. స్వంత కూతురుకంటే ఎక్కువగా చూసుకోవడం మొదలు పెట్టేసరికి, మా అమ్మ కూడా నన్నెప్పుడూ ఇలా చూడలేదే అనిపించేది. "మన అమ్మాయికి ఇది కావాలి అది కావాలి— ఇలా చెయ్యాలి అలా చెయ్యాలి" అంటూంటే మా నాన్నగారు మొదట్లో ఆశ్చర్యపోయారు. తరువాత చాలా సంతోషించారు. ఆవిణ్ణి కూడా ఎప్పుడూ లేనంత బాగా చూడ్డం మొదలుపెట్టారు".

"బాగుంది" అన్నా—ఆ అమ్మాయి అదోలా నాకేసి చూసి మళ్ళీ ప్రారంభించింది.

"ఆవిడ నన్ను ప్రేమగా చూడ్డం ప్రారంభించాక మా నాన్నగారు నా సంగతి అంత పట్టించుకోవడం మానేశారు. కొన్నాళ్ళకి నేనంటే ఆయన బాగా నిర్లిప్తంగా ఉంటూ వచ్చారు. మా అమ్మకంటే కూడా ఈవిడ నన్ను బాగా చూస్తోందనే నమ్మ కానికి వచ్చేశాక ఇంక నాగొడవ ఆయన పట్టించుకోవడం మానేశారు.


నా మీద రాను రాను ఆవిడకి ప్రేమ ఎక్కువై పోవడంతో నాకు ఇబ్బందులూ కష్టాలూ ఎక్కువ కాజొచ్చాయి. మా నాన్నగారి తాహతుకి మించి నాకు నస్తు వుల్నీ బట్టలనీ కొనిపించేది. నా దగ్గర డబ్బు లేదని ఆయన అన్నా, నాకివన్నీ వద్దని నేను అన్నా, వినిపించుకునేది కాదు. పంతంబట్టి కొనిపించేది. మా నాన్నగారికి విపరీతమైన కోపం వచ్చేది. కాని అది ఎవరిమీదో మొదట్లో అర్థం అయేది కాదు. తర్వాత తర్వాత తెలిసింది నామీదే అని. నేను ఎంత నచ్చ చెప్పినా ఆయన నమ్మేవారు కాదు. నేనే పేచీ పెట్టి ఇవన్నీ కొనిపించుకుంటున్నానని ఆయన నమ్మకం. పరిమితమైన ఆయన ఆదాయం ఇలా అనవసరంగా ఖర్చు కావడంతో మా నిత్య జీవితం రాను రాను దుర్భరం కాసాగింది. ఫలితంగా ఎప్పుడూ తిట్టని తిట్లు నన్ను మా నాన్నగారు తిడుతూండేవారు. "శని గ్రహం" అనీ, "నన్ను కొరుక్కు తిన డానికే దాపురించిందనీ" "నా పాలిటి గుదిబండ" అనీను. నేను మౌనంగా ఏడిచే దాన్ని. నాకివన్నీ వద్దంటే వినేవారూ కాదు నమ్మేవారూ కాదు. "నామీద నీ భయం కరమైన ఈ ప్రేమ ఆపు చెయ్యి" అని మా సవితి తల్లి కాళ్ళు పట్టుకొని ఎన్ని మార్లో బతిమాలాను. ఊహూ!... పగ పట్టిన తాచులాగ ఆవిడ తన పద్ధతి అలా కొనసాగిస్తూనే ఉంది". కొంచెం సేపు మౌనంగా ఉండిపోయింది. తర్వాత మళ్ళీ మొదలెట్టింది: "ఇలా ఉండగా నాకు పదహారేళ్ళు వచ్చాయి. ఏదో మామూలు సంబంధం చూడడానికి వీలులేదు అంది. మంచి సంబంధం చెయ్యకపోతే అసలు సవితి



తల్లి నీ పెళ్ళి అరలోరు అంది. పోదిరంపింది; అల్లరి చేసింది, ఏడిచింది, మొత్తుకుంది. మొత్తానికి వెల పట్టిన రోజున ఎంతో అయిష్టంతో మా నాన్న వో డాక్టర్ చదువుతున్న కుర్రాడికి నన్ను చూపించి పదివేలు కట్నానికి ఒప్పించారు. అంత

నిజానిజాలు

పెద్ద సంబంధం వద్దన్నాను. నేను చేసు కోను అన్నాను. కాని మా నాన్న నన్ను అర్థం చేసుకోకుండా "ఇవాళ ఇలాగే అంటావు. రేప్పొద్దున్న మా సవితి తల్లి, మా వాళ్ళు ఈ దిక్కు ... చేశారని వూరూ వాడా చాటుతావు— ఎందుకులే తల్లీ, ఆనక మేం ముష్టి ఎత్తుకుంటే ఎత్తుకున్నాం ప్రస్తుతానికి ఈ ఇల్లు అమ్మేసి పదివేలూ కట్నం ఇచ్చి ఈ సంబంధం చేసెయ్యనీ" అన్నారు.



''ఇల్లు అమ్మేస్తారా? నాకోసం?'' మా నాన్న అన్న మాటలకి నేను వెక్కి వెక్కి ఏడ్చాను. కాళ్ళు పట్టు కున్నాను; బతిమాలాను, ఉపవాసాలున్నాను, నేనీ సంబంధం చేసుకోనని బెదిరించాను. మిమ్మల్ని బాధించి పెద్ద సంబంధం చేయ మనేటంత స్వార్థపరురాలిని కాదు అన్నాను. నాకు అంత మూర్ఖం లేదన్నాను. నామాట నమ్మండి అన్నాను, మీరు నాకోసం సర్వ నాశనం కావద్దు అన్నాను.

మా సవితి తల్లి కాని, నాన్న కాని నా మాట వినలేదు. పెళ్ళి పనులు జోరుగా సాగించేస్తున్నారు. ఇల్లు కూడా బేరం పెట్టేసి బజానా తీసుకున్నారు. ఏడు స్తూన్న నన్ను బలవంతంగా పెళ్ళికూతుర్ని చేశారు. భోగినాడు రాత్రి ముహూర్తం కూడా నిర్ణయించారు. ఇంకీ పెళ్ళి తప్పదు. ఈ పెళ్ళి నేను చేసుకుంటే మా నాన్నకి జీవించడానికి ఇంకేం మిగలదు. నాధర్మమా అని ముష్టి ఎత్తుకోవాలి. భోగినాడు రాత్రే నాపెళ్ళి'' అంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగింది బావిగట్టుమీద కూర్చుని ఆ అమ్మాయి.

నేను ఆశ్చర్యపోతూ ''ఈ రాత్రి నీ పెళ్ళా? అందుకేనా ఈ కళ్యాణం బొట్టూ అవీను? పెళ్ళి హడావిడే లేదే, మీ ఇంటి దగ్గర? నిజంగానే! ఇవాళే నీపెళ్ళి? నీ పెళ్ళి ఇవాళే!'' అని నేనోమూల అంటూం ఉంటే, ఉరుము ఉరిమినట్లు ఒక్క పెద్ద నవ్వు నవ్వి ''నా పెళ్ళి— అహ్హా హ్హా— నా పెళ్ళి'' అంటూ ఆ అమ్మాయి బావిలో ఉరికేసింది దభీమని. నిశ్చేష్టురాలనయి పోయి భయంతో నేను కెవ్వుమని ఒక్క కేకవేశాను. ''అయ్యో అమ్మాయి పడి పోయింది, అమ్మాయి పడి పోయింది'' అని అరిచాను గట్టిగా. నా అరుపులు విని దూరం నుంచి ఆ మసక చీకట్లో అయి దారుగురు పరిగెత్తుకొని వచ్చారు. నేను వాళ్ళతో కంగారుగా ''ఇప్పుడే పడిపోయింది అదే ఆ పెళ్ళికూతురు. ఆ తుమ్మ చెట్టు దగ్గర ఇంటివారి అమ్మాయి'' అంటూ బావి చుట్టూ అలంగం తిరుగుతూంటే, వచ్చిన వాళ్ళంతా నిర్లిప్తంగా ''సరి— అదా? అది ఇప్పుడు పడి పోవడమే! నిరుడు భోగినాడే ఈ బావిలో పడి చచ్చింది. ముదనష్టపు పిల్ల— నిక్షేపం లాంటి పెళ్ళి చేసుకోలేక తెగులు'' అన్నారు.

నేను తెల్లబోయి ''కాదు ఇప్పుడు నా ఎదురు గుండా...'' అనబోతే ''చాల్లెండి అది చచ్చి ఇవాళ్టికి ఏడాదయింది. మీరు ఎవర్ని చూశారో'' అన్నారు. ''అయితే ఇప్పటిదాకా నేను మాట్లాడిన అమ్మాయి!.. అమ్మ బాబోయ్!''—అంటూ వెనక్కి విరుచుకు పడిపోయాను.

నాకు స్పృహ వచ్చి కళ్ళు తెరిచేటప్పటికి నా చుట్టూ ఉన్న వాళ్ళు తలకొక విధం గానూ అంటున్నారు.

''తను చచ్చింది చాలక తక్కిన వాళ్ళం దరికీ కనిపించి వాళ్ళని కూడా చంపుకు తినడం ఎందుకు?''

''ఎందుకేమిటి ? బ్రతికున్నప్పుడు ఆ సవితి తల్లినీ తండ్రినీ కాల్చుకు తిన లేదూ?''

''బాగా చెప్పావు, బతికీ సాధించింది, చచ్చీ సాధించింది, దేవుడు లాంటి ఆ తండ్రినీ, తల్లికంటే శతవిధాల ప్రేమగా చూసుకునే ఆ ఇల్లాలినీను.''


''పాపం — లోపల్లోపల ఎంత కుమిలి కుమిలి ఏడుస్తున్నారో వాళ్ళిద్దరూ.''

''కడుపు తీపివల్ల అలా ఇదవుతున్నారు కాని, ఇలాంటి పాడు బుద్ధులతో ప్రాణాలు బలవంతంగా తీసుకునే అర్ధాయుష్యపు మూర్ఖుల కోసం ఏడవక్కర్లేదు''

''బాగా చెప్పావు— ఏం తెగులా? నిక్షేపం లాంటి సంబంధం చూశాడే తండ్రి? తనకేం లోటని చావడం? వెధవ బతుకు వెధవ బతుకా అని—''

ఇలా నలుగురూ నాలుగు రకాలుగానూ అనుకుంటుంటే, నేను చేసేదేంలేక, చెప్ప గలిగింది అంతకంటే లేక, జరిగిందంతా జ్ఞాపకం వస్తూంటే భయంతో కళ్ళు మూసుకున్నాను.

వెంటనే దీనంగా ఆ అమ్మాయి ముఖం కనిపించింది. జాలిగా నాకేసి చూస్తోంది. ''మీరూ నన్ను అర్థం చేసుకోలేదూ?'' అన్నట్లున్నాయి ఆ చూపులు. నా మనసు కరిగి పోయింది. దుఃఖం పెల్లుబికి వచ్చింది. ''నీ జీవితంలోని నిజానిజాలు వీళ్ళకి తెలియవు. నీ రూపాన్నే చూశారు కాని నీ బాధనేం చూశారు? నీ హృదయాన్నేం ఎరుగుదురు? నాకు తెలుసు తల్లీ. వెన్న లాంటి నీ హృదయం నాకు తెలుసు. నువ్వెందుకీ ఆత్మహత్యానికి పూనుకున్నావో, నీ హృదయం ఎంత కలగిపోతే నువ్వీపని చేశావో నాకు తెలుసు. కళ్ళు తుడుచుకో తల్లీ!'' అంటూంటే రెండు కన్నీటి బొట్లు నా కళ్ళలోంచి జారి, నా గుండె లోని మంటకి ఆవిరి అయి గాలిలో కలిసి పోయాయి, ఆ అమ్మాయి జీవితంలాగా, ఆచరణలో పెట్టలేని నా స్త్రీ సంక్షేమ ఆలోచనల్లాగాను. ●



వారఫలం

25-11-1966 శుక్రవారం మొదలు 1-12-1966 గురువారం వరకు.

మేషం: వృత్తివ్యాపారాల్లో పోటీవారితో పోటీ పెరగడం వలన మీ కార్యక్రమాలను మార్చుకో వలసి వస్తుంది. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు వస్తాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు: కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృషభం : వారం ప్రారంభంలో వృత్తివ్యాపారాల్లో వ్యయ ప్రయాసలకు గురి కావలసి వస్తుంది భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాల్లో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారంమధ్యలో చేసే ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగానే ఉంటుంది. పోటీ వారిలో గౌరవం బాగా ఉంటుంది.

మిథునం : వ్యాపారంలో మీ ఆలోచనలు మీకే కాకుండా మీ మిత్రులకుకూడా లాభదాయకంగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో వారం మధ్యలో చికాకులు యేర్పడతాయి. విలాసాలకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. పుణ్యకార్యాలు చేస్తారు.

స్త్రీలకు— కుటుంబ కార్యక్రమాలు ఒడుదుడుకులులేకుండా నెరవేరుతాయి. అధికవ్యయం జరుగుతుంది.

కర్కాటకం ఇప్పుడు మీరుజరిపే వ్యవహారాలవల్ల ముందు కూడా తగిన ఉపయోగం ఉంటుంది. సాహసముతోకూడిన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. బంధువులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

సింహం : వృత్తివ్యాపారాల్లో యిదివరకు యేర్పడిన చికాకులు తొలగిపోతాయి. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బుచేతికి వస్తుంది. ఉద్యోగంలో మీ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది. విలాస వస్తువులు కొంటారు.

కన్య : వ్యాపారవిస్తరణ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వారం ప్రారంభంలో సాహసముతోకూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వృత్తిలో ముఖ్యమైన సంభాషణలను జరుపగలరు. నూతన వ్యవహారాలు శ్రమమీద ఫలిస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— స్వల్పఅనారోగ్యం చేస్తుంది. పోటీ వారితో మాటపట్టింపులు తగవు.

తుల : ప్రారంభించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది కాని ఫలితంమాత్రం సంతృప్తికరంగా ఉండదు. భారీ యెత్తున చేసే వ్యాపారాలు ప్రారంభించడానికి యిది సమయంకాదు. రావలసిన డబ్బు సమయానికి అందకపోవడంవల్ల యిబ్బంది కలుగుతుంది. మానసికాందోళన కలుగుతుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

వృశ్చికం : వృత్తివ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం తగదు. ఉద్యోగంలో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

ధనుస్సు : వ్యాపారంలో ఆదాయంపెరిగినా, దానికి తగినట్లుగా వ్యయంకూడా పెరుగుతుంది. అధికారుల వలన జరుగవలసిన వ్యవహారాల్లో కొత్త సమస్యలు యేర్పడుతాయి. ఉద్యోగంలో స్వల్ప భేదాభిప్రాయాలు రావచ్చును. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

స్త్రీలకు— కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మకరం : సామాన్యమైన వ్యవహారాలకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. రావలసిన డబ్బుమీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. సాహసముతోకూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. శుభకార్యాలవిషయంలో మీ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.


కుంభం : వ్యాపారవిస్తరణ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో అనుకూలమైన మార్పులు వస్తాయి. నూతన వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో భేదాభిప్రాయాలు రావచ్చును. బంధువులకు సహాయం చేస్తారు.


మీనం: ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. వృత్తిలో కొత్తవారితో పోటీ యేర్పడుతుంది. ప్రయాణాలు కొంచెం శ్రమమీద ఫలిస్తాయి. వ్యాపారంలో సమయానికి మిత్రుల సహకారం లభించగలదు. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉంటుంది. ఉద్యోగులకు మంచి సమయం.

—మహేష్



కేవలం 7 రోజుల చికిత్సతో మీ చర్మం శుభ్రంగా వుంటుంది



* దాక్టర్లు సిఫారసుచేసే అసాధారణమైన క్రిమిసంహారక మొటిమల మందు.
* చక్కని సువాసన.

nital

రూ. 1.90 మాత్రమే పన్నులు వేరు

MEDICATED PIMPLE CREAM

(నిటాల్ మొటిమల మందు)

నిటాల్ మొటిమల మందు సురక్షితంగా, హాయిగా, పూర్తిగా మొటిమలను తొలిగిస్తుంది. చర్మంలోనికి పోయి, ముమ్ముందు తిరిగి మొటిమలను లేవకుండా చేస్తుంది. లోపలికంతా పోవడంవేత మొదలంటా మొటిమలను తీసివేస్తుంది. మొటిమలు ఎండి పడిపోగలవు. దీన్ని వాడిన తర్వాత ఇతర దోషాలేమీ వుండవు. మచ్చలుగాని, గుంటలుగాని పడవు.

యువతీ యువకులందరూ వాడవచ్చు. చర్మాన్ని శుభ్రపరచి, నునుపు తేల్చి నిగనిగలాడుతూ యౌవ్వనం ఉట్టిపడేటట్లు చేస్తుంది.

ఉచితం-	బాలసంరక్షణం చిన్నపుస్తకం సి బ్యాటర వద్ద దొరుకును.

ఉత్పత్తిదారులు:

కొచ్చిన్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్


నవరత్న హౌస్, మంత్రా రోడ్, కొచ్చిన్-2.

ఉపయోగించు పద్ధతులను తెలుపు కరపత్రము ప్యాకేజీలో ఉంచబడినది.

మద్రాసు, ఆంధ్రప్రదేశ్, మైసూరు, కేరళ లకు డిస్ట్రిబ్యూటర్లు:

గణపతి అండ్ కంపెని,

103/104, లింగిశెట్టివీధి, పి. ఒ. బాక్స్ నెం. 1986. మద్రాసు—1.



గ్రామఫోను ప్లేటు

క. ఒక గ్రామఫోను ప్లేటు వ్యాసం 12 అంగుళాలు. మధ్యలో పేర్లు వ్రాయడానికి 4 అంగుళాల వ్యాసం గల గుండ్రటి భాగాన్ని వదిలేశారు. అంచున ఒక అంగుళం వెడల్పున వదిలేసి తరువాత నుంచి రికార్డింగు జరిగింది. అంగుళానికి 90 "గీతలు" ఉన్నాయి అనుకుంటే పాట పూర్తి అయేసరికి గ్రామఫోను ముల్లు ఎంతదూరం ప్రయాణం చేసి వుంటుంది.?

ఎవరిమాట నిజం?

చ. ఒకరేడియో దుకాణపు యజమాని మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి కొట్టుకు వచ్చేసరికి కొట్టులో మార్చున్న అతడి అసిస్టెంటు మొహం ఇంత చేసుకుని తాను చేసిన తెలివైన పనిని యజమానికి విన్నవించాడు.

"చాలాకాలం నుంచి అమ్ముడవకుండా ఉండిపోయిన ఆ రెండు రేడియోలూ వదిలించేశాను సార్!"

"ఏవి? అమర్ఫీ, బుష్‌సెట్లేనా?"

"అవును సార్! అవే. మీరు ఇల్లా వెళ్లారో లేదో ఒకడువచ్చి ఆ మర్ఫీరేడియో బేరం చేశాడండీ. 240 రూ లకి కుదిర్చి ఇచ్చేశా. అందులో 20% నష్టం వస్తుందని తెలుసు అనుకోండి. కాని అతడే బుష్ రేడియో కూడా 240 రూపాయలకు కొనుక్కున్నాడు. ఇందులో 20% లాభం వస్తుంది కదా, ఈలాభం ఆ నష్టం చెల్లు అయిపోతాయి లే అని ఇచ్చేశానండీ." అన్నాడు అసిస్టెంటు, ఈ సారితో తనకు జీతం పెరుగుతుందన్న గట్టి నమ్మకంతో.

జీతం పెంచడం మాట అటుంచి నష్టం వచ్చిందని అసిస్టెంటుని చెడామడా తిట్టేడు కొట్టు యజమాని.

లాభనష్టాలు చెల్లు అయిపోయాయి అనే అసిస్టెంటు మాట నిజమా? లేక నష్టం వచ్చిందన్న యజమాని మాట నిజమా?

షర్బత్తు

ట. వేసవి కాలం వచ్చేసింది. బజారులో కొత్తగా తెరిచిన షాపులోకి వెళ్లి, 5 రూపాయలు పెట్టి షర్బత్తు సీసా కొన్నాడొకడు.

"ఖాళీ సీసా తిరిగి ఇస్తే కొనుక్కుంటాం సార్!" అన్నాడు కొట్టు యజమాని.

"ఎంతకి?"



"సీసాకన్న షర్బత్తు ఖరీదు 4 రూపాయలు ఎక్కువ"

'అంటే ఖాళీ సీసాకి రూపాయి వస్తుందన్నమాట. అయితే ఫరవాలేదు' అనుకున్నాడు ఆసామీ.

నిజంగా ఖాళీ సీసాకి రూపాయి వస్తుందా?

భూదేవికి వడ్డాణం



త. భూగోళం ఎత్తు పల్లాలు లేకుండా నున్నగా గుండ్రంగా ఉందనుకుందాం మాట వరుసకి. ఒక పెద్ద రాక్షసుడు ఈ భూగోళానికి ఇనుప పటకా ఒకటి తయారు చేసి, బిగువుగా తగిలించేశాడు.

ఆటు తరువాత ఆ పటకాను మరి కాస్త పెద్దది చేసి, ప్రతి చోటా భూమికి అడుగు ఎత్తు ఉండేలా వెయ్యాలని ఆ రాక్షసుడు ముచ్చట పడ్డాడు. నడుము ఒరుసుకుపోతున్న ఈ ఇనుప పటకా వదులు అయితే బాగుండునని తహ తహ లాడుతున్న భూదేవికి కూడా ఈ పని ఇష్టమే. భూమికి ప్రతి చోటా ఒక అడుగు ఎత్తులో ఉండాలంటే పటకా పొడవు ఎంత పెంచాలో ఆ రాక్షసుడికి తెలియలేదు. వాడికి బలం అంటే ఉంది కాని తెలివి లేదు. మీరేమైనా వాడికి సాయపడగలరేమో ప్రయత్నించండి. అన్నట్టు భూగోళపు చుట్టుకొలత 25,000 మైళ్లు. మైలుకి ఎన్ని అడుగులో తెలుసుగా!

చెల్లని రూపాయి

ఒకడు రంగన్న కిళ్లీ కొట్టుకు వెళ్లి, పది పైసలకు కిళ్లీకొని, ఒక రూపాయి ఇచ్చాడు. రంగన్న దగ్గర చిల్లర లేక పోయింది. పక్కనే ఉన్న హొటలుకి వెళ్లి, చిల్లర తెచ్చి, అతడికి 10 పైసలు ఇచ్చేశాడు. అతడు వెళ్లి పోయిన కొద్ది సేపటికి హొటలు యజమాని కిళ్లీ కొట్టుకి వచ్చి, ఇందాకా ఇచ్చిన రూపాయి చెల్లదని తిరిగి ఇచ్చేసి, మరో మంచి రూపాయి తీసుకున్నాడు.

మొత్తం మీద రంగన్నకి ఎంత నష్టం వచ్చింది?

(జవాబులు 26 పేజీలో)

"ముందుగా తిన్న అమ్మ మొగుడాక లెరుగదు"

ఎం. సత్యవతి

"హరిజనస్త్రీగా నా అనుభవాలు" అనే నా వ్యాసంపై సోదరి పంచాక్షరిగారు విమర్శకు దిగేముందు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకున్నట్లయితే వారి విమర్శలో అర్థం లేని అసూయ లోపించేది.

హృదయ విదారకమైన అనుభవాలను పాఠక లోకానికి ఎంత సూటిగా చెప్తే అంత స్పష్టంగా ఉంటుందని, దాంతో సమాజంలో కొంత మార్పు రాగలదను ఆశతోనే గాని, 'కులీను'ల పట్టి పాను బూతికోసం గాదు నేను వ్రాసిన వ్యాసం, అనే విషయాన్ని గూడ పంచాక్షరి గారు గమనించాలి.

ఆవేశానికి బదులుగా వివేకంతో వ్రాస్తే బాగుండేదని పంచాక్షరి గారు సలహా ఇచ్చారు. వారు "రికమెండ్" చేసిన "వివేకం" లోని ఆంతర్యం, "మా మనసులు చివుక్కుమనే విధంగా మీరు (హరిజనులు) వ్రాయకూడదు, మీ రచనలు ఉత్త చప్పగా ఉండాలి" అన్నట్టుంది. ఆవేశం వల్లనే విజ్ఞానం, ఆ విజ్ఞానం వల్లనే పోరాటం వస్తుంది. పూజ్య బాపూజీ హరిజన ప్రతినిధిగా 'అగ్ర' కులాలమీద సాగించిన పోరాటం వల్లనే ఈనాడు హరిజనుల స్థితి కొస్త మెరుగ్గా ఉంది. కాక పంచాక్షరి గారు ప్రబోధించిన 'వివేకం' అనే దాస్య మనస్తత్వంతోనే ఉంటే హరిజనుల పరిస్థితి ఇంకా అధ్వానంగానే ఉండేది. ఇది ఆవేశంగాదు. "సత్యాగ్రహం" అనే సత్యాన్ని పాఠకులు గమనించే ఉంటారు.

పంచాక్షరి గారికి పల్లెటూర్లలో బ్రతికే హరిజనుల దుర్భర జీవితాలు తెలియనట్టుంది. (ఒక హరిజన స్నేహితుని ఇంటికి భోజనానికి వెళ్ళినందుకే ఆమె పెద్ద సంస్కారం అనుకుంటున్నారు!) పట్టణాలలోని వారి పరిస్థితి చూచి హరిజనులు చాలా అభివృద్ధిలోకి వచ్చారని భావిస్తున్నట్టుంది. భారతదేశంలో 80 శాతం పల్లెటూర్లనే విషయం సోదరి పంచాక్షరిగారు గుర్తు తెచ్చుకుంటే ఈ సమస్య ఎంత మందికి పరిమితమై ఉందో తెలుస్తుంది.

"అగ్రత్వం అనేది అసలు కొందరి మనసుల్లోను సత్యవతిగారి మాటల్లోను ఉంది" అని వ్రాశారు పంచాక్షరి గారు. మళ్ళీ జన్మంటూ ఉంటే పంచాక్షరిగారు వంటివారు పంచమకులంలో పుట్టితే ఎంత మందిలో ఈ "అగ్రత్వం" నాటుకొని ఉందో ఆవిడగారికి బోధపడుతుంది. ఏక కులం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు అని వ్రాశారు. పంచమకులంలో జన్మ ఎత్తేవరకు కూడా (జాత్యహంకారం భారత సమాజంలో ఇప్పటిలాగే ఉంటే) ఈ సమస్య ఏమాత్రం సమసిపోకుండా యీనాటికన్నా ఇంకా పచ్చగా ఎదిగి ఉంటుందనే నా భయం.

ఇక "అగ్రకులం" అనే పదాన్ని నా వ్యాసంలో వాడడం వారిని అందల మెక్కించడానికి కాదు. వారిలో నిగూఢంగా ఉన్న అహంకారం తొలగడానికే అని పంచాక్షరి గారికి మనవి.

"మా యింట్లో ఎట్టా బువ్వ తింటారు?" అన్న ఒక డొక్క శుద్ధి లేని హరిజన స్త్రీ నోటి నుంచి "మీరు బ్రాహ్మలటగా" అనే 'నాగరిక' పదజాలం వెలువడడం, అసందర్భంగా తోస్తుంది. పంచాక్షరిగారు తమ "వివేకాన్ని" వినియోగించి సౌజన్యంతో విషయాన్ని విపులీకరించి ఆ రావుగారి తల్లికి జనించిన "పాపం చుట్టుకోదూ?" అనే భయాన్ని తొలిగించి వారింటిలో భోంచేసి రావలసింది. ఆ విధంగా భోంచేసి వచ్చినట్లయితే నిజంగా పంచాక్షరిగారిని అభినందించాల్సి ఉండేది. అంతే కాని ఇంత చిన్న సంఘటనకే తట్టుకోలేక తలలు వంచుకుని, పోయిన వారికి "నిగ్రహం" ఎంతవరకుందో చదువరులు గ్రహించ గలరు. జిల్లా పరిషత్ చైర్మన్ సతీమణి పెరిగిన వాతావరణాన్ని అంత బాగా అర్థం చేసుకుని "సపోర్ట్"కు పూనుకున్న పంచాక్షరిగారు యుగయుగాలుగా విద్యలేమితో అణగారి పోయిన హరిజన స్త్రీ మాటలు అర్థం చేసికోక పోవడం నిజంగా, శోచనీయం.

రావుగారి తల్లికి తన యింటికి భోజనానికి వచ్చే అతిథులెవరో తెలిసి ఉండే భోజన పదార్థాలన్నీ తయారు చేసి ఉంటుంది. ఆవిడ అంగీకారంతోనే రావుగారు పంచాక్షరి కుటుంబాన్ని భోజనానికి పిలిచి ఉంటారు. ఒక వేళ ఆవిడకు పొసగితే ఉంటే కుమారుడితో మొదటే చెప్పి ఉండేది. అప్పుడు రావుగారు "పంచాక్షరి" కుటుంబాన్ని భోజనాని కాహ్వానించేవారే కాదు. ఆహ్వానించిన అతిథులను కులభేదాలతో తిప్పి పంపించే 'హీనస్థితి'కి అమాయకులైన హరిజనులు దిగజారి పోలేదను విషయాన్ని విమర్శకురాలు అర్థం చేసుకోవాలి.

ఈర్ష్య అనేది ఒక వ్యసనం. కాబట్టి దాన్ని ఈసడించాలి గాని మానవ సహజం అనడం, సమంజసం కాదు. దానిస్థానంలో పోటీ మానవ సహజం అన్నట్టయితే బాగుండేది. మా మామగారు 'సవర్ణుల' పిల్లలకు ఉపాధ్యాయుడుగా చాలా కాలం ఉన్నారు. తెలివైన పిల్లలను చూసి ఆనందంతో మురిసిపోయే వారేకాని ఈర్ష్యాభావం మచ్చుకైనా వారిలో కన్పించేది కాదు. ఉపాధ్యాయ, విద్యార్థి సంబంధం తండ్రీ కుమారుల బంధుత్వం లాంటిది. ఏవో కొన్ని సౌకర్యాలు హరిజన పిల్లలకు కలిగాయని, వాపోయి, ఆ పసి హృదయాలలో ద్వేషం కలిగే, పరుషపు మాటలు పలికే టీచర్ (ఏకులమైనా) ఉదాత్తమైన ఉపాధ్యాయ వృత్తికే కళంకం అని పంచాక్షరి గారికి నేను వేరే చెప్పాలా!

అనాటి నుంచి ఈర్ష్యనే సాధనంగా ఉపయోగించి నట్లయితే హరిజనుల స్థితి ఆర్థికంగా కొంత మెరుగ్గా ఉండేదేమో!

"రోడ్డు మీద కంకర రాళ్ళుంటే తెలివిగా ప్రక్కకు పారవేయడానికి బదులుగా, కసిగా కాలితో తంతే ఏమవుతుంది?" అని విమర్శించారు. కంకర రాయిని కసిగా తన్నడం కాదు, తెలివిగా ప్రక్కకు విసరడం గాదు, రోడ్డుకు బలమివ్వడానికి, ఆ కంకర రాళ్ళను పూడ్చి పెట్టాలి. అప్పుడు ఆ రాళ్ళతో హానికి బదులు మేలు జరుగుతుంది. కంకర రాళ్ళ లాంటి మూఢ నమ్మకాల్ని గోతిలో పూడ్చినవాడే నిజంగా

నిరక్షిత బాట పడేది. అలాగాక ఆ రాళ్లని ప్రక్కకు పారవేస్తే ఏనాటికైనా కాళ్లకు తగిలే ప్రమాదం ఉంటుంది.

నా వ్యాసాన్ని నాటు వైద్యంగా అపార్థం చేసుకున్నారు పంచాక్షరిగారు. కాని నేను సూచించింది "శస్త్ర చికిత్స' పై పూతలకు నయంగాని "కులపిశాచం" అనే "వ్రణాన్ని" ఆపరేషన్ చేసి అంతం చేయాలి గాని పంచాక్షరిగారు చెప్పినట్లు కాలానికి వదిలి పెట్టితే విషమ పరిణామాలకు నిజంగానే దారితీయవచ్చు.

తరతరాలు కలవారైన 'సవర్ణు'లు హరిజనులకు చేసిన అన్యాయానికి కొంత ప్రాయశ్చిత్తంగా యీ చాలీచాలని సౌకర్యాలు కల్పించారు. యీ సౌకర్యాలు యింకా అధికమైతేనే 'అవర్ణు'ల పరిస్థితి కాస్త మెరుగయ్యేది. అంతేగాని పై కులాలు హరిజనులు యీనాడనుభవిస్తున్న దుస్థితికి రావడం జరుగదు. చరిత్రగతి చూస్తూవుంటే సోదరి పంచాక్షరిగారు పాఠకులకు చూపిన సమస్య ఎప్పటికి తల యెత్తదని, విదిత మవుతుంది. ఒక వేళ ఆ సమస్య తల యెత్తినా అనాదిగా హరిజనులను పెట్టిన హింసలకు ప్రాయశ్చిత్తంగానే భావించాలి. తప్పు తెలిసి చేసినా తెలియక చేసినా భగవంతుని శిక్ష తప్పదు. అనాడైనా పంచాక్షరిలాంటి వారికి హరిజనుల బాధ అర్థమైతే సంతోషించాల్సిందే.

పొదుపు, సౌజన్యం, నిగ్రహం, వివేకం మొదలుగాగల వాటితోనే, హరిజనులు గత వేలాది సంవత్సరాలుగా మెలిగారు. అయితే అగ్రకులాభిమానులు దాన్ని పంచముల చేతగానితనంగా పరిగణించి, సాంఘికంగాను, ఆర్థికంగాను, వారికి తీరని అన్యాయాన్ని చేశారు. యింకా ఆ "తెర" సహాయంతోనే అన్యాయాలను హరిజనుల నెత్తి మీద రుద్దాలని పంచాక్షరి లాంటి వారి ప్రయత్నాలు కొనసాగుతూనేవున్నాయి. ఇట్టి అన్యాయపు వ్యవస్థను "రిఫార్మ్" చేయడానికి "కడుపు మంట"లే కాదు, సాంఘిక బడబాగ్ని కూడా చాలదేమో!

"నేను వ్రాసిన వ్యాసం లాంటి వ్యాసాలు విపరీత పరిణామాలకు దారి తీయవచ్చు" అని విమర్శించారు. అంటే "మేము కోతి బాగా కొమ్మెక్కి కూర్చుంటాం. క్రిందికి మాత్రం దిగం. మీరు మాత్రం అది కోతి, దాని మెదడు చిన్నది, చంచల స్వభావి, దాని బుద్ధి మారదు. మీ దారిన మీరు వెళ్లండి, దానికి బుద్ధి పుటరిన

వనితాలోకం

రోజే క్రిందకు దిగుతుంది'' అన్నట్లు వుంది. (వారు చెప్పేకాలం తీసుకొచ్చేవార్పు.)

మాకు బాధలు భావాలు వున్నాయి. వాటిని ప్రకటించే స్వాతంత్ర్యం కూడా వుందనే విషయాన్ని పంచాక్షరిగారు అర్థం చేసికొని వుంటే బాగుండేది.


హరిజనులు పైకి రాకుండా, అడుగడుగునా అవాంతరాలు కలగ జేస్తూనే, హరిజనులు ''ఆహారా విషయాలలో, విద్య, ధన, రూప, సంస్కృతీ, సంస్కారాలలో పైకి వస్తేనే మేము మిమ్మల్ని సమానంగా చూస్తాం. యీ భేదాలు కానవు'' అని అనడం హాస్యాస్పదంగావుంది.

ఇక భాష నాయిష్టం వచ్చినట్లు వాడానని సోదరి పంచాక్షరిగారి విమర్శ. కనీసం 'భాష', అయినా మా యిష్టం వచ్చినట్లు వాడేందుకు మాకు హక్కు? అధికారాలు, వున్నవి, అవి ఎవ్వరి స్వంతం కాదని తెలుసుకోవాలి.

తోటి మానవుల బాధను అర్థం చేసికోకుండా విషయం దొరికిందని విమర్శకు దిగిన పంచాక్షరి లాంటి కులాభిమానులు వున్నంత వరకు భారత జాతిలో సమైక్యత ఏర్పడదు.

దక్షిణాఫ్రికాలో గాంధీజీ ఒకనాడు ''ట్రెయిన్''లో తెల్లజాతి వారికి కేటాయించబడిన ''కంపార్టుమెంటు''లో ఎక్కారట. అప్పటికే అందులో వున్న తెల్లవారు బాపూజీని అడ్డగించి, బలవంతంగా బయటికి త్రోయగా, బాపూజీ క్రింద పడ్డారట. కొన్ని దెబ్బలు తగిలి రక్తం కారిందట. ఆ రక్తాన్ని చూచుకొని బాపూజీ ''యిది యీ తెల్లవారి తప్పు ఎంత మాత్రం కాదు. తరతరాలుగా భారత దేశంలో వున్న పంచములను మేము సవర్ణులు పెట్టిన హింసకు ప్రతిఫలంగా యిది జరిగింది'' అని ఆత్మజ్ఞానంతో భావించారు మహాత్ములు. ఇది చాలా ఉత్తేజమైన ఆత్మవిమర్శ. యిందులో సహస్రాంశమైనా యిప్పటి సవర్ణులలో మెలిగితే నేను వివరించిన బాధలు హరిజనులకు వుండేవికావు. ●





అంతర్ముఖుడు

సింగరాజు లింగమూర్తి

జగన్నాథం ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త పత్రికల్లో చూసి నేనేకాదు అతన్నెరిగిన వారందరూ ఆశ్చర్యపోయారు.

జగన్నాథానికి పరిచయస్తులు ఎందరో ఉన్నారు. స్నేహితులు, అత్యంత సన్నిహితులు అయినవాళ్ళు కూడా చాలామంది ఉన్నారు.

అంతస్తుల అంతరాలు బాగా తెలిసినవాడు జగన్నాథం. అన్ని అంతస్తుల వారితోనూ, విభిన్న ప్రవత్తులు గలవారితోనూ సౌమ్యంగా మెలగగల అతని మనస్తత్వం అపూర్వంగా, చిత్రంగా తోస్తుంది.

చిరునవ్వుతో స్నేహంగా పలుకరించడం, అదే చిరునవ్వుతో ఎంతో సామరస్యంగా సమాధానాలివ్వడం అతనిలోని ప్రత్యేకత.

జగన్నాథాన్ని తెలియనివారు చాలా అరుదుగా ఉంటారు. పట్నంలో అతని సహాయం కోరని వారుండరు. అతని సభ్యత్వం లేని సంస్థలేదు. ఎన్నిటిలోనో గౌరవ పదవులను అలంకరించాడు. కొన్ని సంస్థలకు సలహాదారు. రాజకీయాలలోకి ప్రత్యక్షంగా దిగలేదన్న మాటేగాని పరోక్షంగా ఎంతో పలుకుబడి ఉన్నవాడు. పెద్ద పెద్ద నాయకులు (మంత్రులు కూడానని చెప్పుకొంటారు) జగన్నాథం సహకారం, సలహా అపేక్షించడం, వాళ్ళందరూ కలిసి సరదాగా చతుర్ముఖ పారాయణం జరపడం ఆనోటా ఆనోటా విన్న సంగతులు. అన్నిటికీ మించి మంచి వ్యవహార దక్షత, వ్యాపార దక్షత కలవాడు జగన్నాథం.

కిట్టనివాళ్ళు కొందరు జగన్నాథాన్ని బూర్జువా అన్నారుగాని అతని ప్రవర్తన చూసిన వాళ్ళెవరూ అతనితో పరిచయంలోకి వచ్చిన వాళ్ళెవరూ అతనిమీద అంత అభాండం వెయ్యడానికి పూనుకోరు. నా మటుకు నాకు అతను ఒక గొప్ప చతురుడైన రాజకీయవేత్త అనిపిస్తాడు. అయితే నీకు జగన్నాథం బాగా తెలుసా అంటే, 'అతనూ నేనూ ఓః బూజంఫ్రండ్స్' మనిగాని అతను నన్నెంతో అభిమానంగా చూసేవాడని గాని నేను చెప్పినప్పుడు మీరు నమ్మాల్సేవస్తుంది. పైగా 'ఏమిత్రా కోస్తున్నావ్' అని చచ్చినవాడు లేచివచ్చి అడుగడు కదా! ఇలా ఇంత గొప్పవాడితో నాకు పరిచయం ఉందని—ఇప్పుడు అతను చనిపోయినాక—చెప్పుకోడంవల్ల నాకు ఒరిగేది ఏమీ లేదు కాబట్టేన్ని, పైగా డబ్బాలు కొట్టే ఆత్మవంచన చేసుకునే మనిషి కాదురా అని మీరంతా నాకు కాతాలు ఇవ్వకపోరు కాబట్టీన్నీ నిజం చెప్పేస్తున్నా—జగన్నాథంతో నాకేం పరిచయంలేదు. అయితే మా సంఘం పని మీద కార్యదర్శితో కలిసి రెండుమూడుసార్లు జగన్నాథం దగ్గరకు వెళ్ళాను. నేను ప్రత్యేకించి అతనితో ఏమీ మాట్లాడకపోయినా మాటల మధ్యలో జగన్నాథం నావైపు చిరునవ్వుతో చూడడం, నేను ఆయన చెప్పేది వింటూ మందహాసం చిందించడం సహజంగానే జరిగిపోయింది. కాకపోతే ఒకసారి మాత్రం ఈమధ్య కొత్త పుస్తకాలేమైనా రాశారా?'' అని జగన్నాథం అడగడం నేను సమాధానం చెప్పడం జరిగింది. అంతే. అంతకుమించి మా పరిచయం పెరగలేదు. అమాత్రం పరిచయం ఏర్పడితే చాలు దాన్ని పెంచుకొని, జగన్నాథానికున్న బోలెడు పలుకుబడితో తమ తమ పనులు సాధించుకున్న సామాన్యులు

ఉన్నారు. కవులూ కళాకారులు ఉన్నారు. అయితే నీకున్న స్వల్పపరిచయంతోనే జగన్నాథాన్ని గొప్ప చతురుడైన రాజకీయనేతగా ఎలా నిర్ణయించావు అని అడిగితే దాని కథ కమామిషు చెప్పక తప్పదు.

చెప్పాను కదూ జగన్నాథానికి వ్యవహార దక్షత, వ్యాపారదక్షత ఉన్నాయని. అతనికి పట్టణంలో నాలుగైదు వ్యాపారసంస్థలున్నాయి. వాటిల్లో హోల్‌సేల్ వ్యాపారం కూడా ఒకటి. అతని దగ్గర గుమాస్తా ఉద్యోగాలు చేసేవారుగాని, కాయకష్టం చేసుకొనేవారుగాని జగన్నాథాన్ని దైవంగా భావిస్తారు. 'నీకెంత జీతం కావాలి' అని అడిగి చెప్పించుకొని యింకో పది ఎక్కువే యిచ్చేవాడు. వాళ్లకే అవసరాలు వచ్చినా ఆదుకునేవాడు. ఈ మంచితనాన్ని ఉపయోగించుకొని ఎవరైనా జగన్నాథాన్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తే "పిచ్చివాడ, దీనివల్ల నష్టపడేది నీవుకాని నేను కాదు—ఈసారి వదిలేస్తున్నా''అని ఔదార్యం కూడా చూపించేవాడు. రెండోసారి అలాగే చేస్తే ఉద్యోగంలోంచి తొలగిస్తాడు. మరో చోటుకుపోయి, తన పూర్వానుభవం చెప్పుకొని వాడు ఉద్యోగం అడిగితే "అక్కడే ఇమడని వాడివి మాదగ్గరేం చేస్తావు'' అని పొమ్మనేవారు. వాడు మళ్లీ వచ్చి జగన్నాథం కాళ్ల మీద పడాల్సిందే. అంత మంచివాడు జగన్నాథం....

ఏ సరుకు ఎలా నిలవచేయాలో, ఏ సరుకును ఎప్పుడు ఎలా విడుదల చేయాలో జగన్నాథానికి తెలుసు. ధరలు పెరిగినప్పుడు దానికి అంతర్జాతీయ కారణం ఏమిటో, గిట్టుబాటు ధర అంటే ఈనాడు ఎలా ఉండాలో ఇట్టే చెప్పగలడు. ఈనాడు ప్రతివస్తువు ధర ఆకాశాన్ని అందుకుంటున్నదంటే జగన్నాథం విడమరచి అరటిపండు ఒలిచి చేత ఉంచినంతగా చెప్తాడు.

జగన్నాథం ఏనాడో చౌకలో స్థలాలు కొన్నాడు. కొన్ని భవనాలు కట్టించాడు. అవసరం వచ్చినప్పుడు మంచి ధర పలికితే అమ్మాడు. కారు అమ్మడం, మరో కొత్త మోడల్ కొనడంకూడా అదొక సరదాగా ఉంటుందతనికి.

అసలు జగన్నాథానికి యిన్ని వ్యాపత్తులున్న సంగతి చాలా మందికి తెలియదు. ఎప్పుడూ ప్రజాసంస్థల్లో, ప్రజాకార్యాల్లో నిమగ్నుడై ఉన్నట్టుగానే కనిపిస్తాడు.

ఈ ప్రజాసంస్థల్లోమటుకు ఎగిరెగిరి పడుతున్నట్టు కనిపించేవాడా? ఊహూఁ. మామూలు కార్యకర్త ఏమోలే అనుకునేట్టుగా ఉంటాడు. తనకేమీ కీర్తికాంక్ష లేదన్నట్టుగా, వ్యక్తిత్వానికి ప్రచారం సాధనం కాదన్నట్టుగా మెలుగుతాడు. 'డబ్బున్నవాడిదే రాజ్యం' అన్నట్టుగా కూడా ప్రవర్తించడు జగన్నాథం. "ఏదో—సంస్థ బాగుపడాలి—నలుగురికి ఉపయోగపడేదిగా ఉండాలి'' అంటాడు. "నా కెందుకండీ ఈ అధ్యక్షపదవి—ఏదో మీరు కోరిన విరాళం యిచ్చాను'' అని ఎంతో నమ్రతగా అంటాడు. "సరే మీరింత బలవంతం చేస్తుంటే కాదనలేకపోతున్నాను'' అంటూ ఆ పదవిని మొగమోటమికి లొంగిపోయి స్వీకరించేవాడు.

తనకేమీ పట్టనట్టుగా ఉంటూనే అంతా తానై మెలిగే జగన్నాథం వ్యక్తిత్వం చాలా సక్రుత్తుగా ఎదురవుతుంది.

క్రిందటిసారి జనరల్ ఎలక్షన్లు వచ్చినప్పుడు సన్నిహితులనుకుంటున్న మిత్రులు జగన్నాథాన్ని నామినేషన్ పడేయమన్నారు. "మీరు గెలవడం ఖాయం. మంత్రి కావడం అంతకంటే ఖాయం'' అన్నారు. "ఆ సంగతి ఈ జగన్నాథానికి తెలియకనా'' అని మనసులో అనుకొని ముసిముసిగా నవ్వుతూ, "ఆ బాదరాబందీ నా కెందుకయ్యా—మీరంతా ఉన్నారుగా'' అనేశాడు. తానుగా నిలబడకపోయినా, తన అభ్యర్థిని ఎన్నికల్లో నిలబెట్టడం, గెలిపించడం, అంతటితో వూరుకోక మంత్రిగా ఎంపిక చేయించడం జగన్నాథం పలుకుబడికి, చతురతకు ఒక నిదర్శనం. ముఠా తత్వాలు ఏర్పడి, అవి తీవ్రమైనప్పుడు ఉభయులకు సయోధ్య ఏర్పరచి ఇరుపక్షాలచేత 'భేష్' అనిపించుకొని వాళ్ళ ఖుషీనిబట్టి కొన్ని ప్రయోజనాలు పొందాడూ అంటే అది జగన్నాథం స్వార్థమని అనుకుంటే ఎలా?

ప్రతివ్యక్తిలోనూ మంచీ—చెడూ రెండూ ఉంటాయి. రెండు దృక్కోణాలలోంచి మనిషిని చూడాలి. చెడ్డవాడికి ప్రపంచంలో ఉన్న దుర్గుణాలన్నీ ఆపాదించడం, మంచివాడికి ప్రపంచంలోని సద్గుణాలన్నీ అంటగట్టడం వెర్రితనం. ఈ రకంగా చూస్తే జగన్నాథాన్ని ఒక క్రొత్తరకం 'విలన్'గా నేను దర్శించాను.

జగన్నాథంలో పాపభీతి ఉంది. దైవభక్తి ఉంది. ఎన్ని అర్జంటు పనులున్నా, ఎంత ప్రముఖ వ్యక్తి జగన్నాథం కోసం వచ్చినా ఉదయం ఎనిమిది గంటల తర్వాతనే గాని ఈలోగా కలవడం సాధ్యంకాదు. విభూతిరేఖలమధ్య అర్ధచంద్రాకారంగా దిద్దిన గంధం, దానిమీద కుంకుమబొట్టు, దండలకు, వక్షస్థలానికి రాసుకున్న విభూతిపట్లు, పట్టుతాపితా కట్టుకొని పూజాగృహంలోంచివచ్చే జగన్నాథాన్నిచూస్తే అల్ట్రా మోడరన్‌లలోకూడా ఏదో భక్తిభావం కలిగే జగన్నాథంమీద యింకాస్త గౌరవాన్ని పెంచుతుంది.

జగన్నాథం ధైర్యాన్ని చిరునవ్వుతో వేడుకుంటాడు. చిరునవ్వుతో అప్తులం అనుకుంటున్నవారిని పలుకరిస్తాడు. ఆ చిరునవ్వుతోనే బాధల్లో ఉన్నవారిని, తనను ఆశ్రయించుకున్నవారిని పరామర్శిస్తాడు. గోదాముల్లో నిక్కి నిక్కిచూస్తున్న వస్తుసంచారాలను చిరునవ్వుతో తిలకిస్తాడు. ఇటు బ్యాంక్ అకౌంటును, అటు ఇనుపపెట్టెలోని కరెన్సీని, బంగారాన్ని ఆప్యాయంగా చిరునవ్వుతో చూసి కనులకద్దుకుంటాడు. ఎక్కడైనా కాటకం వచ్చి ప్రజల ఆకలి చావులు ఎక్కువైనాయని అంటే చిరునవ్వుతో విరాళాలు యిస్తాడు. ఆ ప్రాంతానికివెళ్లి ఉచితంగా తినుబండారాలు, బట్టలూ సరఫరా చేయిస్తాడు. అతని ఔదార్యాన్ని ప్రశంసిస్తూ పత్రికల్లో ఫోటోలతో సహితంగా ప్రచురిస్తే "దైవం నా కిచ్చినదాంట్లోంచి సహాయం చేస్తున్నా దీనికీ ఆడంబరమంతా దేనికి'' అంటాడు చిరునవ్వుతో. ఇటీవల దేశరక్షణకు భూరి విరాళం, బంగారం పెద్ద మొత్తంలో ఇచ్చిన ప్రముఖుల్లో జగన్నాథం ప్రథముడు.

ఇకపోతే పైకిపొక్కని వ్యవహారాలు జగన్నాథానికి సంబంధించినవి చాలామందికి తెలియవు అంటారు. అవి అవలక్షణాలని కొందరికి అనిపించినా జగన్నాథం ఒప్పుకోడు. "ప్రతివారికీ కొన్ని అభిరుచులుంటాయిగా'' అంటాడు నవ్వుతూ.

పెద్ద పెద్ద వాళ్ళంతా కూర్చుని పేకాటవేస్తే వేళతో సంబంధం ఉండేది కాదు. వాళ్ల ఆట వందలూ వేల మీదే గాని పదులూ—అయిదులూమీద ఉండేది కాదు. ఒక్కోసారి జగన్నాథమే కొందరికి ఆటకి పెట్టుబడి పెట్టేవాడు. కొన్ని సందర్భాల్లో బాకీపడిన మొత్తానికి అతనికి నోట్లు రాసిచ్చినవాళ్లూ ఉన్నారు. జగన్నాథానికి ఆటలో పోవడంకంటె రావడమే ఎక్కువగా ఉండేది. పెద్ద పెద్దలంతా తెల్లి

వారులా పేకాట ఆడుతున్నప్పుడు టేబిల్ టెన్నిస్ కీ, సీసాలకీ గిరాకీ లేకుండా ఎలా ఉంటుంది. అదేం చిత్రమోగాని ఎంత తాగితే అంత సౌమ్యంగా, అంత హుందాగా, పొల్లుమాట లేకుండా ఆడేవాడు జగన్నాథం. "ఏదో కంపెనీకోసం తాగుతాగాని అదంటే అసలు ఇష్టంలేదు" అంటాడు. అదీ నిజమే ననిపిస్తుంది. పేకాటలో కూర్చున్నప్పుడు, పార్టీలకు వెళ్ళినప్పుడు తప్ప మరెప్పుడూ సీసాను దగ్గరకు రానివ్వడంటారు అంత రంగికులు. 'సౌఖ్యం' కావాలని వెరపెరలాడే వారికి డబ్బున్నా అనుభవించడం చేతకాదు కొందరికి. ఎంత రేటుకైనా ఆ 'సౌఖ్యం' కొనుక్కొని అనుభవించడం జగన్నాథానికి తెలుసంటారు కూడా. పెద్దవాళ్ళ వ్యవహారాలు గోప్యంగా ఉంటాయి కాబట్టి సామాన్యులకు అందుబాట్లోవు. అసలు తెలియవు కూడా. పట్టణంలోకి ఏ సందర్భంలోనైనా అందమైన కళాకారిణులువస్తే జగన్నాథానికి పరిచయంగా కాకుండాపోయేవారుకారుట. అలా గని జగన్నాథం ఏ పచ్చని సంసారాన్ని పాడుచేయలేదనీ, ఏ స్త్రీని నిర్బంధించ లేదనీ కూడా వాళ్ళే అంటారు.

జగన్నాథాన్ని గురించి ఎవరికీ అంతు పట్టని విషయాలు రెండున్నాయి. అతను గృహస్థో, బ్రహ్మచారో, విధురుడో తెలియదు. అతను నివసించే మేడలో ఆడవాళ్ళు, మగవాళ్ళూ కనిపిస్తూనే ఉంటారు. వాళ్ళకీ జగన్నాథానికీ ఉన్న బంధుత్వమేమిటో కూడా ఎవరికీ తెలియదు. అసలు అతను ఆమేడలో ఉండే సమయమే చాలా తక్కువ. ఉన్నప్పుడు వయస్సునుబట్టి ఆ మేడలోవాళ్ళు బాబాయనో, మామయ్యనో, అన్నయ్యనో అతన్ని ఏవేవో వరుసలుపెట్టి పలుకరిస్తుండడం చూడ వెళ్ళినవారికి తెలుసు.

జగన్నాథం దినచర్యలో పగలు పన్నెండు, ఒంటి గంటలమధ్య, రాత్రి మళ్ళీ అదే టైంలో అతను ఎక్కడ ఉంటాడో, ఏం చేస్తాడో కూడా సన్నిహితులు, ఆంత రంగికులు అనుకుంటున్నవారికి కూడా తెలియదు. ఆ రెండుగంటలసేపు జగన్నాథం ఎక్కడ ఉంటాడో తెలుసుకుందామని అతని డ్రైవర్ని కూపీ తీశారు. ఆ సమయాలలో కారును ఆయనే డ్రైవ్ చేసుకు పోతాడట.

అసలు జగన్నాథం ఆ పట్టణం వాడు అవునా—కాదా, అతని జన్మస్థలం ఏమిటి, ఏం చదువుకున్నాడు అన్న వివరాలు పర్కిత కందని అంశాల వంటివి.

ఇంతవరకూ వ్రాశాక మీరు వేయబోయే ప్రశ్నలు నేనే వేసుకున్నాను. సమాధానాలకోసం ఆలోచిస్తున్నా. మెదడు వేడెక్కిపోయింది. కుర్చీలో జారగిలబడి కళ్ళు మూసుకున్నా. క్షణాలూ, నిమిషాలు గడిచిపోతున్నాయి.

మసక మసకగా ఏదో రూపం మసిలింది. క్రమంగా ఆ రూపం స్పష్టంగా దగ్గరగా వచ్చింది. ఎత్తుగా పెరిగి సంస్కారంలేక ముఖం మీద పడుతున్న క్రాపు, చిరుగుల నిక్కరు, రంగు వెలసిపోయి ఒక చెయ్యి వాలికలైన చొక్కాలో వో ఎనిమిదేళ్ళ కుర్రాడు క్రిందకు జారిపోతున్న నిక్కరును పైకి ఎగదోసుకుంటూ వో పెద్ద హోటలు ముందు నిలబడ్డాడు. ముఖంలో దైన్యం, కళ్ళల్లో ప్రౌఢియత హోటలు యజమానిని కదిలించాయేమో, "ఎవరికే తిం డెవరు పెడతార్రా—మా హోటల్లో పనికి కుదురు" అన్నాడు.

"చేరుతా బాబూ! ఏం పని చేయమంటారు" వినయంగా అన్నాడు కుర్రాడు.

"నీ వయసుకు తగిన పనులే కప్పులు, ప్లేట్లు కడగడం, బల్లలు తుడవడం..."

"అట్లాగే చేస్తానండి......"

"నీ పేరేమిటి?"

"జగ్గు—మా నాయనా, అమ్మా అట్లానే పిలిచేవారండి........"

"ఊ. సరేపద లోపలికి" అన్నాడు యజమాని.

మూడురోజుల తర్వాత జగ్గు ఆరోజు కడుపునిండా భోజనం చేశాడు. ఆ మరునాడే జగ్గును నీటుగా తయారు చేయించాడు హోటలు యజమాని. క్రాప్ చేయించి డ్రెస్ కుట్టించాడు.

జగ్గుకు వేరే యిల్లు లేదు కాబట్టి హోటల్లోనే ఓ మూల పడుకొనేవాడు.


జగ్గు చేరిన వేళావిశేషమేమో, యజమాని అదృష్టం కలిసివచ్చి, ఆ యేడు హోటలు మీద బాగా లాభాలు తీశాడు వాయర్. హోటల్లో మరిన్ని వసతి సౌకర్యాలు అవీ ఏర్పాటు చేశాడు. జగ్గుకు జీతం పెరిగింది. వారానికి ఒకరోజు సెలవుండేది. ఆరోజు ఊరంతా తిరిగేవాడు. సినిమాలు చూసేవాడు. ఆ రోజుల్లోనే అర్ధరూపాయి పెట్టి ఫొటో తీయించుకొని, దానికి ఫ్రేము కట్టించి ఎంతో జాగ్రత్తగా పెట్టుకున్నాడు. ఎప్పుడైనా వెడితే హోటల్లో పప్పు రుబ్బే సీనయ్య యింటికి వెళ్ళేవాడు జగ్గు. సీనయ్యకు లక్ష్మి అనే కూతురు జగ్గు ఈడుదే ఉంది. కొద్ది రోజుల్లోనే వాళ్ళిద్దరికీ స్నేహం కలిసింది. సెలవురోజు వస్తే సీనయ్య ఇంటికి వెళ్ళి లక్ష్మితో ఆడుకునేవాడు. లక్ష్మి తల్లి రత్నాలు కూడా జగ్గును ఆపేక్షగా చూసేది.

"నీకు అమ్మా నాన్నా లేరా" అని ఓసారి లక్ష్మి అడిగితే బావురుమని ఏడ్చాడు జగ్గు. "వాళ్ళు బతికుంటే నేను పట్నమెందుకొస్తా—నాకు ఈ హోటలు పనెందుకు" అన్నాడు. ఆ రోజంతా జగ్గుకు తల్లిదండ్రులే జ్ఞాపకం వచ్చారు. వాళ్ళ దుర్మరణం గూర్చి ఊళ్ళో వాళ్ళు అనుకున్న మాటలే స్ఫురణకు వచ్చాయి.

జగ్గు తండ్రి ఓ భూస్వామి దగ్గర పాలేరుగా ఉండేవాడు. ఓ రోజు జగ్గు తల్లి పొలంలో ఉన్న భర్తకి అన్నం తీసుకువెళ్ళింది. పొలంలో భర్తకు బదులు భూస్వామే అక్కడ ఉండడం చూసి కొంత బెదిరింది. "నీ మొగుణ్ణి పక్క ఊరికి పనిమీద పంపించాను సీతాలూ—వస్తూనే ఉండాలి కూచో" ఓరగా చూస్తూ అన్నాడు కామందు. సీతాలు అందంగా యవ్వనంలో పెటపెట లాడుతుండేది. ఎన్నాళ్ళ నుంచి సీతాలు మీద కన్నువేసి ఉంచాడో కామందు, ఒంటరిగా పొలంలో తారసిల్లేప్పటికి కోతికి కొబ్బరికాయ దొరికినట్లయింది. సీతాలును పాకలోకి దింపి, ఒంటి మీద చెయ్యివేసి దగ్గరకు లాక్కున్నాడు. సీతాలు పెనుగులాడింది. కామందు ఆమెను నిర్బంధిస్తున్నాడు. పట్టు విడిపించుకొని పారిపోతున్న సీతాలును కామందు ఓ డొంకలో చిక్కించుకున్నాడు. సీతాలుకు అప్పటికే శక్తి సన్నగిల్లిపోయి రొప్పుతున్నది. రొమ్ములు పైకి కిందికి కదులుతున్నాయి. తప్పించుకుంటానికి ఆఖరు ప్రయత్నం చేస్తున్న సీతాలుకు కాలు అడ్డం పెట్టేప్పటికి పడిపోయింది. తన పశువాంఛ తీర్చుకొని పైకి లేచాడు కామందు. గర్వంగా సీతాలు ముఖంలోకి చూశాడు. ఆమె కదల్లేదు, మెదల్లేదు. ఇటు అటు కుదిపాడు. ఆమెలో చలనంలేదు. శాశ్వతంగా కళ్ళు మూసింది సీతాలు. కామందు



DO NOT ACCEPT IF THIS BAND
BRYLCREEM
THE PERFECT HAIRDRESSING





కంగారుపడ్డాడు. ఆ కంగారుతో కూడా కర్తవ్యం స్ఫురించింది. "వాడు మొండి వాడు. ప్రాణాలు కూడా తీస్తాడు... ఊరి పొలిమేరలకు వాడు రాకముందే వాడి పని పట్టించాలి" అనుకున్నాడు, పలుకుబడి, హంగు, డబ్బు ఉన్న ఆ కామందు.

ఊళ్లోవాళ్లు చెప్పుకున్న ఈ కథనం జగ్గు పసి హృదయానికి అర్థమైనంత అర్థమైంది. కానిది కాలేదు. వలవల ఏడ్చాడు. ఊళ్లోవాళ్లు దయతలచి పిలిచి నాలుగు మెతుకులు పెడితే తినేవాడు. లేక పోతేలేదు. మూడురోజులు గడిచాయి. ఇక ఆ ఊళ్లో ఉండ బుద్ధి కాలేదు జగ్గుకు.

"రోజులు గడుస్తున్నాయి. లక్ష్మి అంటే జగ్గుకు ప్రాణంలో ప్రాణమైంది. ఆ చిన్నవయస్సులోనే 'లక్ష్మి నాది' అనే భావం మనసులో ముద్ర వేసుకుంది. లక్ష్మి వద్దంటున్నా ఒకసారి ఫోటో కూడా తీయిం చాడు.

ఓ రోజు సీనయ్య పనిలోకి రాలేదు. ఏమో రాలేదు అనుకున్నాడు జగ్గు. ఆ మరు నాడూ రాలేదు సీనయ్య. డ్యూటీ అయ్యాక వెళ్లి కనుక్కోవాలనుకున్నాడు జగ్గు. రాత్రి ఎనిమిది గంటలప్పుడు రత్నాలు నాయర్ కోసం వచ్చింది. నాయర్ అంతకుముందే రత్నాలు రావడం గమనించాడేమో పైకి తన గదిలోకి వెళ్లిపోయాడు. యజమాని పైన ఉన్నాడు వెళ్లమన్నారు నౌకర్లు. రత్నాలు నాయర్ గది ముందుకు వెళ్లి నిలబడి "ఆయనకు, పిల్లకి జ్వరాలు వస్తున్నాయయ్యా. డాక్టర్ దగ్గరకు తీసుకు పోడానికి డబ్బు కావాలి. ఆయన జీతం లోంచి పది రూపాయలు అడ్వాన్సు యిప్పించండి" అంది.

"అయ్యో అలాగా పాపం, రా లోపలికి" అని గదిలోంచే అన్నాడు నాయర్. రత్నాలు అమాయకంగా లోపలకు వెళ్లేప్పటికి, నాయర్ తలుపు గడియ వేసి రత్నాలు చెయ్యి పట్టుకున్నాడు.

"ఏందిది—వదలండయ్యా!" అని పెనుగు లాడుతున్నది రత్నాలు. ఆమె పెనుగులాట నాయర్‌కు కవ్వింపై ఆమెను నిర్బంధిస్తు న్నాడు. రత్నాలు రావడం, పైకి యజ మాని గదికి వెళ్లడం చూసిన జగ్గు "ఈమె ఇంకా రాలేదేమా" అనుకుంటూ పైకి వెళ్లాడు. గదిలోంచి రత్నాలు కేకలు విని

పించి తలుపులు బాదాడు జగ్గు. ఏదో కొంప మునిగిందనుకొని తలుపు తెరిచాడు నాయర్. ఒక్క ఉదుటన బైటకు వచ్చింది రత్నాలు బెదరిన లేడిలా. ఆమె తలంతా రేగి ఉండడం, రవిక చిరిగి ఉండడం చూసిన జగ్గులో ఆవేశం పెల్లుబికింది.

"నీ కిక్కడేం పనుందని వచ్చావురా రాస్కెల్" అని గద్దించాడు నాయర్.

ఏమి చెప్పాలో, ఏం చెయ్యాలో తెలియని వయస్సు కావడం వల్ల తగిన సమాధానం చెప్పలేక సమయస్ఫూర్తిగా "మిమ్మల్ని కిందకు పిలుస్తున్నారు సార్!" అన్నాడు. కొరకొర చూస్తూ వెళ్లిపోయాడు నాయర్. "దేవుడిలా నీవు వచ్చావు కాని జగ్గూ లేక పోతే నాగతేమయ్యేదో!" అని కన్నీళ్లు పెట్టుకొని వెళ్లిపోయింది రత్నాలు.

ఆమరునాడు జగ్గు తాను మిగుల్చు కున్న డబ్బులోంచి పదిరూపాయలు తీసు కొని సీనయ్య ఇంటికి వెళ్లాడు. రత్నా లుకు జరిగిన పరాభవం, తల్లి దుర్మరణా నికి కారణం జగ్గు పసిహృదయంపై ముద్రవేసుకున్నాయి. అప్పటినుంచి డబ్బున్న వాళ్లంటే ఎంతో అసహ్యం, ఏదో పగ సాధించాలన్న తపన అతనిలో బయలు దేరింది. అతనికి ఏర్పడిన భావానికి దోహ దం కలిగించేట్టుగా హోటల్లో బసచేసే వారి ప్రవర్తన, వాళ్ల కబంధహస్తాల్లో డబ్బుకోసం నలిగి పోతున్న అబలల పరి స్థితి చూచాయగా అర్థమయ్యేవి.

సీనయ్యకు జ్వరం తగ్గింది కాని లక్ష్మికి తగ్గలేదు. మశూచికింద తేలి కన్నుమూసే ప్పటికి జగ్గు మనస్సు విలవిలలాడి పోయింది. "అయ్యో—లక్ష్మి"అని ఏడ్చాడు. ఇంక ఆ ఊళ్లో ఉండలేక ఎటో బయలు దేరాడు.

పన్నెండేళ్లకాలం మింగేసింది. జగ్గు దేశంలో తిరిగి తిరిగి పట్నం చేరుకు న్నాడు. ప్రపంచంలో బ్రతుకు ఎలా ఉంటుందో తెలుసుకున్నాడు. ధనికులమీద పగతీర్చుకోడానికి తానూ ఆ స్థాయికి పెరగా లనుకున్నాడు. అతను పట్నం చేరేప్పటికి ఇరవై రెండేళ్ల వయస్సు. తాను కూడ పెట్టిన డబ్బుతో ఒక కిళ్లీదుకాణం పెట్టాడు. జగ్గుకు అదృష్టం కలిసి వచ్చింది. పదేళ్లలో జగ్గు పెద్దవ్యాపా రస్థుడై పోయాడు. అతను ఏ వ్యాపారం ప్రారంభించినా ఎంతో లాభ సాటిగా ఉంటున్నది. జగ్గు జగన్నాథమై నాడు.

అంతర్ముఖుడు

'జగన్నాథం జీవితంలో ఎంతమార్పు వచ్చినా ఎంత ఉన్నత స్థాయికి పెరిగినా అతని అంతరంగంలో నిలిచి పోయిన లక్ష్మి మాత్రం ' చెరగి పోలేదు.

అతని దినచర్యలో పగలు ఒకగంట, రాత్రి ఒకగంట లక్ష్మి జ్ఞాపకాలతో, తన బాల్యదశ, ఒక ప్రసిద్ధ వ్యక్తిగా పెరిగిన విధానం జ్ఞాపకం చేసుకోడంలో గడిపి వేస్తాడు.

పట్టణానికి ఆరు మైళ్ళ దూరంలో ఉన్న చిన్న పల్లెలో ఒక భవంతి కొన్నాడు. ఆ భవంతిలో ఒక గది తనకు కేటాయించు కొని మిగతాది ఎవరికో అద్దెకు యిచ్చాడు. వాళ్ళు ఎప్పుడైనా అద్దె ఇంతని యిస్తే పుచ్చుకునేవాడు. లేకపోతే ఎప్పుడూ అడిగేవాడు కాదు.

ఆ గదిలో ఒక మూల చిరుచాప, చిన్నప్పుడు అర్ధ రూపాయికి తీయించుకున్న జగ్గుఫోటో, ఆ ప్రక్కనే లక్ష్మిఫోటో, వాటికి ఎదుటి గోడమీద జగన్నాథంగా తీయించుకున్న ఫోటో తగిలించి ఉంటాయి.

"లక్ష్మి బ్రతికి ఉంటే యించు మించు నా వయస్సులోనే ఉండేది. ఎంత అందంగా ఉండేదో. లక్ష్మి ఏ లోకంలో ఉన్నా నాదే!... ఎప్పుడూ నాదే'' అనుకునేవాడు.

"చిన్నప్పటి నా ఫోటోకి ఇప్పటి ఫోటోకి ఎంత మార్పు ఉంది? చిన్నతనంలో ముఖంలో ఉన్న నిర్మలత్వం ఈ ఫోటోలో లేదేం,..... ఎందుకుంటుంది? జగ్గు పాపం— పుణ్యం తెలియని పసివాడు. ఈర్ష్య—, అసూయలు, మద మాత్సర్యాలు లేని వినిర్మలమైన బాల్యదశ అది. ఇప్పటి జగన్నాథం చాలా చిత్రమైన వాడు. ఏ మహానటుడూ చేయలేని నటన నాది. ఈ జగన్నాథం జూదరి, త్రాగుబోతు, వ్యభిచారి, మోసగాడు. ఇవన్నీ పైకి కనిపించకుండా నటించే పెద్ద మనిషి ఈ జగన్నాథం'' అనుకొని తనను తాను అసహ్యించుకునేవాడు జగన్నాథం.

జగన్నాథం దిన చర్యలోని ఆ రెండు గంటలు విలువైనవి. అవి ఎవరికీ అంతుపట్టనివి. ఇంతకు మించిన పరమ రహస్యం మరేదీ లేదనికూడా ఎవరికీ తెలియదు.

రోజు రోజుకీ తన చర్యల మీద, బ్రతుకు మీద ఏవగింపు ఎక్కువై పోయింది జగన్నాథానికి. "నేను ధనవంతుడినై ఏం సాధించ దలచుకున్నానో అది సాధించ లేక పోయాను. ఆ పగ అలాగే ఉండిపోయింది. ఇక ఈ నటనకు స్వస్తి చెప్పాలి. నాబోటి రాబందులంతా ప్రజలను పీక్కు తినడం, ధనాగారాలను నింపి పాపం మూట కట్టుకోడం తప్ప ఏముంది! ఎవరి కోసం సంపాదించాను ఇదంతా? ఎవరి మెప్పుకోసం? ఎవరి మెహర్బానీ కోసం? ఊహుఁ— జగన్నాథం చచ్చిపోవాలి. ఎప్పటి జగ్గు అయిపోవాలి.'' అని నిశ్చయించుకున్నాడు. అంతే— మూడు రోజులు అంతర్ధానమై పోయాడు జగన్నాథం. నాల్గవ రోజు పత్రికలలో జగన్నాథం ఆత్మహత్య అని తాటికాయంత అక్షరాలలో ప్రకటించ బడింది.

* * *

"ఇదేమిటి యింకా కూర్చున్నారేం— ఏదో సభకు వెళ్ళాలన్నారుగా'' అంటున్న శ్రీమతి పలుకరింపుతో కళ్ళు తెరిచాను.

"ఏదో ఆలోచిస్తున్నా— జగన్నాథం సంతాప సభకు వెళ్ళాలి.'' అంటూ లేచాను.

టవును హాలులో ఏర్పాటు చేసిన జగన్నాథం సంతాప సభకు బయలుదేరాను— నా వూహల్ని నెమరు వేస్తూ, ఫుట్‌పాత్ మీద బూట్‌పాలిష్ చేస్తున్న కుర్రాడి పక్కన ఎవరో కూర్చుని పత్రిక చూస్తూ గలగల నవ్వుతున్నాడు. పరిశీలనగా చూశాను. పెట్టుడు గడ్డం, తలకు మాసిన టోపీ, మాసి చినుగులు కనిపిస్తున్న ధోవతి, భుజాల మీద చిరిగిన లాల్చీతో ఉన్నాడు. "ఎవరతను?'' పోల్చుకోడానికి ప్రయత్నించా. ముఖానికి పత్రిక అడ్డు ఉండటం వల్ల సాధ్యం కాలా.


మూకదంపుడు ఉపన్యాసాలతో జగన్నాథం సంతాప సభ పూర్తి అయింది. అక్కడ తేలిన విషయం జగన్నాథం తన ఆస్తినంతా మూడు రోజుల క్రితమే ధర్మ సంస్థలకూ, సేవా సంస్థలకూ వ్రాసి యిచ్చాడని, బ్రతికి ఉండగా అతను చేసిన ఘన కార్యాలనూ, ఔదార్యాన్నీ ప్రశంసిస్తూ చనిపోయే ముందు కూడా అతను ప్రదర్శించిన ఔదార్యాన్నీ పొగడుతూ జగన్నాథానికి జోహారు లర్పించారు.

హాలులోంచి బయటకు వస్తూంటే అంతకు ముందు ఫుట్‌పాత్ మీద పత్రిక చూస్తున్న వ్యక్తి కొందరి ముందు చెయ్యి జాపి "బాబూ— ముసిలోడ్ని— ధరమం సేయండి'' అని యాచిస్తున్నాడు. పరకాయించి చూశాను. నేను పరిశీలనగా చూస్తున్నాననేమో ఆ వ్యక్తి పక్కకు తప్పుకున్నాడు. ఆ ముఖాన్ని పోల్చుకున్నా.... అతనే జగన్నాథం. జగ్గుగా మారిన జగన్నాథం. జగన్నాథం అవతారం చాలించి లౌకిక బంధాలతో, మోసాలతో నిమిత్తంలేని జగ్గు అయిపోయాడు. 'జగ్గూ' అని పిలవాలని పించింది. కాని గొంతు పెకిలి రాలేదు.

ఎంత చరిత్ర జగన్నాథానిది!

ఎంత మార్పు జగన్నాథానిది!

"జగన్నాథం ఆత్మహత్య వార్త అతనే పత్రికలకు సరఫరా చేయించాడేమో! ఎంతైనా చతురుడు.... అన్న ఆలోచనలతో ఎదురుగా వచ్చి ఆగిన బస్సులోకి ఎక్కాను. ●



ఆదుకొనే స్నేహితురాలు





బాధ అనేది మాకు ఒక సమస్య...చూడండి మేము మీకు ఏవిధంగా సహాయపడతామో!

పరిశోధన : 'ఆస్ప్రో' యొక్క పరిశోధనాసంస్థలోని ఒకపరిశోధనా దళానికి నేనుఉపదేశకుడను. బాధను ఆపుజేయడానికి మంచి పద్ధతులను కనిపెట్టుట మాపని. ఈ విషయమును గురించి ఏకాగ్రతతో ప్రపంచ మంతటా పరిశోధనలు జరుపు తున్న అగ్రగణ్యమైన పరిశోధనా సంస్థలలో మేము ఒకరము. నొప్పిని నివారించుటకు నేడు శ్రేష్ఠమైన క్రొత్తమార్గము 'ఆస్ప్రో' ఫార్ములా అని మేము తెలుసుకొన్నాము. అందుచేతనే ప్రపంచమంతటా డాక్టర్లచేతను, ఆసుపత్రులలోను ఇది వాడబడుతోంది.

బాధ అంటే ఏమిటి ? మెటాబొలిక్ ఉత్పత్తులు, దేహము వాటిని తీసుకొనిపో గలిగే కంటే హెచ్చు వేగములో, స్నాయు-వులలో కూడుకొనిచేరి పోవడంవల్ల మరుగు పడిన వాపు కలుగుతుంది. దానితో నరము లకు ఒత్తిడి కలిగి బాధ కలుగుతుంది.

'ఆస్ప్రో' ఎలా పనిచేస్తుంది : 'ఆస్ప్రో' దేహములో వెంటనే యిమిడి, వాపును, నరముల మీద ఒత్తిడిని తగ్గించి నొప్పిని వెడలగొడుతుంది.

'ఆస్ప్రో' ను ఈ వ్యాధులకు వాడండి : నొప్పి, తలనొప్పి, ఒంటి నొప్పి • పంటినొప్పి • కీళ్లనొప్పి, జ్వరముతోకూడిన జలుబు, ఫ్లూ, కీళ్ల నొప్పులతో గూడిన జ్వరము.

మోతాదు :
పెద్దవారికి : రెండు బిళ్లలు. అవసరమైతే తిరిగి వేసుకొనండి.
పిల్లలకు : ఒక బిళ్లలేక మీ డాక్టరు సలహా ప్రకారము వాడండి.



'ఆస్ప్రో'
నొప్పిని వెడలగొడుతుంది

A.G.32-66 TEL



జరిగిన కథ

మగధరాజు బింబిసారునకు ఆమ్రపాలిని చేపట్టాలనే ఉద్దేశ్యంతో వైశాలికి వస్తాడు. పాలి భవనంలో ప్రవేశించి ఆమెని ఆకర్షిస్తాడు. పాలికి బింబిసారునిపై ప్రేమ జనిస్తుంది. మహానాముడు ప్రవేణి పుస్తకాన్ననుసరించి పాలిని దేశవర్తకిని చేస్తాడు. బింబిసారుని వివాహం చేసుకున్న పాలికి తన తండ్రి నిర్ణయం తెలిసి మరణశయ్యమీదఉన్న మహానాముని చెంతకు వస్తుంది. మహానాముడు మరణిస్తాడు. చేలన బింబిసారుల వివాహమైపోయింది. యుద్ధానికి సన్నద్ధులైన లిచ్ఛవీయుల్ని పాలి శాంతింపజేసింది. చేలన, సంజయుడూ పాలిని అనుగ్రహించమని బింబిసారుని కోరారు. బింబిసారుడు పాలి దర్శనానికి వస్తాడు. పాలి చేటకరాజు నగరం విడిచి వెళ్ళిపోయింది. పదహారేళ్ళక్రితం తననుండి వేరైన పుత్రునికోసం పాలి ఆవేదన ఎక్కువైంది. పాలి ధర్మసభకు వెళ్ళింది, స్థవిరుడి దగ్గరకు వెళ్ళి అడిగింది. బుద్ధుని చూసినప్పుడు ఆమెలో ఒక వింత ప్రశాంతత ఏర్పడింది. 'పాలి థేరీ' పేరుతో బౌద్ధభిక్షుకి అయింది.

26

'రాజసింహాసనమా?' ....అని బింబిసారుడు అట్టహాసం చేశాడు. అకస్మాత్తుగా ఆగి మెల్లగా అన్నాడు—'రాజసింహాసన మతనిదే సంజయా. అజాతుడు ఈసింహాసనానికి నిజమయిన దాయాదుడు.'

''కాని, అతడిప్పుడుడే కోరుతున్నాడు.''

'దీనిలో గొప్పవిశేషమేముంది. ఇప్పుడే తీసుకోనీ.. కాని, అతన్ని నాదగ్గరికి రానీ'

'మీదగ్గరికి వస్తే మీరతన్ని పరీక్షిస్తారు.'

'సింహపు పిల్లకు శౌర్య పరీక్షఇవ్వవలసి ఉంటే విచారపడ్డానికేముంది.? నాతండ్రి అనేక విధాల పరీక్షించే నాకు సింహాసనం అప్పగించాడు. నేనూ అజాతుని పరీక్షించిన తరవాతనే సింహాసనం అప్పగిస్తాను...... కాని సింహాసనం అతనిదే కదా!'

'ప్రభూ! అతడు పరీక్ష నివ్వడు. అతడు పూర్వాపరాలను వంశమర్యాదను ఒక్కసారిగా త్రుంచివేసి రాజసింహాసనాన్ని తీసుకొన గోరుతున్నాడు.'

'నేనివ్వకపోతే?'

'అప్పుడు... అట్లయితే అతడుతండ్రిని వేరుచేయడానికీ సంకోచించడు.'

'ఇందుకోసమేనా నీవు నన్ను సరిహద్దు ప్రాంతానికి తీసుకొని పోడానికి కోరుతున్నావు. పుత్రుడు తెలివి తక్కువ వాడైతే తండ్రికూడా వివేక హీనుడు కావాలనేనా రాజనీతి చెప్తున్నది?'

'స్నేహంవల్ల సింహాసనాన్ని వదలడం రాజనీతి ఎన్నడూ సమ్మతించదు.'

'మిత్రమా నీ గూఢచారులు పొరపడ్డారు బ్రహ్మదత్తుడు ఎప్పటివలెనే వృద్ధత్వంలో కూడ వినుటలో పొరపడ గలడు. అజాతుడిలా పొరపడలేదు.....'

'దేవా ఇది నేను కళ్ళతో చూసినదీ, చెవులతో విన్నదీ అయిన విషయం.'

'ప్రేమతప్ప తండ్రి హృదయంలో ఇతరమేమీ లేదని తెలిసిన అజాతుడేమి జరిగినా నాదగ్గరనుండి సింహాసనాన్ని తీసుకోడానికి సిద్ధపడతాడా?.......'

'మీరు పుత్రుని ఎంత గాఢంగా ప్రేమిస్తున్నదీ అందరూ ఎరుగుదురు. ఈ స్నేహం గ్రుడ్డిది.'

'సంజయా.'

''మహారాజా, నాకు భయం కలుగుతోంది. మీరు శీఘ్రంగా ఇక్కడి నుండి వెళ్ళండి.... నడవండి. మనం దేవికడకు పోదాం.' అని సంజయుడు గద్గద స్వరంతో పలికాడు. అతని కంఠం మహారాజు ఎడల భక్తి సంతాపాలతోనిండి పోయింది. బింబిసారుడు విస్మితుడై అతనిని చూడసాగాడు. సంజయుడెన్నడూ ఇంతగా ప్రార్థించి ఉండలేదు. తక్షణం బింబిసారుడు నిశ్చయించి సంజయుని సమీపంలో కూర్చుండి అన్నాడు—'కొంచెము సేపటి క్రితమే నేను పాలిని కలుసుకోవాలని ఊహించాను. కాని మొదటపుత్రుని కలుసుకోవాలని, ఇప్పుడు అనుకుంటున్నాను. సంజయా, ఆమ్రపాలిని భిక్షుణీ సంఘంతో కూడా ఇక్కడికి శీఘ్రంగా తీసుకురమ్మని నగర శ్రేష్ఠికి చెప్పు. పుత్రుని ఇంకా...

'పత్నిని' అని సంజయుడు పూర్తిచేశాడు.

బింబిసారుడార్ద్ర దృష్టితో సంజయుని వంక తాను ఆమ్రపాలికి పతి అవడానికి యోగ్యుడు కాడని అతడితో చెప్తున్నట్లు చూశాడు.

సంజయుడు తడిరెప్పలు తుడుచుకుని నమస్కరించి వెళ్ళిపోయాడు. బింబిసారుడాలోచింప సాగాడు. ప్రపంచమంతా అతనికి విచిత్రంగా తోచింది. నేడుయవ్వనపు మదమయ జీవితం అతన్ని వృద్ధత్వ ద్వారం దగ్గరకు తీసుకువచ్చి నిలబెట్టింది. తనకై ఒకనాడు త్యాగం చేసిన చేలనకు నేడు మహారాణి పదవి తప్ప ఇతరములన్నీ అప్రధానాలు. పుత్రుడునేడు సింహాసనం లాగుకోడానికి ఉద్యుక్తుడవుతున్నాడు.

ఇప్పటివరకు అతడు ఎవతెను హృదయ స్వామినిగా ఎంచుతున్నాడో ఆమెనేడు సంసారమునుండి విరక్తఅయి థేరి అయింది. క్రమంగా అతనికి జీవితం ముఖ్యంగా యవ్వనం నుండి వృద్ధత్వం వరకూ గల ఘటనలన్నీ— స్మరణకు రాసాగాయి. అతడు జీవితంలో గడచిన స్మృతులలో విలీనుడయ్యాడు, పరవశు డయ్యాడు.

చేలన వచ్చి ద్వారంలో గడపమీద కూర్చుండి బింబిసారుణ్ణికదలించి చేతనం కలవాణ్ణిగా చేసింది. అప్పటికి చాల సమయం గడచింది. విచార శృంఖలం తెగగానే అతడు విస్మితుడై తన మనస్సులో దుఃఖానికి బదులు స్ఫూర్తి ప్రకటిత మైనట్లు అతని కనుభూతమైంది. అతని హృదయం శాంతించడానికి బదులు చాల చలించింది. మహారాజ్ఞీపదవికే అధికమహత్వం ఇచ్చు చేలనమీద భారమంతా విడిచి అతడు నివృత్తుడు కాగోరేడు. అతడు భ్రాంతిని, విశ్రాంతిని విడిచి అకస్మాత్తుగా చేతనము కలవాడయాడు. వృద్ధత్వానికి యవ్వన మచ్చినట్లు, గుడ్డి

వానికి కళ్ళు వచ్చినట్లు, మూగవాడికి మాట వచ్చినట్లుంది. అతడిది చూశాడు మహారాణి చేలన నుండి రాత్రింబగళ్ళు రాజ్య భోగానికి సంబంధించిన విషయాలే విన వస్తున్నాయి. ఇతర రాణుల ద్వారా క్రోధ, రోష, రోదనాలు మూర్తిమంతమవుతున్నాయి. నర్తకురాండ్ర వద్ద నుండి ప్రపంచభాషలో 'సుఖము' అన బడు పై పై వలపు లభిస్తోంది. అంతాన్ని అతనికి పుత్రప్రేమలో కొంత శాంతి అనుభూత మవుతోంది. కాని నేడు అది కూడా మృగతృష్ణలా కనపడింది.


తున్నారు. బింబిసారుడు వచ్చాడు. అతనిని చూడగానే బ్రహ్మదత్తుని ముఖంనుండి చిన్న కేక వెలువడింది. నేడు బింబిసారుడు రాజవేషం వదలి బొమ్మలాటగాని వేషం ధరించాడు. ముఖం మీద గీతలున్నా విశిష్టమైన ఉత్సాహం ఉంది. అది జీవితంలో మొదటి సారి బింబిసారుడు బొమ్మలాట గాడుగ అభినయించినప్పుడు ఇరవై అయిదేండ్ల క్రితం ఎలా వుందో అలాగే ఉంది.

శీఘ్రంగానే సంజయ బ్రహ్మదత్తులు కూడ తమ వేషాలను మార్చుకున్నారు.

వగడాలూ, మిక్కిలి విలువైన బంగారు నగలూ ప్రకాశిస్తూ కన్పిస్తున్నాయి. రెండోవైపు నిర్ధనులు, నిమ్నవర్గానికి చెందిన స్త్రీలు కూడ కూర్చున్నారు.

వీరందరిమధ్య ఒక ఎత్తైన ఆసనం మీద కూర్చుండి పాలి ఉపదేశిస్తోంది. కాషాయవస్త్రాలు ధరించడంవల్ల ఆమె దివ్యతేజస్సు చాల ఉజ్వలంగా ఉంది.

ఇది ఉపదేశానికి ఆఖరు భాగం. పాలి మనుష్యదేహం అసారాన్ని బోధిస్తోంది. స్త్రీలకి వెనకవైపు నగర శ్రేష్ఠి తప్ప తక్కిన పలువురు ప్రముఖ నాగరికుల్లు



అతడు ఏకాకి అయినట్లు అతనికి నేడు తోచింది. అతనికెవ్వరూ లేరు! అతని జీవితంలో ఎవరూ లేరు. ఎవరైనా ఉంటే, ఆమె పాలే. అతడు పాలిని చూడటానికి నిశ్చయించాడు. ఈనిశ్చయంతో అతని మనస్సుస్ఫూర్తి, ఉల్లాసంతో విలసితమయింది.

అయిదవనాడు పూర్ణిమ వచ్చింది. సంధ్య అవడానికి ఎంతో ఆలస్యం లేదు. బింబిసారుని ఎదురు చూస్తూ సంజయ బ్రహ్మదత్తులు ఒక రహస్య ప్రదేశంలో ఇటూ అటూనడాడు

వారు ముగ్గురూ గుప్త ద్వారంనుండి పాలిని చూడడానికి బయలుదేరారు. పాలి నేడు రాజగృహానికి సంబంధించిన నగర శ్రేష్ఠి యింట ప్రవచనం చేస్తుంది.

రాజగృహానికి ముఖ్యమైన కూడలి దారిలో నగర శ్రేష్ఠి మహలు ఉంది. దాని వెనకనున్న ఉద్యానంలో నేడు నగరంలోని అసంఖ్యాకులైన స్త్రీలు కూడ ఆమ్రపాలి ఉపదేశాన్ని వింటున్నారు. స్త్రీలందరూ ఉచ్ఛకులానికి చెందినవారు. దృష్టిపడినచోటంతా వజ్రాలూ, నీలాలూ

కూర్చున్నారు. బొమ్మలాటగాళ్ళు ముగ్గురూ ధైర్యంగా వాళ్ళ దగ్గరికి వచ్చి కూర్చున్నారు.

సభ శాంతంతో వింటోంది. పాలినిర్వికారం, అలిప్తం అపార్థివం అయి దివ్యమైన వాణి స్రోతస్సు ప్రవహింపజేస్తోంది.

నేడు బొమ్మలాటగాడు బింబిసారుడు ఇరవై అయిదేళ్ళు నిండిన పాలిని శాంతంతో చూస్తున్నాడు. పాలి మాటలు అతని హృదయానికి ఆఘాతం కలిగిస్తూ వెడలి పోగాయి—

ఆమ్రపాలి

....'నాకు ఒకప్పుడు అందమైన కేశాలుండేవి. వజ్ర జటిత చక్రంతో సన్నని తీగెలతో చక్కదిద్దిన నా అలకలు కవుల కవిత అయింది: నాశరీరం చందనం మొదలైన సుగంధవస్తువులతో అలంకతమై నాదేహ సుషమ ఇతరుల మాత్సర్యానికి కారణ మయింది. సువర్ణ కాంతితో కూడిన నాదేహకాంతి శిల్పకారుని కళాద్వారంతో నిర్మిత మైనట్లుంది. నాకళ్లు ముందుకు రాగానే ఇతరుల దృష్టిని మిరుమిట్లు గొలుపు ప్రజ్వలంచె మెరుస్తూండేవి. కమల నాళాలవంటి నాబాహువులు ఇప్పుడు ?వు. రక్తమాంసాలతోనిండిన అవయవాలన్నీ నేడు వాడిపోయాయి. స్వర్ణకాంతిమయమైన నా అనుపమ దేహం ఇప్పుడు ముడుతలతోనిండిపోయింది. అహర్నిశం సువర్ణ నూపురాలు కట్టుకుని నాట్యమాడు చరణాలు నేడు దుర్బలములై పోయాయి. తన శరీర సౌందర్యానికి గర్వించు స్త్రీ అంతం ఇలాంటి పరిస్థితులలో ఒవుతుందని ఆమె గుర్తించాలి. దేహంమీద గల మమత మిథ్య. నేడున్నది రేపుండదు! శరీరంచేత ప్రాప్తించిన దుఃఖం, అనుభూతి అనిత్యాలు. దుఃఖం నిత్యం. దాని నుండి విడివడ్డానికి ప్రయత్నించడమే ప్రతి మనిషి కర్తవ్యం.

సౌందర్యవతులు నిజంగా దుఃఖ క్లేశాలను మరచి ప్రసన్నతతో, శాంతితో ఆమ్రపాలి ఉపదేశం విని ముగ్ధులవుతున్నారు. ప్రవచనం సమాప్తమైంది.

తిరిగి వందన విధి ప్రారంభమైంది. బింబిసారుడు ఆమ్రపాలిని చూడడంలో తల్లీనుడవడం సంజయుడు చూచాడు. అతడిప్పుడేమి చేయగలడో అన్న కుతూహలం సంజయ బ్రహ్మదత్తు లిద్దరి హృదయాలను తహతహ లాడిస్తోంది.

క్రమంగా స్త్రీలు వచ్చి ఆమ్రపాలి చరణములందు మస్తకాలు వంచి, ప్రదక్షిణం చేసి వెళ్ళ సాగారు. చివరకు పురుషులు కూడా లేచారు. మందహాసంతో ఆశీర్వదించు ఏపుడు పాలి అమృతాన్ని వర్షించు ఒక దివ్యలోక తపస్వినివలె కన్పిస్తోంది. మెల్లగా బింబిసారుడు ఆమె దగ్గరకు వచ్చాడు. ప్రేమ పూరితమైన శ్రద్ధతో సంజయ బ్రహ్మదత్తుల నయనాలు అశ్రుపూరితా లయాయి.

కాని పాలి, భావములీల, సుఖ దుఃఖములు, ప్రేమ, మాత్సర్యము, క్రోధము, మోహము, తృష్ణ — ఇవి ఆడలేని స్థితికి వచ్చింది. స్త్రీ పురుషుల భేదం తెలియని లౌకిక పార లౌకిక భేదాలు లేని, దుఃఖ కార్యరహిత మైన సనాతన శాంత గల 'నిర్వాణపదము' పాలి పొందింది.

బింబిసారుడు మెల్లగా పాలి చరణాల దగ్గరకు వచ్చాడు. ఇతర భక్తులవలె అతడూ పాదను లంటడానికి చేతులు చాచాడు. మస్తకం పాదాలపై వంచాడు. పాలి ఆశీర్వదిస్తుందనీ, అతన్ని ప్రేమ పూరిత నేత్రాలతో చూసి క్షమిస్తుందనీ, అతని మనస్సు విశ్వాసం కలిగిస్తోంది.

పాలి ఆశీర్వదించింది కాని, చరణాలపై వ్రాలిన బింబిసారుని— బొమ్మలాటగాణ్ణి చూడలేదు. ఆమె దృష్టి దూరంనుండి నమస్కరిస్తున్న నగరశ్రేష్ఠి వైపు, అతని భార్యవైపు ఉంది. ఆమె క్రిందికి చూచినప్పుడు ఎవరో భక్తుడు ఆమె చరణాలపై వ్రాలి ఉన్నాడు. ఆ సమయంలో బింబిసారుడు సంజయ బ్రహ్మదత్తులు, ఆశీర్వచనము పొంది దూరంగా నిల్చున్నారు.

బింబిసారుడు మనసులోని మాటలు ఎంతో రహస్యంగా ఉంచాడని సంజయ బ్రహ్మదత్తుల కాజ్ఞాపించాడు. అతడు రెప్పవాల్చక పాలివైపు చూస్తున్నాడు. దివ్యమైన మందహాసంతో పాటు పాలి ఒకసారి నలువైపులా దష్టి సారించింది—ఆమె కళ్లు ముగ్గురు బొమ్మలాట గాళ్లనీసాధారణ శ్రోతలలాగ చూశాయి. శ్రేరి ఆమ్రపాలి బొమ్మలాటగాళ్లను విశేషదృష్టితో చూడలేదు. గుర్తింపనూలేదు. ఏమంటె, దేశ నర్తకి ఆమ్రపాలి చాలదినముల క్రిందటే మరణించింది.

ఆమ్రపాలి దేశంకోసం తన సౌఖ్యాల నెన్నింటినో త్యాగంచేసింది. నేడామె ప్రపంచానికి దూరంగా ఉండి కూడా శత్రు రాజ్యాలు రెండింటికీ సేవ చేస్తోంది.

బింబిసారుడు మనసును ప్రశ్నించాడు— పాలి ఇప్పుడూ, భూతకాలాన్ని జ్ఞాపకముంచుకొంటుందా? ఇప్పుడూ ఆమె హృదయంలో గడచిన స్మృతులు నిల్చి ఉంటాయా ? ...... సంవత్సరాలనుండి అణగివున్న పాలి స్మృతి మేల్కొంది. సంవత్సరాలకు ముందు తాను తెలిసుండే పోగొట్టుకున్న జ్ఞానం తనకు నేడు మళ్లీ లభించినట్లు బింబిసారున కనిపించింది. సంవత్సరాలకు ముందే చూచియున్న ప్రపంచం, పాలిని చూడడం వల్ల అతనికి పూర్తిగా మారినట్లు కన్పించింది.

రాణులు లభించారు, రాజపుత్రులు ఉదయించారు, రాజ్యం వృద్ధయింది, సామ్రాజ్యం నిర్మితమైంది. కాని అనేక సంవత్సరాలనుండి పాలి కోసం హృదయంలో శూన్యంగా ఉన్న స్థానం పాలితప్ప ఇతరులెవ్వరూ పూర్తిచేయలేక పోయారు.ఈ విషయం నేడు అతనికి ప్రత్యక్షంగా అనుభూతమైంది. అర్హత ప్రాప్తించి నప్పటికీ ఆమ్రపాలి బింబిసారుని హృదయంలో ఇంతవరకు సంసారిణిగానే ఆసీనయైఉంది. పాలి తన శిష్యురాండ్రతో అతని దగ్గర నుండి వెళ్లిపోయింది. అప్పుడే బింబిసారుడు శ్రేరిపాలి సంసారం త్యజించినదనీ, సంసారిణి అయిన పాలి పూర్ణ రూపంలో ఇప్పుడు తనదైనట్లు తెలిసికొన గలిగాడు.

శ్రేరి పాలి తన శిష్యులతో అనేక జయవాదాలమధ్య నగర రాజ్య మార్గంలో పోతోంది. ఆమె వైశాలి వైపు పోవాలి. ఆమెవెనకే బింబిసారుడు కూడా నగర బాహ్య ప్రవేశ ద్వారం వరకూ వెళ్లాడు.

సంధ్యాసమయమైంది. భిక్షుణులు క్రమంగా దూరం కాసాగారు. బింబిసారుడు నిర్నిమేష దృష్టితో వారిని చూస్తున్నాడు.

హఠాత్తుగా పెక్కురు సైనికులు వారి ముగ్గురిని చుట్టుముట్టారు. బింబిసారుడు ఇప్పటికీ పోతూన్న పాలిని చూస్తున్నాడు. సంజయుడాతని హస్తాన్ని గట్టిగా లాగినప్పుడతనికి తెలివి వచ్చింది. ఒక సైనికుడు అధికమైన శిష్టాచారం లేకుండానే అన్నాడు.

'అవినేయతకు క్షమించండి., కాని మీరు మాతో రావాలి.''

బింబిసారుడు సిపాయిలను ఆశ్చర్యంతో చూస్తున్నాడు. వాళ్లు అతని చర్మవేషాన్ని ఎలాక్కనుకున్నారు?.....సంజయుడు ముందుకు పోయి కఠిన స్వరంతో అడిగాడు— 'ఎక్కడికి?'

'మీరెరుగుదురు, కారాగారానికి! ఇది ప్రభువు అజాత శత్రుని ఆదేశం?'

'నన్ను కారాగారంలో పడవేయాలని అజాతశత్రువు ఆదేశమా?' అని బింబిసారుడు ఎక్కువ విస్మయం పొందకుండానే అడిగాడు.

'అయ్యా, మీరు పారిపోడానికి వ్యర్థ

ప్రయత్నం చేయకండి. - నగరమంతటా గూఢచారుల కఠిన వ్యవస్థ వుంది. మీకోసం ఎవరూ కత్తి ఎత్తలేరు. మహారాజు అజాత శత్రువు ముందు అందరూ మీరు అస్థిర చిత్తులనీ అంగీకరిచారు. మీారు విక్షిప్తు లని వారంగీకరిస్తున్నారు, ఇప్పుడు మీాకు మహావెంట రావడం తప్ప గత్యం తరం లేదు.

'అజాతుడు నన్ను కారాగారంలో పడ వేస్తే మంచిదే, కాని విక్షిప్తుని చేసి..'

'మహారాజా' అని సంజయుడు కరవా లంపై హస్తముంచి అన్నాడు.

"సంజయా!"..బింబిసారుని స్వరం మూగ పోయింది.

అతడిటు నటు దృష్టి బరపి అన్నాడు. 'చంపడంలోనూ చావడంలోనూ ఏమీా లాభంలేదు. చచ్చి మళ్లీ జన్మించాలని పాలి చెప్పింది. .... దూరంగా ఉండండి,

సైనికులారా. నేను మీతో వస్తాను. కావలిస్తే పిచ్చివాడినై కూడా! కాని వాదోమాట వినండి ; నన్ను ఆభిక్షుణి సంఘాన్ని చూడనివ్వండి'.

సైనికులు తక్షణమే వేరుపడ్డారు.

ఆమ్రపాలి

బింబిసారుడు వేగంగా ముందుకుసాగి ఒక విశాల వృక్షం దగ్గరికి వచ్చి నిల్చున్నాడు. సంధ్యా సమయమందలి మంద ప్రకాశంలో పాలి, ఆమె భిక్షుణులు వృక్ష శ్రేణులలో అదృశ్యమవుతున్నారు. ఒక కోయిల కూసింది. బింబిసారుడు పైకి చూచాడు. అది ఆమ్రవృక్షం. ఆమ్ర వృక్షమే పాలికి సహాయమిచ్చి సంసార కారాగారానికి పంపినదని అతనికి స్మరణ కొచ్చింది. బింబిసారుడు మందహాసం చేసి వృక్షము మీదనుండి దృష్టి మరల్చాడు. అంతరిక్షంవైపు అంతర్హితమవుతున్న పాలి నతడు చూడసాగాడు. వాయువు దూరము నుండి భిక్షుణుల గీత ధ్వనిని లాగుకొని వస్తోంది.

'బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శర ణం. గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి...

బింబిసారుడు అస్తబ్ధావస్థలోనే మెల్లగా భిక్షుణుల ఆమాటలనుపెదవులతో ని ఒక దీర్ఘ నిశ్వాసం విడిచి సంజయుని దెస చూశాడు.

"సంజయా, కారాగారంలో దగ్ధము కమ్మ!...ఒకపుత్రుడు తల్లిని సంసార కారా గారంనుండి విడిపించాడు. మరొక పుత్రుడు తండ్రిని చెరసాలలో పడవేస్తున్నాడు.?"

'దేవా.......' అని కళ్లలో అశ్రువులు నింపి సంజయుఁడు మందహాసం చేశాడు. అతడన్నాడు—

'క్రరబొమ్మలవాడు, కుశలనటుడు, నాట కాన్ని ముగించిన తరువాత నవ్వు తున్నాడు.......'


'రంగస్థలంలో క్రరబొమ్మలే ఉంటా యని తెలిసికొని అతడు నవ్వుతున్నాడు. నాకు తండ్రిగారీ విషయమునే జ్ఞాపక ముంచుకోమని చెప్పారు. కాని నా మాటలు నీవు జ్ఞాపకముంచుకొంటున్నావు. మం చిది...... నడు సంజయా!' ఇలా అని బింబి సారుడు సంజయుని పట్టుకొని సైని కులముందు నడవ సాగాడు. బ్రహ్మ దత్తుడు క్షణంలో వృక్షములలో అదృశ్య మవుచున్న పాలివైపునను, క్షణంలో బింబి సారుని చూస్తూ నిశ్వాసం విడిచి వాళ్ల వెనక నడన సాగాడు.

నహి వేరేన వేరాని సమ్మన్తి కదాచన,
ఉవేరేన చ సమ్మన్తి ఏస ధమ్మో సనన్తనో.

(వైరంతో వైరం ఎన్నటికీ నష్టం కాదు. ఇదే సనాతన ధర్మం.)

గౌతమబుద్ధుడు,
యమకవర్గ, ధమ్మపద.

(అయిపోయింది)



మనసులోని కుంచె

శీలా వీర్రాజు



''అయితే రాలేరన్న మాట?''

కోపమూ, ఓటమితో సడలిపోతున్న పట్టుదల వెనక దిగులూ, కట్టి పడేయ లేని అసహాయతలోని చిరాకూ, చిరునవ్వు విరిగిపోయిన పెదాల బిగింపులో జారి పోనీయక అణచిపడుతున్న ఆత్మాభిమానమూ యింకా ముఖంలో ఎరుపూ, చూపుల్లో తీక్ష్ణతా, మాటల్లో పదునూ......

ఇంత పెద్ద కల్లోలాన్ని చూసి జడిసి పోయాడు మనోహర్రావు సన్నని ఉల్లి పొర కాగితంలాంటి అతని మనసు అల్లల్లాడి పోయింది. కంటి రెప్పల్లో దిగులు రెప రెపలాడింది. జాలిగా, బాధగా, భయంగా తనలోకి తనే చూసుకుంటూ ''బుధ వారం సాయంకాలం కాస్త పనుంది, మర్నాడు వస్తా లెండి'' అన్నాడు.

''మర్నాడెందుకూ. మర్నాడు నాకేం పనులూ వుండవనుకున్నారా. మీగురించి చూస్తూ వుండడంకన్న నాకు మరోపనేమీ లేదని ఎందుకనుకుంటారూ?''

అర్థం కాని అయోమయంతోనూ, పెద్ద తప్పు చేసి దిక్కుతోచక నిలబడి నప్పటి అసహాయతతోనూ, మనసును కళ్లల్లో నిలుపుకుని దీనంగా నిలుచుండి పోయాడు. అలా నిలుచుని నిలుచుని—

''మరీ అంత అవసరమైన పనైతే చెప్పండి, వస్తాను. నాపనంటారా—ఎప్పుడూ ఉండేదే'' అన్నాడు. అలా అన్నప్పుడు కంఠం పొడుగ్గా సాగదీశాడు. సన్నగా చిరునవ్వును ఆ చుట్టూ బోర్డరుగా గీశాడు. తనలోంచి చూపుల్ని తీసేసుకుని ఎదుటి ముఖంలో నిలిపాడు. అసలు ఆమాట అనడానికి ముందు కంఠం సవరించుకున్నాడు. పెదాల్ని నాలుకతో తడుపుకున్నాడు. అరిచేత్తో ముఖాన్ని తుడుచుకున్నాడు.

కొద్దిసేపు ఆమె ఆ వుల్లిపొర కాగితం రెప రెపల్ని ఆలకిస్తూ వుండిపోయింది.

''నాగురించి మీ పనుల్ని మానుకో నక్కర లేదులెండి. ఆ రోజు నా పుట్టిన రోజు కదాని పిలిచాను. తీరిక లేకపోతే సరే, బలవంతం చెయ్యను'' అంది.

''పుట్టిన రోజా!'' అన్నాడు ఆశ్చర్య పోతూ.

అవునన్నట్టు తలూపింది.

అతని ఉత్సాహం మీద గిలిగింతలు పెట్టి చిరునవ్వుల్ని కదిలించాల్సిన ఆ మాట అతని ఆత్మాభిమానం మీద ముల్లు లాగ గుచ్చుకుంది.

ఆ విషయం ముందే ఎందుకు చెప్ప కూడదూ. చెప్తే రాననలేదేతను. ఆ విషయం తెలిసి కూడా మరెందు కలా చేసింది! ఆమె గురించే తను వస్తున్న విషయం తెలుస్తూ వుండగా మళ్లీ దాన్ని ప్రత్యేకించి బయట పెట్టడంలో ఆమె ఉద్దేశం ఏమిటీ? ఆమె గురించే తను అభి ప్రాయాన్ని మార్చుకున్నాడనీ, ఆమె ఆకర్షణ ఇంత బలీయమైనదనీ, ఆమె మీద తనకే అభిమానం వున్నదనీ ఒట్టుబయలు చేస్తే ఆమెకు ఒరిగే దేమిటి? ఎందుకా నిర్లక్ష్యం?

ఆమె మీద చిరుకోపం, కొంతంత ఉక్రోషం కూడా వచ్చాయి.

అతని ముఖంలోకి చూస్తూ కూర్చున్న స్వచ్ఛిత మెల్లగా కదిలి ''పోనీ లెండి. మీలు లేకపోతే మీరు మాత్రం ఏం చెయ్యగలరు. ఈ మాత్రానికి అంతగా ఆలోచించాల్సిన అవసరం దేనికీ'' అంది.

ఈసారి అతనికి ''నిజంగానే నేన్న

"రాలేను" అని అరవాలనిపించింది. నాలుగైదు సార్లు ఆ మాటని నోట్లో అనుకుని కూడా, ఆమె ముఖంలోకి చూసి, తనవైపే సూటిగా చూస్తోన్న ఆమె చూపులకీ, ఆ చూపుల్లో తన మీద కుమ్మరించిన వెలుగు రేఖలకి తనలోని బలహీనత తనకే కనిపించి సిగ్గుపడి తల వాల్చేసుకున్నాడు.

"సరే, వస్తాలెండి" అని చెప్పి, దిద్దుతున్న ప్రాక్టికల్ నోటు పుస్తకాల్ని అలమార్లో పెట్టేసి, వెళ్తున్నట్టు ఆమెకు సంజ్ఞతోనే చెప్పి కదలబోయాడు.

ఉత్తరం రాసుకుంటున్నదల్లా మధ్యలోనే ఆపి "వెళ్తున్నారా... నాకూ అటువైపే కాస్త పనుంది. వెళ్దామా వద్దా అని ఆలోచిస్తున్నాను" అంది.

అదిగో! మళ్ళీ అలాగే మాట్లాడుతోంది. నేనూ వస్తానని ఎందుకనదూ. తన చేత రండి అని పిలిపించుకోవాలా? — అతనికి కోపమూ, అభిమానమూ కలిగి, పట్టుదల పెరిగి ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

రెండు నిమిషాలు అలానే వూరుకుని, చూడగూడదనుకుంటూనే ఆమె ముఖంలోకి చూసి, అలా చూస్తూనే—

"వేగంగా తెమలండిమరి. ఇప్పటికే ఆలస్యమైపోయింది. ఈ కెమిస్ట్రీస్టాఫ్‌లో మిగిలింది మనిద్దరమే. అంతా అరగంట క్రితమే వెళ్ళిపోయారు." అన్నాడు.

ఆమె కొద్ది సేపు తటపటాయించి "సరే లెండి. మీరు వెళ్ళండి, తర్వాత వస్తాను" అంది.

ఆ మాట ఆమె చెప్పడం పూర్తికాకుండానే అతను గది బయటికి వచ్చేశాడు. దారిలో రోజూ చూసే పూలకుండీల వేపన్నా చూడకుండా, మెట్ల దగ్గర ఆర్చిమీదకు పాకించిన మాలతీలతలో నిష్కల్మషంగా నవ్వే తెల్లటి పూగుత్తుల్ని కనీసం నిర్లక్ష్యపు చూపులోనన్నా పరామర్శించకుండా, రసదృష్టినీ, చిరునవ్వునీ దాచేసుకుని, కోపాన్నీ, అసహనాన్నీ ముఖం మీద అద్దుకుని గబగబా, రోజుకన్నా వేగంగా సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

రాత్రి చాలాసేపు నిద్ర పట్టలేదు. ఇంత కాలంగా తను ప్రతిష్ఠించుకున్న రూపం ఎండకు ఎండి, వర్షానికి తడిసి పెచ్చులు వూడొచ్చేస్తోంది. ఇంకొద్ది రోజుల్లో అక్కడ ఏమీ మిగలదు. మనసు నిండా అదే బాధ. అర్థం లేని ప్రతి విషయానికీ ఎన్నో అర్థాల్ని చెప్పుకుని, తెలివి తక్కువగా కోరికల్ని పెంచుకుని, యిప్పుడిలా భంగపడుతున్నందుకు తనమీద తనకే జాలి కలిగింది. ఆలోచిస్తున్న కొద్దీ ప్రతి చిన్న విషయమూ ఆమె మీది కోపానికి సమిధ అయ్యింది. గుప్పున కోపం రగిలి, కొద్దిసేపు ఎర్రగా మండి, మంచి తనపు చల్లగాలిలో కరిగిపోతోంది. అలా కరగకుండా వున్న ఒక సందర్భంలో అతడనుకున్నాడు—

ఆమె అంత నిర్లక్ష్యంగా వుంటున్నప్పుడు తనెందుకు నిర్లక్ష్యంగా ప్రవర్తించకూడదూ. ఆమె పుట్టిన రోజునాడు వట్టి చేతుల్తోనే వెళ్ళాలి. ఏ బహుమతీ తీసుకెళ్ళగూడదు. ఆమె చూపించని ప్రత్యేకత తనెందుకు చూపించాలి? చూపించగూడదు. అంతే, అలానే చెయ్యాలి.

మర్నాడు మంగళవారం— కాలేజీలేదు. ముసల్మానుల పండగ. బుధవారం నాడు ఆమె సెలవు పెట్టింది. అతను మాత్రం వెళ్ళాడు. ఉదయం, మధ్యాహ్నం ప్రాక్టికల్ క్లాసులున్నాయి. వాళ్ళిద్దరూ అక్కడ కెమిస్ట్రీ డిమాన్‌స్ట్రేటర్లే. ఆమెకన్నా అతను రెండేళ్ళు సీనియర్ అక్కడ. డిమాన్‌స్ట్రేటర్‌గా పని చేస్తూ ఎమ్.ఎస్సీకు కట్టాలని అతని ప్రయత్నం.

సాయంకాలం కాలేజీ విడిచి పెట్టగానే తిన్నగా యింటి కొచ్చేశాడు. నాలుగున్నరే అయ్యింది. బాగా ఆలస్యంగా వెళ్ళొచ్చులే అనుకున్నాడు. ఆరింటిదాకా యింట్లోనే కూర్చుని అప్పుడు మెల్లగా కదిలాడు.

ఆమె యిల్లు మైలు దూరం కూడా ఉండదేమో. రిక్షా అయితే వేగంగా వెళ్ళిపోతుంది. నడిచయితేనే మంచిది. బాగా ఎదురు చూడనివ్వు అప్పుడు వెళ్తే సరి. తనను యింతగా ఏడిపించిందికదా. ఆమెను తనెందుకు ఏడిపించ కూడదు?— అనుకున్నాడు.

అడుగుల్లో అడుగులు వేసుకుంటూ తీరుబాటుగా నడుస్తూ బయలు దేరాడు. బయలుదేరాడే కాని మనసంతా అదోలా వుంది. ఏ బహుమతీ తీసుకెళ్ళక పోవడం బావున్నట్టు అనిపించలేదు. అది తన నిర్లక్ష్యంగా భావించకుండా పిసినిగొట్టు తనంగానో, బీదతనం గానో ఆమె భావిస్తేనో— అన్న ఆలోచన వచ్చింది. భావిస్తే తనకి నష్టమేమిటీ అని సమర్థించుకున్నాడు. తెలిసి తెలిసి మరోసారి భంగపడడం తెలివి తక్కువ తనమనిపించింది. అనిపించినా ధైర్యంగా అనుకోలేక పోతున్నాడు. సందేహంగా అటూ యిటూ వూగుతోంటూనే చాలాదూరం వచ్చేశాడు.

ఇల్లు దగ్గర కొచ్చేసింది. అట్టేదూరం లేదు. మరో రెండు ఫర్లాంగులే వుంటుంది. సందు తిరిగితే వీధి వచ్చేసినట్టే.

గుప్పున ఫలసంపంగి వాసన కొట్టి ముక్కు పుటాల్ని వూపేసింది.

పక్కకు తిరిగి చూస్తే పూలమ్ముకునే కుర్రాడు వో యింటిముందు బేరం చూసుకుంటున్నాడు.

● పూలవాడిని చూసిన తర్వాత అంత వరకూ వూగులాడుతోన్న అతని మనసు వో పక్కకి ఒరిగిపోయింది. ఆ పూలంటే స్వచ్ఛితకు చాలా యిష్టం. ఎన్ని సార్లు చెప్పిందో వాటిగురించి. క్లాసులో అమరావతి అనే వో అమ్మాయి పెట్టుకొస్తుండేది. ప్రాక్టికల్ క్లాసులో అంత ఘాటైన ఏసిడ్‌ల మధ్యా, హైడ్రోజన్ క్లోరైడ్, హైడ్రోజన్ సల్ఫైడు వంటి కుళ్ళు వాసనల మధ్యా తన వునికిని నలుగురికీ చాటుకుంటూ పరిమళాలను వెదజల్లేది. ఆ అమ్మాయి యింట్లో చెట్టు వుంది కాబోలు తరచు పెట్టుకొస్తుండేది. అది చూసినప్పుడల్లా స్వచ్ఛిత ఆ పూలను గూర్చి, అవంటే తనకున్న యిష్టాన్ని గూర్చి, చిన్నప్పుడు ఆ మొక్కవున్న యింట్లో అద్దెకున్నప్పటి అనుభవాలూ, వాటికై తగాదాలూ— ఏదో ఒక ప్రస్తావనలేకుండా వుండేదికాదు.

స్వచ్ఛితకు పుట్టిన రోజు కానుకగా ఆ పూలను యిద్దామనుకున్నాడు మనోహరావు. పూలవాడు బేరం చూసుకొని వచ్చే వరకూ రోడ్డు పక్కన సిగరెట్టు కాల్చుకుంటూ నిలుచున్నాడు. వాడిదగ్గర గులాబీలూ, చేమంతులు, ధవనం కూడా వున్నాయి. ఫలసంపంగి ఎన్నో లేవు. పదే వున్నాయి. ఆ పదీ ఖరీదు చేసి తీసుకున్నాడు. తనకని విడిగా రెండు జేబులో వేసుకుని మిగతా ఎనిమిదీ జాగ్రత్తగా జేబురుమాలులో చుట్టుకుని బయలుదేరాడు.

అతను వెళ్ళేసరికి స్వచ్ఛిత యింట్లో ఎక్కడో వుంది. వాళ్ళ చెల్లెలు వెళ్ళి పిలుచుకొచ్చింది. ఆ యింట్లో పుట్టిన రోజు ఆర్భాటం ఏమీ కనిపించలేదు అతనికి. స్నేహితురాళ్ళూ, హడావిడీ—యివన్నీ వూహించుకున్న అతనికి అవేమీ కనిపించనే లేదు.

"ఎవరూ రాలేదా?" అన్నాడు అతను కూర్చుంటూ.

"రాకపోవడ మేమిటి. ఎప్పుడో వచ్చి వెళ్ళిపోయారు, మీకయితే యిప్పుడే తెల్లారిందికానీ..."

ఆ మాటల వెనకవున్నది కోపమేనా, రుద్ధ కంఠం కూడానా అని ఆలోచిస్తు న్నాడు అతను.

"ఉండండి. ఇప్పుడే వస్తాను" అని లోప లికి వెళ్ళి ప్లేటులో కొన్ని స్వీటూ, పాల్టు బిస్కట్లూ పట్టుకొచ్చింది.

"అవలా పెట్టండి. తింటానుగానీ, యివిగో మీకు యిష్టమైన పూలు. ముందు యివి తీసుకోండి" జేబురుమాలు విప్పి ఆమె ముందు వుంచాడు.

జేబురుమాలతో పాటు వాటిని తీసుకుని పక్కన పెట్టేసి "కాలేజీ విశేషాలు ఏమిటి చెప్పండి. ఇవ్వాళ రెండు క్లాసులూ మీరొక్కరూ చూసుకోవాల్సి వచ్చింది కాబోలు. లెక్చరర్ ఏమన్నా విసుక్కున్నాడా?" అంది.

పువ్వుల చుట్టూరా అతని మనసు తిరుగుతూండడం వల్ల కాబోలు ఆమె ఏమడిగిందో సరిగా తెలిక 'ఏమిటీ?' అని మరో సారి అడిగించుకోవాల్సి వచ్చింది. అడిగించుకుని, సమాధానం చెప్పి మళ్ళీ, పరధ్యాన్యంలో పడిపోయాడు.

"ముందవి తీసుకోండి" అని మరోసారి జ్ఞాపకం చేస్తే మెల్లగా తీసుకుంటు న్నాడు.

తింటున్నవాడల్లా ఒకసారి ఆగి "ఇంత సేపూ చూసి చూసి చివరకి రానని అనుకున్నా రేమిటి" అన్నాడు.

ఆమె వెంటనే "అబ్బే, అలా అనుకో లేదులెండి" అంది.

వెనువెంటనే ఆమె అలా అనేసరికి అతను ఏమీ మాట్లాడలేకపోయాడు.

"రారని అనుకోలేదులెండి. వస్తారనే అనుకున్నాను. ఆడాళ్ళ ఆలస్యానికి కారణం ఒకటే. మగాళ్ళ ఆలస్యానికైతే చెప్పుకో లేనన్ని కారణాలు. ఏమంటారు?"

అతను ఏమీ అనలేదు. ఏమనుకోవాలో కూడా ఆలోచించడంలేదు. ఇంత స్వాతిశయం ఏమిటీమెకు?— అన్నదే అతని ఆలోచన. 'అంటే తను రాకుండా వుండలేడనా ఆమె అభిప్రాయం?'

"ఏమిటి! మరీ పరధ్యాన్నంగా, అదోలా వున్నారు. ఏ కుర్రాళ్ళతో నన్నా గొడవ పడ్డారేమిటి? ఆ సెకండియర్ బేబి మరీ అల్లరి బేబి."

తన మనోభావాల్ని ఆమె 'చదివేస్తు న్నట్టు తోచి "అబ్బే... అలాంటిదేంలేదు" అన్నాడు చిన్నగా నవ్వి. గబగబా ప్లేటు కాళీ చేసి, మధ్యలో స్వీట్లు తయారు చెయ్యడం మీద రెండు మూడు విట్లు విసిరి, ఆమె కన్నా ముందుగా తనే నవ్వి చేతుల్ని కడుక్కున్నాడు. చేతులు తుడుచు కుందామని జేబురుమాల కోసం జేబులో వెతికితే కనిపించలేదు. పూలతో టేబిలు మీద వుందది.

అదామె గ్రహించి పువ్వుల్ని టేబిలు మీద పడేసి రుమాలు తీసిచ్చింది. ఆ తియ్యడంలో మూడు పువ్వులు కింద పడిపోయాయి. వాటిని తీద్దామని వంగి, అందకపోతే అలాగే వొదిలేసి, లేచి సరిగ్గా కూర్చుని "ఇంకాస్త ముందు వచ్చుంటే బావుండేది. అన్నయ్య అడగనే అడిగారు. ఇప్పటివరకూ చూసి చూసి, బజారుకు వెళ్ళాల్సిన పనుందని, మీరు వచ్చేముందే అలా వెళ్ళాడు" అంది.

అతను కుర్చీలో వెనక్కి జారపడిన వాడల్లా లేచి నిటాగ్గా కూర్చుని అన్నాడు.

"తొందరగానే వద్దామనుకున్నాను. ఇదిగో ఈపూల గురించి వెళ్ళేసరికి ఆలస్యమైపోయింది. మీకు యివంటే యిష్టం కదాని వెళ్ళి పట్టుకొచ్చాను. ఆమధ్య ఓ మిత్రుడి యింటికి వెళ్ళినప్పుడు వాళ్ళింట్లో చూశాలెండి. వెళ్ళి అడిగితే యింటి ఓనరు కోప్పడతాడనీ, ఆయన అరుగు మీదే తిష్టేసుక్కూచున్నాడనీ, పీలుండదనీ అన్నాడు. కాదు, కూడదని బతిమాలితే యింటాయన లోపలికి వెళ్ళిపోయేవరకూ వోపిక పట్టమన్నాడు. ఎంతకీ కదిలితేనా! ఉదయం వచ్చిన న్యూస్ పేపరు సాయంకాలానికి పాతబడిపోదూ? అల్లాంటి పాతపేపర్ని సాగదీసి మరీ చదువుతూ కూర్చున్నాడు. సరిగ్గా ఆయన గురించి గంటసేపు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవలసి వచ్చింది..."

ఆమె అకస్మాత్తుగా లేచి నుంచుని "అన్నట్టు! మాటల్లో పడి కాఫీ యివ్వడమే మర్చిపోయాను. చూశారా వుండండి, యిప్పుడే పట్టుకొస్తాను" అంటూ గబగబా లోపలికి వెళ్ళింది.

బాధపడ్డట్టు అతను ముఖం మాడ్చుకున్నాడు.

అయిదు నిమిషాల్లో ఆమె కాఫీ తెచ్చి యిచ్చింది.

కప్పు కాళీచేసి కూర్చున్నాడు. ఆట్టే మాట్లాడాలని పించలేదు. ముభావంగానే వుండిపోయాడు. చాలాసేపు అలానే కూర్చుని వెళ్ళిపోదామని లేవబోతే "కూర్చోండి, అన్నయ్య వచ్చేస్తాడు. మరో పావుగంటలో రానేవస్తాడు కదా, ఏకంగా కలుసుకునే వెళ్ళిపోవచ్చు" అంది.

మనోహర్రావు తండ్రి స్వచ్ఛిత అన్నయ్యకు హైస్కూల్లో గురువుగారు—అదీ పరిచయం.

మనోహర్రావు యిబ్బందిగా కూర్చు న్నాడు. ఏం చెయ్యడానికీ తోచక ఎడమ చెయ్యి అరచేతిని కుడిచేత్తో మృదువుగా రాసుకుంటూ, మధ్య మధ్య అరచేతిలోకి చూసుకుంటూ, నోటితో వూదుకుంటూ, అప్పుడప్పుడు జాడించి చెయ్యి దులిపి, మణికట్టు దగ్గర గట్టిగా పట్టుకుని వేళ్ళ మధ్య రక్తాన్ని ఉబ్బించి, గాలిలో ఆడించి, ఉండుండి ముక్కు పుటాల్ని ఎగ రేసి, కళ్ళు చిట్లించి, నిశ్వాసంలో శబ్దాన్ని నింపి ఆమె చూపులకి ఎక్కడా అందనివ్వక దాచేస్తూ వుండగా చటుక్కున ఆమె చూసి దొంగను పట్టుకున్నంత ఉత్సాహంతో "అదేమిటి" అంది.

"అబ్బె, ఏంలేదూ" అన్నాడు వేళ్ళు ముడుచుకుంటూ.

"లేకపోవడమేమిటి ఏదో వుంది" అంది.

తలెత్తకుండానే అరచేతిలోకి చూసుకుంటూ చెప్పాడు అతను—

"సంపంగిపూలు కోస్తున్నప్పుడు పక్కనే వున్న గులాబీ మొక్కముళ్ళు గుచ్చుకున్నాయిలెండి. ఇటికలు మూడింటిని ఒకదాని మీద ఒకటి పేర్చి వాటి పైకెక్కి పైన వున్న వో పువ్వుని అందుకోబోయాను. కోసేసిన తర్వాత బేలన్సు తప్పిపోయింది. ఇటికలు కదిలిపోయాయి. జారిపోయాను. పక్కనే గులాబీ మొక్క వుంటే దానిమీద అరచెయ్యి ఆనింది. ముళ్ళు గుచ్చుకున్నాయి. చిన్నముళ్ళయినా, బలంగా చెయ్యి ఆనిందేమో రక్తం వొచ్చింది."

"ఏం రాశారు మరి?"

"టించర్ రాసి కడిగేశాను. జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నొప్పి అనిపిస్తోంది. అంతే, మరేంలేదు"

"రాత్రి పడుకునే ముందు మరోసారి రాయండి. పొద్దుటికి అదే తగ్గిపోతుంది."

ఈ సలహా ఎవరిక్కావాలి.....ఒక్కమాట తన గురించి యింత కష్టపడినందుకు గుర్తింపుగా ఒకే ఒకమాట ఎంత చిన్న దైనా చాలు—అనదేం? ఎంత నిర్లక్ష్యం!

అతను ఉక్రోషం పట్టలేకపోయాడు. బురద చిమ్మినట్టు ముఖం మీదకు కోపం చిమ్మి ఎర్రబడిపోయింది. అతనికి ఎంత కోపం వచ్చిందంటే మంచినీళ్లు కావాలని చెప్పి, తేవడానికని ఆమె లోపలకు వెళ్లగానే చెప్పాచెయ్యకుండా అక్కడ్నుంచి పారిపోయి వచ్చేద్దామన్నంత కోపం వచ్చింది.

ఆ వుద్దేశంతోనే ''మంచినీళ్లు కావాలి'' అన్నాడు.

చెల్లెల్ని కేకేసి పట్టుకు రమ్మంది.. ఆ అమ్మాయి తెచ్చిన తర్వాత యిక తాగక తప్పలేదు అతనికి. విచిత్రం! అతనికి, యిప్పుడు నిజంగానే దాహంవేసి, ఆగ్లాసుడు నీళ్లూ గడగడా తాగేశాడు. రెండు నిమిషాలు మౌనంగా కూర్చుని మెల్లగా తనను తనే సమాధానపరచుకున్నాడు. రుమాలుతో ముఖం మీది చెమటను తుడుచుకుంటూ దానితోపాటే కోపాన్ని తుడుచేసుకున్నాడు. తన కంఠం తనకే లొంగే స్థితిలో లేదేమో నన్న భయంతో పొడిపొడిగా అయిదారు సార్లు దగ్గి దాన్ని సరిచేసుకున్నాడు. ఆతర్వాత—

''ఇందాక లక్కీగా వో ఏక్సిడెంట్ తప్పిపోయింది. పొద్దున్న లేచిన వేళా విశేషం.. వెంట్రుక వాసిలో ప్రమాదం తొలగిపోయింది. సంపంగిపూలు పుట్టుకరావడానికని వెళ్లి వస్తున్నప్పుడు కూరగాయల మార్కెట్ టర్నింగ్‌లో సడన్‌గా వో లారీ వచ్చేసింది. తప్పించడానికి కూడా వ్యవధి లేదు. ఏం చెయ్యాలో తోచక రెండు బ్రేకులూ వేసేసాను. సరిగ్గా సైకిలు ముందు చక్రాన్ని రాసుకుంటూ పోయింది లారీ. నిజంగా పునర్జన్మ ఎత్తినట్టే.''

''ఈ లారీవాళ్లు మరీ రెష్ డ్రైవింగ్ లెండి. వెనకాముందూ చూసుకోనైనా చూసుకోరు. చిత్తుగా తాగివుంటారేమో, వాళ్లను పట్టపగ్గాలుండవు. అందులో యీ వూళ్లో మరీ దారుణం. తరచుగా వారానికి ఒక ఏక్సిడెంటన్నా జరుగుతూనే వుంటుంది. మొన్నటికి మొన్న కాలేజీ రోడ్డు మీద చూడండి.. పుల్లలేసు కొస్తున్న ఎడ్లబండిని ఢీ కొట్టి ఆపకుండా పోబోలేదూ. మన కుర్రాళ్లు నంబరు నోట్ చేసుకోబట్టి గాని లేకపోతే వాడు దొరికేవాడేనా. ఈ వూరికి కంకర క్వారీ లొకటి. ఇరవై నాలుగ్గంటలూ ఒకటే ట్రాఫిక్. వీటికి తోడు పోలీసువాళ్లు కూడ అలాటి వాళ్లే తగలడ్డారు. ఇలా పట్టుకుని, అలా వాళ్ల మామూళ్లు వాళ్లు తీసుకుని ఒదిలేస్తుంటారు....''

మనోహర్రావులో సహనం సన్నగిల్లి పోతుంది. ఉక్రోషం పట్టలేకపోయాడు. చివాల్న లేచిపోయి ''నాకు చాలా ఆలస్య మయ్యింది. నేను వెళ్లాలి'' అంటూ ఆమె సమాధానమన్నా వినకుండా గబగబా వీధిలోకి వచ్చేశాడు.

ఆమె క్షణంపాటు తెల్లబోయి, అతర్వాత తెప్పరిల్లి, ఆ వెనకే వరండాలో కొచ్చి ''సరేలెండి, అన్నయ్యతో చెప్తాను యింత సేపూ కూర్చుని వెళ్లారని. వీలు చూసుకుని మరోసారి ఎప్పుడన్నా రండి'' అంది.

ఆమె మాటలు వినిపించనట్టు అతను వెనక్కు తిరగనైనా తిరగకుండా గబగబా వెళ్లిపోయాడు. ఆ వెళ్తున్న అతన్ని కొద్ది సేపు అరుగు మీద నుంచుని చూసి, తలుపులు వేసుకుని లోపలకు వెళ్లిపోయింది.

గబగబా వెళ్లిపోతున్న మనోహర్రావు చటుక్కున ఆగిపోయాడు. పెద్ద పెద్ద అంగలతో వెనక్కితిరిగి వచ్చాడు. మెల్లగా మెట్లెక్కి కిటికీ ముందు నుంచున్నాడు. గదిలో స్వచ్ఛిత—

మోకాళ్ల మీద వంగి టేబిలు కింద పడిపోయిన మూడు సంపంగి పూలనూ ఏరుకుని జాగ్రత్తగా, సుతారంగా చీర కొంగుతో వాటికి అంటుకున్న మట్టి తుడిచి లేచి నుంచుని, సంపంగి పూలన్నిటినీ దోసిట్లోకి తీసుకుని చాలాసేపు వాటినే చూస్తూ వుండిపోయి, ఆ తర్వాత పారవశ్యంతో మెల్లగా వాల్చిన కనురెప్పల మీద అద్దుకుని కొద్దిసేపు ఆ చల్లదనాన్ని, పరిమళాన్ని ఆస్వాదిస్తూ వుండిపోయింది. ●



కమ్యూనిస్టు దేశాలలో కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్

(గత సంచిక తరువాయి)

ఆర్. వెంకట్రామన్

జూలై 27వ తేదీ ఉదయం ఎనిమిది న్నర గంటకు కామరాజ్ స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలో అసువులు అర్పించిన వీరుల సమాధికి వెళ్ళి, "నగరాన్ని కాపాడిన వీరులకు" అని ప్రత్యేకించిన పుష్పవలయాన్ని సమాధికి అర్పించి అంజలి ఘటించారు.

కామరాజ్ చేసిన ఈ మర్యాద వాల్గాగ్రాడ్ పౌరులను ఆనంద పరవశులను చేసింది. కామరాజ్ పుష్పవలయాన్ని మృతవీరుల సమాధులకు సమర్పిస్తున్నారని తెలుసుకున్న పౌరులు ఆ దినం తెల్లవారే అక్కడ గుంపు కట్టారు. 'హిందు' పత్రిక ప్రతినిధి శ్రీ కె. రంగస్వామి ఒక వైపు, పి.టి.ఐ. ప్రతినిధి శ్రీ వాట్స్ మరొకపక్క నడవగా తెల్లటి ఖద్దరు దుస్తులు ధరించిన కామరాజ్ గంభీరంగా నడచివెళ్ళి, ఆ సమాధిపై పుష్పవలయం వుంచి, ఒక నిమిషం మౌనంగా నిలబడి, అంజలి ఘటించి నమస్కరించారు. ఆ ప్రశాంతత అక్కడ గుంపు జేరిన జనం కట్టుబాటుకు, క్రమశిక్షణకు దృష్టాంతంగానే కనిపించింది.

రష్యాలో పూవులకు చాల గిరాకీ. వాటి ఖరీదూ మనకు ఆశ్చర్యం కలిగించేట్టు వుంటుంది. మేము అర్పించిన పుష్పవలయం వెల ఐదువందల రూపాయలు! ఇక్కడ పూవులను పూయించడం, పూల చెండ్లను తయారు చేయడం, విక్రయించడం లాభసాటి వృత్తి. అప్పుడుగాని, నాకు, సమిష్టి క్షేత్రాలలో కార్మికుల కోసమని ప్రత్యేకించిన చెక్కలలో పూల మొక్కలు పెంచటంలోని ఆంతర్యం, వాస్తవం అర్థంకాలేదు.

సోవియట్ దేశంలో వ్యవసాయాభివృద్ధికి ప్రాతిపదికగా వుండేది యాంత్రిక వ్యవసాయ పద్ధతి. అందువల్ల అక్కడ ట్రాక్టర్ల ఉత్పత్తి విశేషంగా జరుగుతున్నది. రోజుకు 140—150 ట్రాక్టర్లు తయారుచేసే కర్మాగారం వాల్గాగ్రాడ్ నగరం సమీపంలో వుంది. కామరాజ్ ఆ కర్మాగారానికి వెళ్ళారు.

అక్కడ 25 అశ్వశక్తి మొదలు 290 అశ్వశక్తిగల ట్రాక్టర్లు తయారు అవుతున్నాయని కర్మాగార నిర్వాహకులు తెలిపారు. ఆ కర్మాగారంలో 11 వేలమంది కార్మికులు పని చేస్తున్నారు. కామరాజ్ ట్రాక్టర్లన్నిటినీ చూసిన తర్వాత కొత్తగా తయారయిన ఒక ట్రాక్టర్‌లో కూచుని ఆ కర్మాగారాన్ని చుట్టి వచ్చారు.

"యుద్ధకాలంలో ఈ కర్మాగారం ధ్వంసమయిందా?" అని ప్రశ్నించారు కామరాజ్. "దీనిని చాల జాగ్రత్తగా కాపాడుకున్నాము. కొన్ని భాగాలు మాత్రమే నాశనమయ్యాయి" అని నిర్వాహకులు సమాధానం చెప్పారు.

యుద్ధకాలంలో ట్రాక్టర్లకు మారుగా టాంకులు తయారు చేయబడినట్టు కూడా వారు తెలియజేశారు.

అమెరికాలో మోటారు కార్లను ఉత్పత్తి చేయడాన్ని "అసెంబ్లీ లైన్" అని అనడం కద్దు. అంటే కార్లకు అవసరమైన కొన్ని భాగాలు కార్మికులు పనిచేసే ప్రాంతానికి దగ్గరగా యంత్రాల ద్వారా వాటంతట అవే వస్తాయి. కార్ల 'చేసి'లుగూడా స్వయంగా నడిచే యంత్రాల ద్వారా ముందుకు పోతూ వుంటాయి. కార్మికుల వద్దకు "చేసి" రాగానే వారు ఒకభాగాన్ని దానికి అమర్చగానే ఆ 'చేసి' పక్కన వున్న కార్మికుని వద్దకు వెళ్ళుతుంది. అతనివద్ద మరొక విడిభాగం వుంటుంది. దానిని అతడు దానికి అమర్చుతాడు. ఇలాగే పెద్ద ఎత్తున కార్లు తయారవుతున్నాయి.

రష్యాలో ట్రాక్టర్ల వుత్పత్తి విషయంలో ఈ పద్ధతే అనుసరిస్తున్నారు. ఈ మూలంగా ఉత్పత్తి స్థాయి, ఉత్పత్తి ప్రమాణం ఈ రెండూ ఎక్కువ చేయబడుతున్నవి.

ట్రాక్టర్ ఉత్పత్తిశాల నుంచి, బయలుదేరి, వాల్గ్‌స్కి (Volghski) లో వున్న ప్రపంచంలోని పెద్ద జల విద్యుచ్ఛాలలలో ఒక్కటయిన "వాల్గా జల విద్యుచ్ఛాల"కు వెళ్ళాము. బ్రహ్మాండమైన వాల్గా నదికి అడ్డంగా పెద్ద ఆనకట్ట కట్టారు. కాని, వాల్గా నదిలో పడవల రాకపోకలకు అడ్డు లేకుండా, వేరుగా దారి వదిలి పెట్టారు. ఈ జలవిద్యుత్కేంద్రం 20లక్షల కిలో వాట్ల విద్యుచ్ఛక్తిని తయారు చేస్తుంది. దీనిలో 22 విద్యుదుత్పాదక యంత్రాలు వున్నాయి.

ఈ వాల్గా ఆనకట్టవల్ల విద్యుదుత్పత్తి మాత్రమే కాక, వ్యవసాయానికి అవసరమైన నీటి వసతులు కూడా కల్పించారు.

వాల్గాగ్రాడ్ నగరాన్ని గురించి తలచుకున్నప్పుడు, ఆ నగరంలో వున్న బృహత్తరమైన లెనిన్ శిలా విగ్రహం అందరికీ జ్ఞాపకానికి వస్తుంది. యుద్ధం ముగిసిన తర్వాత సోవియట్ శిల్పి ఒకరు బ్రహ్మాండమైన లెనిన్ విగ్రహాన్ని అక్కడ స్థాపించారు. ఆ శిలా విగ్రహాన్ని చూసిన వెంటనే కామరాజ్ "రష్యాలో లెనిన్ విగ్రహం అన్ని చోట్ల ఒక విధంగానే వుంది. రూపంలో మార్పు లేదు. అయితే మన దేశంలో గాంధీజీ విగ్రహాలు స్థలానికొక రీతిగా వుంటాయి. దానిని మనం అనుమతించడం పొరపాటు. శిల్పకళలో మహోన్నతి సాధించిన భారతదేశంలో ఇలాటి పొరపాటు జరిగి వుండ కూడదు." అని విచారపడ్డారు.

వాల్గాగ్రాడ్ నగర పర్యటన ముగించుకొని, విమానాశ్రయానికివచ్చి, కామరాజ్‌తో విమానం బయలుదేరడానికి ముందు వాల్గాగ్రాడ్ మేయరు మాట్లాడుతూ ఇట్లన్నారు.

"ప్రపంచంలోని అన్ని పెద్ద నగరాలతోను మేము సంబంధం పెట్టుకున్నాము. మేము ఆ విధంగ స్నేహ సంబంధం పెట్టుకున్న నగరాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు, అక్కడి ప్రముఖులను ఇక్కడికి ఆహ్వానించడం, అక్కడికి మా ప్రముఖులు వెళ్ళడం వంటి సరాసరి సంబంధాలు పెట్టుకున్నాము. ఆ పద్ధతిలో, మద్రాసు— వాల్గాగ్రాడ్ సంబంధాలు ఏర్పడాలని వాంఛ

ఉన్నారని అన్నారు కామరాజ్.

"చాలా కృతజ్ఞతలు. అలాంటి సంబంధం ఏర్పాటు చేయడానికి మేము కూడా ప్రయ త్నం చేస్తున్నాము" అని సమాధాన మిచ్చారు కామరాజ్.

ఎక్కువ సేపు ఆయనతో ప్రయాణం చేసినది ఇల్యూషిన్ విమానం. ఆ విమా నంలో రెండు గదులున్నాయి. ఒకదాంట్లో సీట్లు, సాధారణమైన విమానాలలోలాగ ప్రయాణం చేయడానికి కొన్ని కుర్చీలు వుండేవి. మరొక గది వ్రాయడానికి మేజా బల్ల, అనుకుని పడుకోవడానికి అనుకూల మైన కుర్చీలు, పడుకోడానికి పరుపులు మొదలయిన సకల సౌకర్యాలు వున్నవి.

విగతు భోజనానంతరం కామరాజ్ కొంత సేపు విశ్రాంతి తీసుకున్నారు. మరొక గదిలో రష్యా ప్రతినిధి అధికారులు, మన దేశం ప్రతినిధి అధికారులు, రష్యా అధి కారులు వున్నారు. భోజనానంతరం మేము ఆ గదికి వెళ్ళి, వారితో సంభాషించాము. మేము అనేక విషయాలను గురించికూడా చర్చించాము. ఆ మాటల సందర్భంలో నేను, చాలకాలంగా నాకు మనస్సులో వున్న ఒక సమస్యను అడిగాను—

"మీరా సోవియట్ దేశాన్ని ఇంతవరకు అంధకారమయంగానేచేశారు(చీకటిలోవుంచారు. వెలుపలి దేశాల నుంచి మీదేశాన్ని చూడ టానికో, మీ దేశంలో కొంతకాలం వుండ టానికో, మీరు అనుమతించేవారు కారు. దానికి తగిన వసతి కూడా చేయలేదు. అదేవిధంగా రష్యా ప్రజలకై విదేశాల అంటే అలక్ష్యం వుండేది. ఈ నిర్బంధాల వల్ల, కట్టుబాట్లవల్ల, వున్న దిట్టాల వల్ల ప్రపంచంలోని ఎక్కువ దేశాలలో మీ దేశాన్ని గురించి అపవాదు వ్యాపించి వుంది. రష్యా అంటే, 'ఇనుపతెరదేశం' అని చెప్పడానికి మొదలు పెట్టారు. ఈ స్థితికి కారణ మేమిటి? ఎందుకు ఇలాటి పరిస్థితి ఏర్పడింది?" అని ప్రశ్నించాను.

దీనికి ఆ గుంపులో వున్న వారొకరు చాల చక్కని సమాధానం చెప్పారు.

"రష్యాలో విప్లవం జరిగిన వెంటనే ఎక్కువ దేశాలు మా దేశం మీద దండెత్తి వచ్చి, మా విప్లవాన్ని పరాస్తం చేయడానికి ప్రయత్నించారు. అంటే, వెలుపలి నుంచి వచ్చేవారు - ఏదైనా కల్లోలం కలిగిస్తా రేమో నన్న భయం మాకు వుండేది. మా దేశంలో, పాత సాంఘిక వ్యవస్థను కూలదోసి, నూతన సాంఘిక వ్యవస్థను నెలకొల్పుకోవడానికి ప్రయత్నించినప్పుడు, దాని వదిలించుకొను పాత కష్టం చుట్టు, మానవ్య రాబడిన ఒక పక్క కుట్రగా వది అస్తవ్యస్తంగా వదిలించేవి. కొత్తగా పడుతున్న కష్టం ఇంకా పూర్తికాక అరకొరగా వుండేది. మా కొత్త మేడకు పునాది మాత్రమే వేశాము. పైకప్పు వేయ కుండా పెట్టలేదు. ఈ అరకొర కట్టడాలను వచ్చిపోయే ఒక్కొక్కరు చూసి తప్పుగా మాట్లాడ తారు అనుకున్నాము. కొత్త మేడ ఇప్పుడు పూర్తి అయింది. మీరు వచ్చి చూడవచ్చు అనుమతి



ట్రాక్టర్ల కర్మాగారంలో కామరాజ్

స్తాము. మీరా పరిశీలకులు పైగా విదేశీ యాత్రికులు ఇప్పుడు సోవియట్ దేశానికి వస్తున్నారు." అన్నారు.

విదేయంత్రత్వం లాంటి మాదే ఒక దేశంలో ఒక నూతన సాంఘిక వ్యవస్థను నెలకొల్పడానికి వారికి పలకొక్క సంవత్సరాలు పట్టింది. అలాంటప్పుడు, ప్రజలు తమం తట తాము నూతకరించి కృషిచేసి, ప్రజా స్వామ్య పద్ధతిలో కొత్త సాంఘిక వ్యవస్థను నెలకొల్పడానికి పాటుపడుతున్న మన భారత ప్రజానీకం ఇరవై సంవత్సరాలలోగా, ఎందుకు పురోగమించలేదని కొందరు ప్రశ్నించడం. ఎంత అర్థరహితమైనది అని నాకు తోచింది.

"మీ దేశంలో ఎందుకు ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వలేదు? ప్రజాస్వామ్య వ్యవ స్థలో ప్రతిపక్షాలు ఏర్పడి వుండడం ఆ దేశ పురోభివృద్ధికి అవశ్యకమని మీరు గుర్తించలేరా?" అని అడిగాను.

దీనికి సమాధానంగా ఆయన పెద్ద వ్యా ఖ్యానమే ఆరంభించారు.

"ప్రపంచంలో పాశ్చాత్య దేశాల పరిస్థితి, తక్కిన దేశాల పరిస్థితి విభిన్నమైనవి. ఇతర దేశాలలో ఆస్తిపాస్తుల అధికారం కల వారు అని, ఆస్తిపాస్తుల అధికారం లేనివారు అని జనం రెండు విధాలుగా వున్నారు. వారి అధికారాలను, హక్కులను రక్షించడానికి పార్టీలు అవసరం. కాని సోవియట్ దేశంలో ఆస్తి అధికారం కలవారని ఆస్తి అధికారం లేనివారని రెండు తెగలు లేవు. దేశంలో వున్న సంపద అంతా ప్రజ లది. దానిని ఉత్తమ పద్ధతిలో అభివృద్ధి చేసి, ప్రజల ఉత్తమ జీవితకోసం పాటు పడడం ప్రజలందరి కర్తవ్యం. మాదేశంలో ఏమైనా, వ్యక్తిగతంగా ఆస్తిపాస్తులపై అధి కారం లేనందున, వాటి హక్కుల రక్షణకు గాని, వాటి పక్షాన వాదించడానికిగాని పార్టీలు అవసరంలేదు. అందువల్లనే, మాదేశంలో ప్రతిపక్షాలు లేవు" అని వివ రించారు.

అమ్మాయ్! ఇనుపతెర వెనుక ఎన్ని విష యాలు వున్నాయి!

(సశేషం)

—అనువాదం: వి. రా.

(ఆనందవికటన్ సౌజన్యంతో)

సుప్రభాతం

(సీరియల్)

రంగధామ్

జరిగిన కథ

సత్యమూర్తి, ప్రకాశం చిన్ననాటి స్నేహితులు. చాలాకాలానికి అనుకోకుండా కలిశారు. నిరుద్యోగిగా వున్న సత్యమూర్తికి రామవరం షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగమిస్తానని చెప్పింటాడు ప్రకాశం. సత్యమూర్తి అక్కడికి వెళ్ళేముందు లెక్చరరు అనంత రామయ్య, అతని కుమార్తె ఉమను కలుసుకున్నాడు. రామదాసుగారి దగ్గరకెళ్ళినప్పుడు ఆయన తన కథ కొంత చెప్పారు. మర్నాటి ఉదయానికల్లా ఆయన్ని ఎవరో పొడిచి, దాచుకున్నదంతా దోచుకుపోయారు. సత్యమూర్తి చెల్లెలు కళ్యాణి ఎక్కడికో వెళ్ళిపోయింది. అతను తల్లిని తీసుకుని రామవరానికి మకాం మార్చి, షుగర్ ఫ్యాక్టరీలో అకౌంటెంటుగా చేరాడు.

4

వాళ్ళిద్దరూ ఇంటి దగ్గరకు వెళ్ళే సరికి, కామయ్యగారే వారి కెదురు పడ్డారు. ఆయన చాలా లావుగా, ఎర్రగా వుంటారు. పెద్ద పొట్టమీద, ఆయన శరీరమంతా భారీగా కన్పించి, తల మాత్రం చిన్నగా, కన్పిస్తుంది. మొహంలో మంచి తనంతో కూడిన మందహాసం చూసేవారిలో ఆయ నంటే ఒక సద్భావం కలిగిస్తుంది. వీరిద్దరినీ ఆయన ఆహ్వానించాక, సూర్యం కుమారస్వామిగారి కొక ఇల్లు కావాలని అనగా వారింట్లో ఖాళీగా వున్న భాగం చూపించారు. కుమారస్వామికది, తన కుటుంబానికి సరిపోదనిపించినా, కామయ్యగారు, 'ఇల్లంతా మీరు ఉపయోగిస్తుండచ్చును. ఈ వరండాలూ, మండువా, అన్నీ వాడుకుంటూ వుండవచ్చు. మాది చిన్న కుటుంబం' అని చెప్పాక, నచ్చింది. ఆ తరువాత వాళ్ళిద్దరినీ కూచోబెట్టి కామయ్యగారు మాట్లాడడం మొదలెట్టారు.

"నేనూ వెనక భారీగా వ్యాపారం చేసిన వాణ్ణే. కలకత్తాకి బోలెడన్ని వేగన్లు మూనె సరఫరా చేసాను. మా బ్రాంచి ఆఫీసు ఒకటి కలకత్తాలో వుండేది. రైల్వే హోటల్సుకు కూడా సప్లయ్ చేసేవాళ్ళం. అప్పు డిక్కడ బోలెడంత ఆర్భాటం వుండేది. నలుగురు గుమాస్తాలూ, వందమంది కూలీలూ ఎప్పుడూ వుండేవారు. ఇన్‌కంటాక్సు గొడవల వల్ల అన్నీ మానెయ్యవలసి వచ్చింది. ఇప్పుడు ఏదో చిన్న కమీషన్ వ్యాపారం చేసుకుంటున్నాను" అని ఆయన తన గురించి వివరాలు చెప్పుకున్నారు. అవి విన్నాక, కుమారస్వామీ, సూర్యం, ఆయన ప్రస్తుత పరిస్థితికి సానుభూతి చూపించి ఆయన వద్ద సెలవు తీసుకుని వచ్చేశారు.

దారిలో "ఆయన చాలా మంచాయనలా వున్నారు. పాపం వ్యాపారంలో దెబ్బతిన్నారు." అన్నాడు కుమారస్వామి.

"అబ్బే ఆయన చాలా ఉపకారస్థులు. ఆయన వ్యాపారం బాగా జరిగిన రోజులలో రోజుకి ఆయనింట్లో ఎంతమంది భోజనం చేసేవారో లెక్కలేదు. బోలెడంత మంది బంధువుల్నీ, స్నేహితుల్నీ ఆదరించేవారు. ఇప్పటికి ఎవడైనా బీద బ్రాహ్మణుడు గనుక ఈ వూరొస్తే, ఈయనింట్లోనే మకాం. తనెన్ని ఇబ్బందులలో వున్నా కాదనరు." అన్నాడు సూర్యం.

"అయితే వ్యాపారంలో దెబ్బ తినడం వలననే ఆస్తంతా పోయిందా? అసలు అలాటి వాళ్ళు వ్యాపారంలోకి దిగకూడదు."

"ఈయన తప్పేమీ లేదండీ. ఈయన తన మేనల్లుణ్ణి ఒకణ్ణి చేరదీసి, వాడికి తన వ్యాపారంలో భాగమిచ్చారు. అతను కలకత్తాలో బ్రాంచి మేనేజరుగా వుండేవాడు. ఉన్నట్లుండి హఠాత్తుగా అతను పరారై పోయాడు, తోపలికి ఒకలక్ష రూపాయలు ఎగవామం పెట్టి. అతను ఎక్కడున్నాడో ఎవరికీ తెలియదు. అందువల్ల ఈయన చాలా దెబ్బతిన్నారు. అదీగాక, ఒక్కసారిగా లక్ష రూపాయలు ఇన్‌కంటాక్సు వేసారు. దానికి తట్టుకోలేకపోయారు."

"మంచివాళ్ళకే కష్టాలు వస్తాయి."

"అసలీయన బాకీదారులు, ఈయనను అరెస్టు చెయ్యించాలని చూశారు. కాని, ప్రకాశంపూనుకోవడం వలన, ఈయననెవరూ ఏమీ చెయ్యలేకపోయారు. అందర్నీ అతను, 'ఈయన నుండి రాబట్టుకోవలసిన వన్నీ పరిష్కారం ద్వారా రాబట్టుకోండి' అని హెచ్చరించాడు. అతని మీద గౌరవం కొద్దీ వూరుకున్నారు."

"అయితే ప్రకాశంలో ఉపకార బుద్ధి కూడా వుందన్నమాట."

"అబ్బే. అతను తల్చుకుంటే ఎంతైనా చెయ్యగలడు. అతనిలో మంచికి మంచి వుంది, చెడుకు చెడూ వుంది. పట్టు పట్టాడంటే బ్రహ్మదులు వచ్చినా తిరుగు లేదు. వ్యాపారంలో దెబ్బతిన్నాక, కొన్ని నెలలు నానా అవస్థలు పడి, చివరికి అప్పుల వాళ్ళ బాధలు భరించలేక ఒకనాడు కామయ్యగారు వెళ్ళి ప్రకాశం కాళ్ళ మీద పడ్డారట. తన అవస్థంతా చెప్పుకున్నాడట. 'మీకేం భయంలేదు. మిమ్మల్నెవడూ అరెస్టు చెయ్యలేడు. అప్పులన్నీ తీరికగా పరిష్కారం చేద్దాం.' అని ధైర్యం ఇచ్చాడట. అందువల్ల అప్పుల వాళ్ళు ఈయనవేమైనా చెయ్యడానికి జంకుతారు."

"అయితే ఈయన పేరేమైనా ఆస్తి వుందా?"

"లేకేం. ఆయన వుంటున్న ఇల్లు ఏళ్ళై వేల రూపాయలకు తాకట్టులో వుంది. అదిగాక రోడ్డు కవతల సుమారు రెండెకరాల స్థలం నాలుగు గోడౌన్లూ వున్నాయి. ఇల్లు భార్య పేర వుంది. తక్కిన స్థలం గోడౌన్లూ, గవర్నమెంటువారు వేలం వేస్తుంటే, ప్రకాశం నిలబడి, పాట మూడు వేలకు పైగా వెళ్ళకుండా చూసి, కామయ్యగారి చుట్టం ఒకాయన పేర కొనిపించాడు. దాంతో ఇన్‌కంటాక్సు గొడవ తప్పిపోయింది. ఆ చుట్టం తరువాత ఆస్తిని కామయ్యగారి అల్లుడి పేర మార్పించాడు."

సూర్యం, కుమారస్వామీ కబుర్లు చెప్పుకుంటూ, స్టేషను దాకా వచ్చారు. అక్కడ ఇద్దరూ విడిపోయారు. కుమారస్వామి మెల్లిగా నడుచుకుంటూ డిపో వద్దకు వెళ్ళాడు. సూర్యం క్లబ్బువైపు వెళ్ళాడు. డిపోకు దగ్గరలో ఒకగది తీసుకుని వుంటున్నాడతను, ఈ నెల రోజుల్నుంచీ, అతను భోజనమయ్యాక గదిలో ఒక్కడూ కూర్చుని ఆలోచించ సాగాడు, సిగరెట్లు కాలుస్తూ.

నెలరోజుల్నుండి అతను ఆపల్లెటూరులో అనేకమంది వ్యక్తుల్ని కలుసుకున్నాడు. అందరి మాటలలోనూ ప్రకాశం గురించి వస్తూనే వుంది. ఆ వూరి ప్రజల జీవితాలపై అతని ప్రభావం స్పష్టంగా కన్పిస్తోంది. రాజకీయాలు, జీవితంలో ముఖ్యపాత్ర వహిస్తున్న సంఘంలో, రాజకీయంగా కూడా నాయకుడైన ప్రకాశం అందరి మన్ననలనూ పొందడం ఒక విశేషం కాదు, కాని ప్రజలకు, ప్రకాశం అంటే ముఖ్యంగా కన్పిస్తున్నది భయం. అతని మాటలయందు పైకి శ్రద్ధ చూపించినా, లోపల ఆవ నమ్మకం, అతను చేసే ప్రతి పనిలోనూ

ఏదో స్వార్థం దాగుందని, తాము అమాయ
కులమై అతని ననుసరిస్తున్నాము కాని,
తమని అవసరమైతే నట్టేట్లో ముంచ
డానికి అతను వెనుదియ్యడని వారి విశ్వాసం.
అయినా అతని ననుసరించకపోతే ఏం చేసే
స్తాడోనని బెంగ. పైగా ప్రకాశం ఒక్క
రాజకీయరంగంలోనే కాక అన్నిరంగాలలోనూ
నాయకుడే. వ్యాపారంలో అనేక మార్గాల
ద్వారా విజృంభిస్తున్నాడు. ఆ మార్గాలలో
అతనిని ఎవ్వరూ అనుసరించగలరని తోచదు.
దానికి మొదటి పెట్టుబడి దామోదరం
బుర్ర! లక్షరూపాయలకు ఇన్సూర్ చేసిన
గోడవును, ప్రకాశం మిల్లులోది, హఠాత్తుగా
తగులబడిపోయి, ఆ సొమ్మంతా కంపెనీ
వాళ్ళు ప్రకాశం కివ్వారంటే, ఆ గోడవును
కాల్పించడంలోనూ, ఇన్సూరెన్సు ఇన్‌స్పెక్టర్
దగ్గర్నుంచి అనుకూలమైన రిపోర్టు లాగ
డంలోనూ, దామోదరం చూపించిన అసా
ధారణమైన ప్రజ్ఞే కారణమని అందరికీ
తెలుసు. మద్రాసులో, ఒక సరుకును విదే
శాల కెగుమతి చేసుకోడానికి, పుట్టించిన
పర్మిట్లు, తను కెలాంటి ఇబ్బంది లేకుండానే,
చేతులు మారిపోయి, కొన్నివేలు సునాయా
సంగా ప్రకాశం చేతుల్లో పడ్డాయంటే,
అది దామోదరం తెలివికి చాలా చిన్న ఉదా
హరణ అని అందరి ఏకాభిప్రాయం. ఇలాం
టివి అతను ఎన్ని చేస్తున్నాడో లెక్కలేదు.
అధికార్లనూ, ఆఫీసులలోని వాళ్ళనూ,
డబ్బుతో, 'పార్టీ' లతో, మరే మార్గం
తోనైనా, కావలసినవి సప్లయ్ చేసి, పట్టు
డంలో, దామోదరానికి ఎవరూ సాటిరారు.
అదేవిధంగా, ఆ వూరిలో ఏది జరగాలన్నా
ముందంజ ప్రకాశానిది. ఆ వూరికి,
హైస్కూలు రావాలంటే, ఊరూరా ఆచుట్టు
ప్రక్కల గ్రామాలలో తిరిగి చందాలు,
వసూలు చెయ్యటంలోనూ, అటు అధి
కార్లను పట్టుకొని హైస్కూలు శాంక్షన్
చేయించటంలోనూ ప్రకాశం పాత్ర ప్రముఖ
మైనది. అందువల్లనే హైస్కూలు కమి
టీ అతను అధ్యక్షుడవడం, దాని బిల్డింగు
కంట్రాక్టు దామోదరం చేతిలో పడడం,
బిల్డింగూ పూర్తయినా, మిగిలిపోయిన ఏభై
వేలు ప్రకాశం వద్దనే వుండడం, దానినతా
బ్యాంకులో వుంచినట్లు చూపిస్తూనే,
తన వ్యాపారంలో త్రిప్పుకుంటున్నా కమిటీ



సుప్రభాతం

మంబర్లెవరికీ అడిగే సాహసం లేకపోవడం జరిగింది. ఆ వూళ్ళో ఒక దేవాలయం కట్టాలన్నా ప్రకాశం పూనుకోవాల్సిందే. ఒక క్రొత్త కాఫీహోటలు పెట్టదల్చుకుంటే, ఆ ప్రొప్రయిటరు వచ్చి, సవినయంగా ప్రకాశానికి మనవి చేసుకుని, అతని అనుజ్ఞ పొందాక, తన పని ఆరంభించాలి. లేకపోతే వాడి పని దివాలాయే. అందరికీ, ప్రకాశం ఎంత పనైనా చెయ్యగలడని నమ్మకం ఏర్పడి పోయింది. ఆ పల్లెటూరి జీవితంలో ప్రకాశం నీడ ప్రతిచోటా కన్పిస్తోంది.

మరొక ఆలోచన కుమారస్వామిని బాధించింది. తరతరాలుగా భారతదేశంలో, కాలం ఎన్నిమార్పుల్ని తెస్తున్నా, స్థిరంగా నిలిచి పోయింది పల్లెజీవనం. ఆ గ్రామ జీవితం, స్వాతంత్రం వచ్చాక మెల్లిగా మార్పు చెందుతోంది. ఆ మార్పును అభివృద్ధి అనటం కన్నా, పతనమే అనుకోవలిసి వస్తుందేమో ననిపించిందతనికి. పల్లెల వాతావరణంలోని ప్రశాంతతను క్రమంగా దురాశా, మోసం ఆక్రమించుకుంటున్నాయి. కామయ్యగారు వ్యాపారంలో తనొక గొప్పవాడినై పోవాలనే ఆత్రంతో తను అమ్మిన సరుకులలో బోలెడు కల్తీ చేశారు. అది ఫలించక ఎదురు తిరిగింది. ఆ వూళ్ళో బాగుపడిన వాళ్ళ కొందరి చరిత్రలు చూస్తుంటే, కల్తీ వ్యాపారం, దగా, మోసం, అనేవి వాళ్ళ జీవిత లక్ష్యాలుగా కన్పిస్తున్నాయి. అందర్నీ మించిన వాడు ప్రకాశం. రైతుల దగ్గర నుంచి, "మీకు మంచి ఇరిగేషన్ ప్రాజెక్టులు తెప్పిస్తా"నని చందాలు వసూలు చేసి, ఇదుగో, అదుగో అంటూ, సొమ్మును స్వాహా చెయ్యగల సమర్థుడు. అలాంటి నాయకుల చర్యలు ప్రజలకు ఎన్ని అభివృద్ధి పథకాలు వచ్చినా, తాము అభివృద్ధి చెందుతామనే ఆశ లేకుండా చేస్తున్నాయి. వాళ్ళను, శతాబ్దాలుగా ఆవరించిన, నిద్రలోంచి, మేల్కొలిపి, వారి జీవితంలో క్రొత్త వికాసం తెద్దామనుకున్న మహానాయకుల ఆశయాలెంతవరకూ ఫలిస్తాయా? అన్న సందేహం వచ్చింది కుమారస్వామికి. అలా ఆలోచిస్తూనే అతను నిద్ర పోయాడు.

* * *

సత్యమూర్తి నిద్రలేస్తూనే దిగులుగా కాస్సేపు కూచున్నాడు. అతనికి చెల్లెలు కలలో కన్పించింది. అయితే ఆమె నవ్వుతూ సంతోషంగా కన్పించింది కాబట్టి, అది పెద్ద కలేమీ కాదు. కాని మూడేళ్ళ నుండి ఎన్నిరకాల ప్రయత్నాలు చేసినా ఆమె ఆచూకీ తెలియలేదు. తను రామవరం వచ్చి మూడేళ్ళయింది. తనూ తల్లీ, ఇక్కడ వుంటున్నారేగాని, చెల్లెల్ని తలవని క్షణం లేదు. చెల్లెలు, ప్రాజ్ఞత వచ్చిందీ, చదువు కున్నదీ అన్న ధైర్యం ఒకవైపున వున్నా, తను ఆమెకు సకాలంలో వివాహం చెయ్యలేక పోయాననే దిగులు అతనిని బాధిస్తూనే వుంది. తల్లి, చాటుగా కన్నీరు పెట్టుకోవడం అనేకసార్లు తను చూసాడు. అయినా తను చెయ్యగలిగిందంతా చేస్తున్నాడు. ఇక మిగిలిందల్లా తను వుద్యోగం వదులుకొని, దేశమంతా చెల్లెలి కోసం గాలిస్తూ తిరగడమేనూ. దానివల్ల ప్రయోజనం వుంటుందని బుద్ధిమంతుడెవడూ అనుకోడు. అంతేకాక తను తప్పనిసరిగా వుద్యోగం చెయ్యవలసిన పరిస్థితులు కొన్ని ఏర్పడ్డాయి. వాటిని తప్పించుకోలేక ఉద్యోగం చేస్తున్నాడు. తను గానుగెద్దులా పని చేస్తున్నాడు. అతని పనిని ప్రకాశం మెచ్చుకుని జీతం ఎక్కువ చేశాడు. చెల్లెలు తన దగ్గరుంటే ఎలాగో ఒకలాగ ఆమె వివాహాన్ని జరిపించి వుండేవాడు. మరి ఏ కారణం చేత ఆమె ఆపని చేసిందో భగవంతునికే ఎరుక. పోనీ ఎవరినైనా ప్రేమించి ఆ వ్యక్తితో కలిసి ఎక్కడికైనా వెళ్ళిందేమో అనుకోడానికి, అటువంటి ఉద్దేశం వుంటే తనకు తెలియ జెయ్యొచ్చుగా. తను కాదన్నప్పుడు కదా అలాంటి సాహసం చెయ్యాలి. అయినా అది కారణమనిపించటం లేదు.

"లేచావా నాయనా! కాఫీ తయారుగా వుంది, రా!" అన్న తల్లి మాటలు విని, మొహం కడుక్కోడానికి బయల్దేరాడు.

కాలకృత్యాలు తీర్చుకుని సత్యమూర్తి, ఆఫీసు కెళ్దామని బయల్దేరుతూంటే, గుమ్మంలోకి రాగానే ఎదురింట్లో ఒక సుందర దృశ్యం కన్పించింది. సుమారు పద్దెనిమిది సంవత్సరాలు వయసు కల ఒక అందమైన అమ్మాయి ఎదురింటి గుమ్మంలో నిలబడి తనకేసి చూస్తూండటం గమనించాడు. ఆమె డాక్టరు గుణనిధిగారి అమ్మాయి అయి వుంటుందని అనుకొని, తలవంచుకుని ముందుకు సాగిపోయాడు సత్యమూర్తి. వారంరోజుల క్రిందటే ఆ యింట్లో ప్రవేశించాడు. అంతకుముందర మరొక ఇంట్లో వుండేవాడు. కొత్త యింట్లోకి ప్రవేశించిన దగ్గర నుండి, డాక్టర్ గుణనిధిగారితో పరిచయం ప్రారంభమైంది. ఆయనకు

కూతుళ్లనీ, పెద్ద కూతురికి పెళ్లయిందనీ, రెండవ కూతురు విశాఖపట్నంలో చదువుతోందనీ, మూడవ అమ్మాయి ప్రయివేటుగా మెట్రిక్‌కు కట్టిందనీ, తల్లి ద్వారా విన్నాడు. ఈ అమ్మాయే మూడవ అమ్మాయి అయి వుంటుందనుకున్నాడు.

ఆఫీసుకు వెళ్లే ముందర ఒకసారి ప్రకాశం ఇంటికి వెళ్లి, తరువాత ఆఫీసుకు వెళ్లడం అతని అలవాటు. ప్రకాశం వూరిలో లేడు. అతని ఇంటిలో ముందు గదులన్నీ ఆఫీసు గదులు. అందులో ఒకదానిలో దామోదరం, మరి యిద్దరూ కూర్చుని మాట్లాడుతున్నారు. అది ఒకవిధమైన ప్రత్యేక గది. అందులో జరిగే సంభాషణలు పైకి విన్పించవు. సత్యమూర్తికి ఎక్కడికి వెళ్లడానికైనా అడ్డులేదు. మరొకరు ఆ గదిలోకి వెళ్లడానికి సాహసించరు. దామోదరాన్ని కలుసుకోవడానికి వెళ్లాడు. మూర్తిని చూసి మిగతా వాళ్లు మాట్లాడడం మానేశారు. దామోదరం, "ఏమప్పా! ఎవరు వచ్చింది, నిన్న?" అని అడిగాడు. దామోదరం, నల్లగా, లావుగా వుంటాడు. పొట్ట చాలా పెద్దది. ఎప్పుడూ సాధారణంగా చుట్ట కాలుస్తూంటాడు. నవ్వుతూనే మాట్లాడుతాడుగాని, అతని మనసులో ఏముందో కనిపెట్టడం బ్రహ్మతరంకాదు. తల నెరిసింది. మొహం గుండ్రంగా వుంటుంది. కళ్లు చిన్నవి, కాని ఎదుటి మనిషిని నిశితంగా పరిశీలిస్తాయి.

"కొత్త లేబరు ఆఫీసరు. ఏవో రిపోర్టులు విచారించడానికి వచ్చానన్నాడు. ప్రకాశం వూళ్లోలేడని చెప్పాను. మేనేజరుతో మాట్లాడడానికి వస్తాడట ఇవ్వాళ ఫ్యాక్టరీకి."

"ఎవరా రిపోర్టులు పంపింది?" అన్నాడు మిగిలిన ఇద్దరిలోనూ ఒకతను. అతని పేరు రంగారావు. అతనికి ముప్పై ఏళ్లుంటాయి. ఎప్పుడూ వేళ్ల మధ్యన సిగరెట్టుంటుంది. సిల్కు చొక్కా, సిల్కు పంచె వేసుకుంటాడు. ఉంగరాల జుట్టూ, కోల మొహం, ఆ మొహంలో ఒక కర్కశత్వం కనిపిస్తుంది. అతనితో వున్న మరొక వ్యక్తి పేరు బదరి. అతనికి ముప్పై అయిదేళ్లుంటాయి. చూడటానికి సౌమ్యంగా వుంటాడు. అవసరమైతే ఎంతటి దారుణాలైనా గప్‌చుప్‌గా చేసేస్తాడు.

"ఎవరో ఇద్దరు వర్కర్లు చాలా అవిధేయతతో ప్రవర్తిస్తున్నారని అమధ్య మేనేజరుగారన్నారు. వాళ్లు రికమెండేషను మీద వచ్చారట. అందువల్ల ప్రకాశం వూరు నుంచి వచ్చాక వాళ్ల గురించి మాట్లాడుతానంటున్నాడు. బహుశా వాళ్లే అయివుండొచ్చు."

"వాళ్లను రెండు తన్ని తగిలెయ్యక, ఏమిటి మాట్లాడేది?" అన్నాడు రంగారావు. బదరీ కూడా తలూపాడు.

"సరే నేను పోయి వాడితో మాట్లాడుతాలే. నిన్న నీతో చెప్పినదేం చేశావ్?" అని దామోదరం సత్యమూర్తి నడగ్గా సత్యమూర్తి తన జేబులోంచి ఒక కాగితం తీసిచ్చాడు. అది చూసి దామోదరం తలూపాక సత్యమూర్తి బయటకు వెళ్లిపోయాడు.

"అసలిది కూడా వాడి పనే అని నా అనుమానం." అన్నాడు రంగారావు. దామోదరం, బదరీ అతని వైపు చూశారు. "ప్రకాశం ఫ్యాక్టరీలోని వర్కర్స్‌ని నందర్నీ ఎదురు తిరిగేట్లు చేసి, ఫాక్టరీ నడవకుండా చేస్తానన్నాడట, వెంకయ్యతో. ఇహ వోపిక పట్టే లాభంలేదు. మీరు 'ఊ' అనండి, రెండు నెలలు మంచం మీద నుంచి లేవకుండా, చావగొట్టించేస్తాను" అన్నాడు, రంగారావు వుద్రేకంతో, ఎవరినో ఉద్దేశించి.

దామోదరం ఒక నిముషం చుట్ట కాల్చడంలో నిమగ్నుడయ్యాడు. రంగారావూ, బదరీ అతని వైపు శ్రద్ధగా చూశారు. అతని మొహంలో నిశ్చలత ఎక్కువైంది. అంటే ఆలోచిస్తున్నా డన్నమాట.

"వాడి కిద్దరు గుమాస్తాలున్నారు కదూ. వారిలో వీరయ్య అని ఒకడున్నాడు. వాడితో నేను మాట్లాడాను. అప్పలనాయుడి పేర ఇరవై వేలదాక వాడి ఖాతాలో జమ వుందిట. అదంతా బ్లాకులో గడించిన సొమ్ము. రెండేళ్ల నుంచీ అలాగే వుందిట. మళ్లీ ఖర్చు రాసే అవకాశం రాలేదుట. అందుకని అప్పలనాయుడిని పిలిపిస్తున్నాను."

"అంటే ఆ సంగతి నాయుడికి తెలియదా?"

"ఊహూ. ఇద్దరూ, మొన్నటి దాకా చాలా జోస్తీగా వున్నారు కదురా. ఇప్పుడంటే నాయుడు మన చుట్టూ తిరుగుతున్నాడుగాని, మొన్నటి దాకా సత్యం వెనకాలే తిరిగాడుగా. అందుకని తను ఎలాచెప్తే అలా వింటాడు కదా అని, వాడు తీసుకొచ్చి జమ కట్టినట్లు రాశాడుట. అసలిప్పుడు నాయుడికి డబ్బు కూడా అవసరం. అందుకని వెంటనే వాడి మీద దావా వేసి, ఆ డబ్బు వసూలు చేద్దాం." అన్నాడు దామోదరం.

"భేష్!" అన్నాడు బదిరి.

"రైట్! ఇరవై వేలు కక్కాలంటే వాడికి ప్రాణం పోతుంది" అన్నాడు రంగారావు, దామోదరం తెలివిని మెచ్చుకుంటూ.

"అదేనప్పా! వాడి దగ్గర ఇప్పుడు డబ్బెక్కువ లేదు. అంతా డాబు. అదొక్కటే కాదు. ఇంకా వీరయ్య ఇచ్చిన 'ఇన్‌ఫర్మేషనంతా' ఇన్‌కంటాక్సు ఆఫీసరుకు అందచేశాను. ఆఫీసరు రేపోమాపో వచ్చి వీడి సంగతేదో తేలుస్తాడు. సేల్సుటాక్సు ఆఫీసరుకు కూడా కావలిసినంత మేత వుంది వీడి అక్కౌంట్లలో."

"అదే మంచిది. తన్నడంకన్నా, అలాగే వాణ్ణి రూపుమాపాలి" అన్నాడు బదిరి. రంగారావు ఒప్పుకున్నాడు.

"వాడికీ, వాడి మిల్లులో పని చేసే సూరమ్మకీ సంబంధం వుందని, వాడి పెళ్లానికి నమ్మకంగా తెలిసే ఏర్పాటులు చేయిస్తున్నాను. సూరమ్మ మొగుడికి కల్లు పోయించి వదిలామంటే, సత్యంని చావగొట్టే పని వాడే చూసుకుంటాడు. ఇన్నాళ్లూ ఏమీ చెయ్యలేక నోరు మూసుకున్నాడు. మనం మద్దతిచ్చామంటే ఎంత పనైనా చేస్తాడు', అన్నాడు దామోదరం చిన్న చిరునవ్వు నవ్వుతూ. రంగారావ్ కూడా రెండు సిగరెట్టు దమ్ములు పీల్చాడు.

"అయితే ఇప్పుడప్పుడే వాడి విషయం కలుగజేసుకో వద్దంటారు." అన్నాడు రంగారావు మెల్లిగా.

"అంతేనప్పా. వాడు ఏమి చేస్తాడు. వాగితే వాగనీ, వాడికి ఇంటా బయటా కూడా మనశ్శాంతి లేకుండా చేసే పూచీ నాది."

ఇంతలో ఒక పొడుగాటి ఎర్రని వ్యక్తి సుమారు నలభై ఏళ్లవాడు, గిరజాలు తిరిగిన వెంట్రుకలతో, ఖద్దరు బట్టలతో చంకలో గొడుగుతో ప్రవేశించాడు. అతనొక పల్లెటూరి ఆసామి.

"అయ్యారు బాబో! నన్ను నవ్వమంటావో బతకమంటావో సెప్పేయండి. నాకేటీ తోఁటం లేదు." అని మొదలెట్టాడు.

"ఏం సూరప్పడూ? ఏమొచ్చింది? ఇం! నాలుగురోజులే వుంది కదా ఎలక్షన్లకు అన్నీ సరిగా చేస్తున్నారా?" అనడిగాడు

సుప్రభాతం

దామోదరం.

"ఏటి సెయ్యడం బాబు. దొంగ యెదవలందరూ సేరి, నా పరువు గంగలో కలిపెయ్యాలని సూస్తున్నారు. నాకేటి తెలవకుండా వుంది. దీనాని కొకరకంగా రంగు పిరాయిస్తున్నారు. ఏటవుతదో, ఏటో అని బెంగ సేత, సస్తున్నాను. కూడు నోటికెక్కడం లేదు. ఆ బగమంతుడే రచ్చించాలి. ప్రకాశం వూళ్ళో లేడు. నాకేటి తోసటంలేదు."

"ఏం ఒచ్చిందయ్యా. నీ గోలేదో నీదే గాని అసలు సంగతేమిటో చెప్పవేం?" అని అడిగాడు రంగారావు.

"సెప్పడానికేటుంది. ఇప్పటికి పదేలు, ఖర్చయింది. ఇంకో పది పదేను వేలు ఖర్చయ్యేటట్టుంది."

"డబ్బు గురించా నీ బెంగ? మరి ఎలక్షన్లంటే ఏమనుకున్నావ్? మనం మొదట్లో అనుకున్నదేగా?" అన్నాడు బదిరి.

"సాహె! డబ్బు గురించి కాదయ్యా. డబ్బింకొక పదేలు పారెయ్యమన్నా పారేస్తాను. పేరు కోసం సస్తున్నాను. ఓడిపొయ్యామంటే సిగ్గుకాదూ."

"అదా, నీ బెంగ?" అనడిగాడు రంగారావు, వెటకారంగా.

"ప్రకాశం మాటలిని ఇందల దిగాను. అతగాడు హైదరాబాదెల్లి ఆడనే వుండిపొయ్యాడు. మరి అయ్యోరు బాబే ఏదో కీటుకు సెప్పాలి. నేకపోతే గోరంగా, 'మడ్డర్లు' జరిగిపోతాయి, మా యూళ్ళో."

అతని మాటలు వింటూ అతని ఆత్రుతనంతా గమనిస్తూ, చుట్టు కాలుస్తున్న, దామోదరం, రంగారావుని, బదిరిని, ఊరుకోమని కనుసంజ్ఞ చేసి, "అయితే ఇంతకీ నీకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదెవరు? మనం అనుకున్న ఓట్లలో నీకు రావేమోనని సందేహంగా వున్న వెన్ని?" అని మెల్లిగా ఆరా తీశాడు.

సూరప్పడు కొంచెం గొంతుకు తగ్గించి, "నాగన్నా, యిరన్నా, ఆడి బామ్మరిదీ, యీళ్ళు ముగ్గురూ, ఇటూ, అటూ వూగుతున్నారు. ఆళ్ళు నాకాడ నాకేస్తామంటున్నారు. గవరయ్య కాడ ఆడి కేస్తామంటున్నారు. సివరి కేటిసేస్తారో తెలవకుండా వుంది. ఆ మూడోట్లూ పడకపోతే నాబంనేదు. ఆళ్ళకు డబ్బు కాతర్నేదు. సివరి కంటా ఆళ్ళను మనమాట యినేట్టు సేసామంటే, నెగ్గామన్నమాటే. గవరయ్య ఆళ్ళను యిడవకుండా, ఆళ్ళ సుట్టూ తిరుగుతున్నాడు."

"ఒస్ ఇదా సంగతి. ప్రకాశం పేరు చెప్పు! నీకు ఓట్లు వేస్తే వాళ్ళకు ప్రకాశంతో చెప్పి ఏదైనా కోటా యిప్పిస్తానను. కో ఆపరేటివ్ బాంకు మన చేతిలో వుందని వాళ్ళకు తెలుసుగా." అన్నాడు రంగారావ్.

"అయ్యన్నీ ఆళ్ళకు తెలుసు. కాని గవరయ్య ఆళ్ళకేటి బోదసేస్తున్నాడో తెలవకుండా వుంది. ఆడంటే మోజు పడ్తున్నారు. నాకు మహా పెద్ద అనుమానంగా వుంది. దీనికి అయ్యోరు బాబు ఏదో సెయ్యాలి నేకపోతే నాబంలేదు." అని ఖచ్చితంగా చెప్పాడు సూరప్పడు.

"వాళ్ళని విడిచిపెడ్తే లాభంలేదప్పా."

"అదే నాను సెప్తున్నాను."

"అయితే ఒక పనిచెయ్యి. ఎలక్షను ఇక రెండురోజు లుండనగా వాళ్ళను ఇక్కడకు తీసుకురా. ఆ రెండురోజులూ వాళ్ళిక్కడనే వుండే ఏర్పాట్లు చేద్దాం. సరిగ్గా ఎలక్షన్ టైముకి కారు మీద వాళ్ళని తీసుకొస్తాను. వాళ్ళ ఓట్లు నీకు వేయిస్తాను."

"అగ్గదీ. అదే రైటైన పని."

"దానికి కర్తవ్యం ఏందో తెలుసా సూరప్పడూ." అని అడిగాడు, రంగారావు. సూరప్పడు ఆలోచనగా మొహం ముడిచాడు.

"వాళ్ళిక్కడ వూరికే వుండరు కదయ్యా వాళ్ళ కోసం అన్ని ఏర్పాట్లూ చెయ్యాలి. వాళ్ళకు హమేషా కాపలాగా మరి ముగ్గురుండాలి. వీళ్ళందరికీ బుడ్లు కావాలి. జోరుగా పేకాట సాగాలి. ఇంకా వాళ్ళేవర్ని కావాలంటే వాళ్ళని తీసుకురావాలి. మరి వీళ్ళందరికీ భోజనం ఖర్చులూ, అన్నీ వుంటాయి కదా." అన్నాడు దామోదరం.

"లవునవును. ఖర్చవుతుంది" ఆలోచనగా అన్నాడు సూరప్పడు. ఒకవైపు డబ్బు ఖర్చు తల్చుకుంటే మనసు నీరయిపోవడం, మరొక వైపు ఎలాగైనా పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు నవ్వాలనే పట్టుదలా, ఒకదాని తరువాత ఒకటి అతననుభవిస్తున్నాడు ఈమధ్య. ఇంతవరకూ దిగాక తను వెనుదీసి లాభంలేదనే నిర్ణయానికి రాసాగాడు. అతనిని తక్కిన వాళ్ళు గమనించసాగారు.

సూరప్పడిది, రామవరానికి అయిదు మైళ్ళ దూరంలో వున్న నవనంపాడు.

మొదట్లో ఏపీలేని వాడైనా, క్రమక్రమంగా పేరెత్తుకొచ్చి, లక్షాధికారయ్యాడు. పేరు పెరగా, పొలా, వ్యాపారం చేసి డబ్బు చేరే వరకూ, డబ్బు కోసం పడిన తాపత్రయ మంతా డబ్బు వచ్చాక అధికారం మీద వ్యామోహంగా మారింది. పదిమంది తన చుట్టూ చేరి, "ఓహో నారప్పడుగారు!" అని, తనని గౌరవించాలనే వాంఛ, ప్రబల మైంది. డబ్బు చాలామంది దగ్గరుంటుంది. కానీ, పలుకుబడీ, అధికారం లేని డబ్బుకు విలువేది? అందువల్ల నారప్పడికి రాజ కీయాల మీద మోజు ప్రారంభమైంది. ప్రకాశం చుట్టూ తిరగడం మొదలెట్టాడు. ఇలాంటి వాళ్ళని ప్రోత్సహించి, ఎలక్షన్లలో గెలిపిస్తే, వాళ్ళు తనకు బాగా ఉపయో గిస్తారని ప్రకాశానికి తెలుసు. ఆ చుట్టు ప్రక్కల గ్రామాలలో చాలాభాగం, ప్రకా శం యొక్క ఆశ్రితులే పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్లుగా వున్నారు. ఎలక్షన్లలో ఎప్పుడెలాంటి ఎత్తులు వెయ్యాలో దామో దరానికి కొట్టిన పిండి. అతను పథకం వేసి డంటే, అంతవరకూ గెలవడనుకున్న అభ్యర్థి అకస్మాత్తుగా గెలుస్తాడు. అందువల్ల అందరూ దామోదరం సహాయం అర్థిస్తారు. నారప్పడు పంచాయితీ బోర్డు మెంబరు కాగలిగాడు. కాని ప్రెసిడెంటు అవడానికి, డబ్బొక్కటే పని చెయ్యదని, తన ప్రతి స్పర్థి అయిన గురవయ్య, తనంత డబ్బు కలవాడు కాకపోయినా, పరువు ప్రతిష్ఠ లలో మొదటి నుంచీ ఆ గ్రామంలో ఒక ప్రత్యేకస్థానాన్ని ఆక్రమించి వుండడం వల్ల, మెంబర్లలో చాలామందికి అతనంటే సదభి ప్రాయం వుందని తెలుసుకున్నాడు. ముఖ్యంగా నాగన్న, వీరన్న, నాడి రావు మరిదీ, వీళ్ళు గురవయ్య పక్షం అయ్యారో తనకు వోటమి తథ్యం. అందువల్ల దామోదరం సలహా పాటించక తప్పదు. ఖర్చు విషయంలో దామో దరం చెయ్యి ఎలాటిదో అందరికీ తెలుసు. అప్పుడే ఏటిమ్మంటారో చెప్పండి?" అన్నాడు వాళ్ళకేసి చూస్తూ.

(సశేషం)

చిత్రలహరి

మోహినీ భస్మాసుర

తపస్సుచేశాడని భస్మాసురునికి శివుడు వరం ప్రసాదించాడు. అది తన అవసరానికి ఉపయోగపడలేదని భస్మాసురుడు ఆగ్రహం చెంది శివుని మీదనే ప్రయోగించ బోయాడు. విపత్తు గుర్తించి శివుడు పరుగు లంకించుకున్నాడు. భస్మాసురుడు అతన్ని వెంబడిస్తున్నాడు. విష్ణుమూర్తి శివునికి వచ్చిన ఆపద గుర్తించాడు. భస్మాసురునికి అంతిమ సమయం ఆసన్నమయినదని తలచి



ప్రేమలో ప్రమాదంలో జ్యోతి

మోహిని రూపం దాల్చాడు. మోహిని సౌందర్యాలకు భస్మాసురుడు ఆకర్షితుడయి నాడు. "నీలో ఏదో అపూర్వమయిన శక్తి గోచరిస్తున్నది" అన్నాడామెను ఆశ్చర్యంగా చూస్తూ. మోహిని చిరునవ్వు నవ్వి "నీ తపశ్శక్తి కంటే నా ఆత్మశక్తి గొప్పది. అదే నాలో నీవు చూస్తున్నది" అంది. "ఆ శక్తితో నా బిడ్డను బ్రతికించుకోగలనా?" అడిగాడు. "తప్పకుండా!" బదులు చెప్పింది. "అయితే ఆశక్తి నాకు ప్రసాదించు!" అంటూ అడిగాడు ఆత్రుతగా భస్మా సురుడు. "అది నీవు సంపాదించేందుకు ముందు అందచందాల్ని ఆరాధించాలి. ఆట పాటల్ని అలవరచుకోవాలి అప్పుడు నీ బిడ్డను బ్రతికించుకోవడమేగాదు. ఏ కార్యమయినా సాధించుకోవచ్చును" అన్నది మోహిని. ఆమె ఆదేశానుసారం నృత్యముద్ర పెంటపడ్డాడు, భస్మాసురుడు. విష్ణుమూర్తిగా కాంతారావు, భస్మాసురునిగా యస్. వి. రంగారావు, శివుడుగా రామకృష్ణ, మోహినిగా పద్మిని నటించిన రసవత్తరమయిన ఈ దృశ్యం బి. ఏ. యస్. ప్రొడక్షన్స్‌వారి "మోహిని భస్మాసుర" చిత్రంలోనిది. కథ: గబ్బిట, సంగీతం: రాజేశ్వరరావు, నిర్మాత, దర్శకుడు బి. ఏ. సుబ్బారావు. ఆంధ్రలో యీ చిత్రం నవయుగ ఫిలింస్ ద్వారా నవంబరు చివరి వారంలో విడుదల అవుతుంది.

కంచుకోట

విశ్వశాంతి పిక్చర్స్‌వారు భారీయెత్తున నిర్మిస్తున్న "కంచుకోట" చిత్రంలో ఆరు నిమిషాల పాటు వుండే ఒక పాటను యిటీవల చిత్రీకరించారు. "ఈ పుట్టిన రోజు" అని ప్రారంభం అయ్యే యీ పాట చిత్రీకరణలో సావిత్రి, దేవిక, 40 మంది నర్తకీమణులు, 7 గురు బాలికలు పాల్గొన్నారు. పల్లవికి ఒకటి, మూడు చరణాలకు మూడు — (మాధవీదేవి మందిరం, నక్షత్ర మండలం, హిమాలయ శిఖరం, మానస సరోవరం) — మొత్తం నాలుగు సెట్స్‌వేసి, పది కాల్‌షీట్లలో పాట చిత్రీకరణ పూర్తి చేశారు. ఈ పాట చిత్రీకరణకు ప్రత్యేకంగా 35 వేల రూపాయలు వ్యయం అయింది. హంస, నెమలి కన్నెలకు, దేవికకు శ్రీ నారాయణరావు తయారు చేసిన దుస్తులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నవి. కళాదర్శకుడు: యస్. కృష్ణారావు. ఈ గీత రచయిత దాశరథి, నేపథ్యగాయని: సుశీల. సంగీతం: కె.వి. మహదేవన్. దర్శకుడు: సి. యస్. రావు. నిర్మాత: యు. విశ్వేశ్వరరావు బి.యస్.సి.

ప్రైవేటు మాస్టారు

డి బి.యస్. ఫిలింస్ వారి "ప్రైవేటు మాస్టారు" చిత్రం గతనెల 27 వ తేదీ రాత్రి 8 గంటలకు విజయా స్టూడియోలో ప్రారంభించారు. ప్రారంభానికి శ్రీ కె. శరభయ్య శర్మ (నవయుగ), టి. గోవిందరాజన్ (అశోక్ మూవీస్), గుమ్మడి, కె.వి. మహదేవన్, వి. శివరాం, ఎం.కె. రాజా, భద్రయ్య (మేకప్) ప్రభృతులు హాజరయినారు. తొలిషాట్— యీచిత్రంలో ప్రధాన భూమిక ధరిస్తున్న కాంచనపై తీశారు. రామ్మోహన్, కృష్ణ, సుకన్య, అల్లు రామలింగయ్య, గుమ్మడి, రేలంగి, పుష్పకుమారి, సురభి బాలసరస్వతి యితర ముఖ్య తారాగణం. కథ: ముళ్ళపూడి వెంకటరమణ, దర్శకుడు: కె. విశ్వనాథ్, నిర్మాతలు: డి.వి. నారాయణ, టి.వి.యస్. శాస్త్రి.

విజయరాముడు

జయా ప్రొడక్షన్స్ వారి "విజయ రాముడు" జానపద చిత్రానికి విజయ దశమినాడు పూజ జరిపి— భరణీలో పాట రికార్డింగ్‌తో ప్రారంభించారు. "చెలరేగెను నీ అందాలే, అలలైనవి నా భావాలు" అనే ఆరుద్ర రాసిన యుగళ గీతాన్ని వసంత, జయదేవ్ ఆలపించారు. రాయల్ ఫిలింస్‌కు చెందిన శ్రీ వెంకట నారాయణరావు— ఈ చిత్రంలో ముఖ్య భూమికలు పోషిస్తున్న రాజశ్రీ, కాంతా రావు, రాజనాల ప్రభృతులు హాజరయ్యారు. సంగీతం: టి. చలపతిరావు, దర్శ



భూలోకంలో యమలోకంలో
కాంతారావు, రాజశ్రీ



"ఇద్దరు మొనగాళ్లు"లో కృష్ణ, కృష్ణకుమారి

కుడు: అమంచర్ల శేషగిరిరావు, రచన: వేటూరి సుందర రామమూర్తి, నిర్మాత: డా. ఇ. అప్పారావు.

రంగులరాట్నం

ఆ రోజున "రంగుల రాట్నం"లో జానపద నృత్యం ఒకటి చిత్రీకరిస్తున్నారు. కొత్తనటుడు చంద్రమోహన్, వాణిశ్రీ— కదితరులు పాల్గొన్నారు. డిసెంబరుకు చిత్రం సిద్ధం కాగలదని శ్రీ బి. యన్. చెప్పారు. కెమేరా. రాజగోపాల్, సంగీతం: రాజేశ్వరరావు నిర్వహిస్తున్నారు.

నిశరాత్రి 12 గంటలకు....

ప్రేమ మూవీస్ అనే కొత్త సంస్థ "నిశరాత్రి 12 గంటలకు...." అనే అపరాధ పరిశోధక చిత్రాన్ని నిర్మించనున్నది. కాంతా రావు, రాజనాల, రామకృష్ణ, రామ్మోహన్, పి. సాంబశివరావు, సుకన్య వాణిశ్రీ, జయ కృష్ణ ముఖ్య భూమికలు పోషిస్తారు. గతనెల 28న ఆత్రేయ రాసిన రెండు పాటలు విజయాగార్డెన్ థియేటర్‌లో రికార్డ్ చేశారు. వాటిలో ఒకటి "నేనంటే నేనే.. నువ్వంటే నేనే — ఎవరేమన్నా నేను నేనే!" అనేది. ఆలపించిన గొంతు సుశీలది. మరొకటి "పూరికే పిలిచినందుకు ఉలికి ఉలికి పడతావెందుకు?" — సుశీల, జేసుదాసు కలిసి పాడారు. ఈ రెండు గీతాలకూ చక్కటి వరుసలు చేసి సమర్పించినది సంగీత దర్శకుడు యస్. పి. కోదండ —శ్రీ. కళ మోడ్‌గాంకర్, కెమెరా రాజ గోపాల్ నిర్వహిస్తారు. కథ, మాటలు, దర్శకత్వం: కె.వి.ఆర్. ఆచార్య, నిర్మాత: డి. వెంకటేశ్వరరావు. నవంబరు మధ్య నుంచి షూటింగ్ ఆరంభించగలరని తెలుస్తున్నది.

ఆ వే క ళ్లు

ఏ. వి. యం. వారి రంగుల సాంఘికం "ఆవేకళ్లు" ఇన్‌డోర్‌లో షూటింగు యీనెల మొదటి తేదీనుంచి ఆరంభించారు. కృష్ణ, కాంచన, రాజనాల, నాగభూషణం, పద్మనాభం, యస్. వి. రామదాసు, రమణారెడ్డి, గీతాంజలి, జయంతి, పుష్పకుమారి ముఖ్యభూమికలు పోషిస్తున్నారు. సంభాషణలు: డి. వి. నరస రాజు, సంగీతం: వేదా, దర్శకుడు: ఏ. సి. త్రిలోక్‌చందర్ ఎం. ఏ.

వాసు స్టూడియోస్

వడపళనిలో గల ఫిలిప్స్ సెంటర్ స్టూడియో యికనుంచి 'వాసు స్టూడియోస్' పేరుతో వ్యవహరింపబడుతుంది. నిర్మాత శ్రీ యస్. వాసుమీనన్ ఈస్టూడియోను 15 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. ఇపుడు దీనిని అధునాతనంగా సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారాయన. ప్రస్తుతం యీ స్టూడియోలో ఒక ఫ్లోరు మాత్రమే ఉన్నది. మరొక రెండు ఫ్లోర్లు కట్టిస్తున్నారు. అందులో ఒకటి నవంబరు 15 ప్రాంతాలకు సిద్ధమవుతుంది. ఈ స్టూడియోలో గల రికార్డింగ్ థియేటర్‌లో యితర నిర్మాతలు కూడ రికార్డింగ్ జరుపుకునే సౌకర్యం కల్పించారు వాసుమీనన్. అధునాతన పరికరాలు కలిగిన లేబరేటరీ ఉన్నది.

ఇపుడు శ్రీ వాసుమీనన్ డాక్టర్ నిహార్‌రంజన్ గుప్త "తాసపి" (బెంగాలీ) ఆధారంగా, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో చిత్రాలు నిర్మిస్తున్నారు. ఈ త్రిభాషా చిత్రాలు ఏకకాలంలో నిర్మింపబడుతున్నవి.

న యా రో ష్ నీ

హిందీ చిత్రానికి "నయా రోష్నీ" అని నామకరణం చేశారు. శ్రీధర్ దర్శకత్వం వహిస్తున్న యీ చిత్రంలో అశోక్ కుమార్, రాజకుమార్, బిశ్వజిత్, మాలా సిన్హా, తనూజ, సులోచన, అన్వర్‌హుసేన్, అసిత్‌సేన్, అరుణారాయ్ నటిస్తున్నారు. తమిళ చిత్రానికి "పువ్వుం పొట్టుం" అనే పేరు పెట్టారు. తెలుగు చిత్రం గత నెల 24 నుంచి షూటింగు జరుగుతున్నది.

తెలుగుచిత్రం

ఈ త్రిభాషా చిత్రాలలోను పద్మశ్రీ భానుమతి ముఖ్యభూమిక పోషిస్తున్నది. యస్. వి. రంగారావు తెలుగు, తమిళ చిత్రాలలో నటిస్తున్నారు. భానుమతి, రంగారావులతో పాటు. యస్. టి. [illegible]మారావు, కృష్ణకుమారి, శోభన్‌బాబు, హరనాథ్, పండరీబాయి, భారతి, నాగయ్య, అల్లు రామలింగయ్య, రాధాకుమారి, ఋష్యేంద్రమణి తెలుగు చిత్రంలో పాల్గొంటున్నారు. సంభాషణలు: డి. వి. నరస రాజు, సంగీతం: ఘంటసాల నిర్వహిస్తున్నారు. తెలుగు తమిళ చిత్రాలు రెండింటికీ, కెమెరా: జాగీర్దార్, దర్శకుడు: దాదామిరాసి. వీటి వెనువెంట రెండు మలయాళ చిత్రాలను కూడ నిర్మించాలనే సంకల్పంలో వున్నారు, శ్రీ వాసుమీనన్. అవి ఒకటి ఇరుటిండే ఆత్మావు, (డార్క్‌నెస్ ఆఫ్ ది సోల్), మరొకటి మనస్విని.



"ఆ సిపరుణు"లో జయలలిత

—మోహన్ కుమార్

భాషా సాహితి

జవాబులు

(22వ పేజీ తరువాయి)

క. అంగుళానికి 90 గీతలున్నాయన్న సమాచారం అనవసరం. గ్రామఫోను ముల్లు ప్లేటు చుట్టూ తిరుగదు కదా! తిరిగేది ప్లేటు. ముల్లు కాదు. ముల్లు ప్లేటుకి చివర మొదలుపెట్టి మధ్యకి ప్రయాణం చేస్తుంది. ప్లేటు వ్యాసార్థం 6 అంగుళాలు. అంచున అంగుళము, మధ్యలో 2 అంగుళాల దూరము కదలనక్కర లేదు కనుక, ముల్లు ప్రయాణం చేసిన మొత్తం దూరం 6–(2+1)=3 అంగుళాలుమాత్రమే!

చ. యజమాని చెప్పినది నిజం. ఏమంటే: మర్ఫీ రేడియో అమ్మిన ధర 240 రూ. నష్టం 20% కనుక కొన్న ధర 300 రూ.లు. బుష్ రేడియో అమ్మిన ధర 240 రూ. లాభం 20%. కనుక కొన్న ధర 200 రూ. మొత్తం రెండు రేడియోలూ కొన్న ధర 500 రూ. అమ్మిన ధర 480 రూ. కనుక నష్టం 20 రూపాయలు.

ట. సీసా ఖరీదు అర్ధ రూపాయి మాత్రమే. షర్బత్తు ఖరీదు నాలుగున్నర మొత్తం 5 రూ.

త. ఈ సమస్యకు ఇచ్చే సమాధానాలు చాలా చిత్రంగా ఉంటాయి. "వంద మైళ్లనా పెంచాలేమో" అంటారు కొందరు నసుగుతూ. "అబ్బే! ఎక్కడి వందా, వెయ్యి మైళ్లపై చిలుకువూటే" అంటారు కొందరు భూమి చుట్టుకొలత 25000 మైళ్లు అని జ్ఞాపకం వచ్చి. నిజానికి పెంచవలసిన పొడవు 6 అడుగుల 3 అంగుళాలు మాత్రమే ! ఎల్లాగ అంటారా? భూవ్యాసార్థం R అడుగులు అనుకో. దానిచుట్టుకొలత $2\pi R$ అడుగులు. ఒక్క అడుగు పెంచితే చుట్టుకొలత $2\pi(R+1)$ అవుతుంది. అంటే ఇదివరకటికన్న 2π అడుగులు మాత్రమే పెరిగింది. π విలువ సుమారు 3.14 కనుక పెంచవలసిన పొడవు '6 అ—3 అం.

వ. రంగన్నకు రూపాయి పదిపైసలు నష్టం.●

చైనా

(12–వ పేజీ తరువాయి)

పోలీసువారు రక్షిస్తారు. అతను వారికి తన 'విషాదగాథ' చెప్తాడు. తను తప్పించుకు వచ్చేస్తూ ఉంటే ఎలా ప్రమాదానికి గురి అయ్యాడో చెప్తాడు. తర్వాత పాశ్చాత్య దేశాలవారికి చైనాలో దారుణ పరిస్థితులని వివరిస్తాడు. అతన్ని కాందిశీకుడిగా స్వీకరిస్తారు. కాని అతనుగూఢచారి...

మరొక వింత పద్ధతి ఉంది. చైనా అధికారులే దొంగ కాందిశీకులని పంపించి రోమన్ కాథలిక్ మిషన్ వారివద్ద మనిషికి 25 రూ. ల చొప్పున వసూలు చేయిస్తారు. ఈడబ్బంతా పాశ్చాత్యదేశాల జనుల పన్నులలోనుంచి వచ్చింది కాబట్టి వాళ్లకి మరింత సంతోషం.......

"బుద్ధిహీనుడు ధనం పోగొట్టుకొనా లనుకుంటే వాడికి సహాయపడు" అని ఒక చైనా సామెత ఉంది.(అయిపోయింది)●

అవీ...ఇవీ

ఇండియన్ ఆక్సిజన్ ఉద్యోగుల సమావేశం

మద్రాసులోని ఇండియన్ ఆక్సిజన్ కంపెనీ ఉద్యోగులు దసరా పండుగ సందర్భంలో 23—10—66 వ తేదీ సాయంత్రం స్థానిక తండియార్ పేట లోని తమ ఫ్యాక్టరీ ఆవరణలో ఒక సాంస్కృతిక సమావేశాన్ని జరిపారు. శ్రీ ఎ. శ్రీనివాసరాఘవన్ ప్రార్థనా గీతంతో సమావేశం ప్రారంభమైంది. శ్రీమతి షావుకారు జానకి ప్రధాన అతిథిగా విచ్చేసి గత సంవత్సరం ఆటల పోటీలలో విజయం పొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. తరువాత శ్రీ డి. ఎస్. సారంగపాణి పార్టీవారి లలిత సంగీత కచేరి జరిగింది. అనంతరం శ్రీ వి. సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. ●

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA